RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

15 నవంబర్ 2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:141

## క్రమశిక్షణతో చిల్డ్రెన్ మాక్ అసెంబ్లీ నిర్వహించారు

# రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** దేశంలో చట్ట సభలకు పోటీ చేయడానికి వయో పరిమితిని 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ పిల్లల మాక్ అసెంబ్లీ తీర్మానం చేసి దేశ ప్రధానమంత్రి కి, రాష్ట్రపతి గారికి పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించడం వల్ల యువత చట్ట సభల్లోకి రావడానికి అవకాశం ఏర్పడటమే కాకుండా వారి అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు చేసి రాణిస్తారని అన్నారు.

దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున బాలల దినోత్సవం పురస్కరించుకుని చ%ాజజు=ు% ప్రాంగణంలో 18 ఏళ్ల లోపు బాలబాలికలు మాక్ అసెంబ్లీని అద్భుతంగా నిర్వహించారు.



ఈ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క , మంత్రి పొన్నం ప్రభాకర్ తో కూర్చొని వీక్షించించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ఎంతో క్రమశిక్షణతో చిల్డ్రెన్ మాక్ అసెంబ్లీ నిర్వహించారంటూ అభినందించారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ నాయకత్వంలో దేశంలో ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేస్తూ చట్ట సభలకు పోటీ చేయడానికి విధించిన వయో పరిమితిని కూడా 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ తీర్మానం చేయాలి.

ఆ తీర్మానాన్ని రాష్ట్ర ఎంపీలకు పంపించాలి. తద్వారా పార్లమెంట్ సమావేశాల్లో వారు ఈ అంశాన్ని లేవనెత్తడానికి అవకాశం ఉంటుంది.

భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా, భవిష్యత్తు సమాజానికి అవసరమైన శాసనాలు చేయాలన్న సంకేతాలిస్తూ మాక్ అసెంబ్లీ నిర్వహించడం ప్రశంసనీయం.

ఈ రోజుల్లో కొందరు చట్ట సభలను ఎప్పుడు వాయిదా వేయిద్దామన్న దిశగా ఆలోచన చేయడం దురదృష్టకరం.

రాజకీయాలంటే ఈనాడు ఒక రకమైన భావన నెలకొంది. మాక్ అసెంబ్లీ నిర్వహించిన వారిలో కొందరైనా రాజకీయాల్లోకి రావాలి.

మాక్ అసెంబ్లీలో అండర్ 18 హెడ్ క్వార్టర్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ, హైడ్రా వంటి బిల్లులపై చర్చించడం అభినందనీయం.

పండిట్ నెహ్రూ గారు దేశంలో తీసుకొచ్చిన విద్య, వ్యవసాయ విప్లవం వల్ల సమాజంలో అనేక అవకాశాలు వచ్చాయి.

యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ కృషితో దేశంలో నిర్బంధ విద్య అమలులోకి వచ్చింది.

ఇలాంటి మాక్ అసెంబ్లీ సమావేశాలు సమాజానికి చాలా అవసరం. చట్ట సభల్లో జరుగుతున్న చర్చలు, ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలి.

## రిషికొండ ప్యాలస్ నిర్మాన ఖర్చు రూ 409 కోట్ల 39 లక్షలు

### మంత్రి కందుల దుర్గేష్




అమరావతి శాసనసభలో రిషికొండ ప్యాలెస్ కు సంబంధించి జరిగిన చర్చలో సభ్యుల ప్రశ్నలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వివరణ ఇచ్చారు. మొదటి ప్రశ్నకు సమాధానంగా విశాఖపట్నం జిల్లా ఎండాడ గ్రామంలో సర్వే నెంబర్ 19 లో రిషికొండ పైన ఉన్నటువంటి 61 ఎకరాల విస్తీర్ణంలో 9 ఎకరాల 88 సెంట్లలో భవనాన్ని నిర్మించడం జరిగింది. 7 బ్లాక్ లతో ఉన్నటువంటి ఒక రిసార్ట్ ను ఏపీ టీడీసీ వాళ్ళు నిర్మించడం జరిగింది. రిషికొండలో భవనాల నిర్మిత విస్తీర్ణం పరిశీలిస్తే విజయనగరం, కళింగ, గజపతి, వేంగి బ్లాక్ లతో కలిపి మొత్తం ఐదు బ్లాక్ లు ఉన్నాయి. ఏ బ్లాక్ లో మళ్ళీ మొత్తం మూడు బ్లాకులు ఉన్నాయి. అన్ని బ్లాక్ ల నిర్మిత విస్తీర్ణం 1,45,765 చదరపు అడుగులు.. వీటి కోసం రూ. 222 కోట్ల 92 లక్షలు ఖర్చు అయ్యింది. భవనాలు కాకుండా చేపట్టిన మిగితా పనులు చూస్తే హార్డ్ స్కేపింగ్, స్లో ప్రొటెక్షన్ వర్క్.. వీటన్నింటికీ కలిపి రూ. 186 కోట్ల 47 లక్షలు ఖర్చయింది. 9 ఎకరాల 88 సెంట్లలో జరిగిన భవనాల నిర్మాణానికి, ఇతర పనులకు సంబంధించి మొత్తంగా రూ. 409 కోట్ల 39 లక్షలు ఖర్చు అయింది. దీనికి సంబంధించి ఒక్కొక్క చదరపు అడుగుకు (ఎస్ఎఫ్టీ కి) రూ. 23,261 ఖర్చు అయింది. రెండవ ప్రశ్నకు సమాధానంగా ఇతర అంశాలకు కోసం దాదాపు రూ. 71 కోట్ల 91 లక్షలు ఖర్చు అయింది. ఇది ఎండాడలో రిషికొండ భవనాల నిర్మాణానికి చేసిన వ్యయం, ఎన్ని ఎకరాల్లో భవనం నిర్మించారు అనడానికి సమాధానమని అన్నారు.

## మీ భవిష్యత్తు ..రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం చూస్తుంది.

### ఎల్బీ స్టేడియంలో జరిగిన బాలల దినోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మీ భవిష్యత్తు ..రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం చూస్తుంది. ఎన్ని ఒడిదుడుకులు అయినా ఎదుర్కొంటాం.. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆలోచనలను ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకుపోతున్నది.

విద్య వ్యవస్థకు పునాదులు వేసిన నెహ్రూ బాటలోనే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ఐదు వేల కోట్ల రూపాయలు వెచ్చించింది.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లకు పైగా కేటాయించి విద్యార్థులకు సకల సౌకర్యాలు వసతులు కల్పించింది.

గత 10 ఏళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించడానికి మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచలేదు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి మండలి సభ్యులందరం ఆలోచన చేసి విద్యార్థులకు 40% మెస్ చార్జీలు పెంచాము.

గత పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్ అందించలేదు.

ప్రజా ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభమైన రోజునే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను అందించింది.

దేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత గుండు సూది సైతం ఉత్పత్తి చేయలేని ఈ దేశంలో పంచవర్ష ప్రణాళికలు ఏర్పాటు చేసి భారతదేశం యొక్క పారిశ్రామికీకరణ, శాస్త్రీయ అభివృద్ధి, విద్యా విస్తరణకు నెహ్రూ పునాదులు వేసినందునే అంతరిక్షంలోకి రాకెట్లను పంపే అభివృద్ధికి దేశం పురోగతి చెందింది.

ఆధునిక దేవాలయాలు పిలుచుకునే బహుళార్ధక సార్థక ప్రాజెక్టులు ఆయన ఆలోచనలే. కృష్ణానదిపై నాగార్జునసాగర్, గోదావరి నదిపై ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నిర్మించి ఈ రాష్ట్రం మీదుగా రెండు జీవ నదులు పారించేందుకు చాచా నెహ్రూ వేసిన పునాదుల ఫలితంగానే తెలంగాణలో లక్షల ఎకరాలకు, వేల గ్రామాలకు సాగు తాగు నీరు అందుతున్నది.

శాస్త్రీయ విద్య, ఉపాధి కల్పనకు ఐఐటీలు, ఎయిమ్స్ వంటి సంస్థల స్థాపనకు నెహ్రూ వేసిన పునాదులే.

భిన్నత్వంలో ఏకత్వంతో ఈ దేశాన్ని నడిపి అటు అమెరికా కూటమి ఇటు రష్యా కూటమికి దూరంగా అలీన విధానంతో సమదూరం పాటించి స్వతంత్రంగా వ్యవహరించి ప్రపంచ దృష్టిని మన తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆకర్షించారు.

ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన నెహ్రూ జీవితం ఆయన అనుసరించిన అలీన విధానం అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు సైంటిఫిక్ టెంపర్మెంటు ఈ దేశానికి ఇప్పటికీ ఎప్పటికీ దశా దిశా నిర్దేశంగా ఉంటాయి.

## మంచి మార్పు కోసమే కుటుంబ సర్వే మంత్రి పొన్నం



హైదరాబాద్ బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్ లోని ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్స్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి తో కలిసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో పాల్గొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా మహమ్మద్ నయీం కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదు చేసారు. తరువాత బంజారాహిల్స్ లోని మిథాలీ నగర్ ప్లాట్ నెంబర్ 66ఽ35 లో మదిరెడ్డి ఉషశ్రీ , కిరణ్ కుటుంబాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి,అడిషనల్ కమిషనర్ స్నేహ శబరిష్ ఇతర అధికారులు పాల్గోన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 6 వ తేది నుండి ఇల్ల గుర్తింపు కార్యక్రమం 9 వ తేది నుండి ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం అయింది. తెలంగాణ ప్రజల యొక్క స్థితిగతులు భవిష్యత్తు ప్రభుత్వ ప్రణాళిక ద్వారా మంచి మార్పు తీసుకువచ్చి ఆదర్శవంతమైన తెలంగాణ గా రాష్ట్ర ప్రజలను భాగస్వామ్యులను చేసుకుని ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుంది. ఈ సర్వే తెలంగాణ దేశానికి దిక్సూచిగా ఉండే విధంగా జరుగుతుంది. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటికే 30 శాతం సర్వే పూర్తైంది. జీహెచ్ఎంసీ పరిధిలో లో 4 లక్షల 50 వేల పైగా ఇళ్లకు సర్వే జరుగుతుంది. రాష్ట్రంలో 85 వేలకు పైగా ఎన్యుమరేటర్స్ సర్వే చేస్తున్నారు. ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇక్కడ ఇన్యుమరెటర్స్ అడిగితే 150 ఇళ్లకు కేటాయించగా ఇప్పటి వరకు 26 ఇళ్లు పూర్తి చేశామని తెలిపారు. ఎక్కడ ఇబ్బంది లేదని చెప్తున్నారు. ప్రభుత్వం పక్షాన ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్న. ఈ సర్వే వల్ల ఎలాంటి పథకాలు కట్ కావు.. ఇంకా పథకాలు అమలవుతాయి. దీని వల్ల ఎలాంటి అనుమానాలు అవసరం లేదు.. సమాచారం గోప్యంగా ఉంటుంది. దీని ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్గదర్శకత్వం చేశారు. ప్రధాన మంత్రి స్పందించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. క్యాబినెట్ తీర్మానం తర్వాత అసెంబ్లీలో కూడా తీర్మానం పెట్టుకుంటామని అన్నారు. గతంలో సర్వే చేయాలని అనేక దీక్షలు ధర్నాకు చేసిన వారు సైలెంట్ గా ఉన్నారు.. అందరూ స్వాగతిస్తున్నారు. తెలంగాణలో ఉన్న అన్ని కుల సంఘాలను విజ్ఞప్తి చేస్తున్న మీ కులాలను చైతన్య పరచండి సర్వే సందర్భంగా మీ కులాలను భాగస్వామ్యం కమ్మనండి. బ్యాంక్ అకౌంట్ డిటైల్స్ అడగడం లేదు.. ఉందా లేదా అని సమాచారం మాత్రమే అడుగుతున్నాం. బ్యాంక్ ఖాతా కి ఆప్షన్ అడుగుతున్నాం. ఆధార్ కార్డు తప్పనిసరి కాదు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుంది.. అందరూ సహకరించాలి. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అధికారులు జిల్లా కలెక్టర్ లు మీ అనుమానాలు నివృత్తి చేస్తారు. ఎన్యుమరేటెర్స్ కి ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తీసుకురండి.. ప్రభుత్వ ఉద్యోగుల ఆటంకానికి ఇబ్బందులు కలిగిస్తే చర్యలు ఉంటాయి. 33 జిల్లాలో 85 వేల మంది ఎన్యుమరేటర్స్ సర్వే చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఎవరు లేరు. ఐడెంటి కార్డు ఉంది వాళ్ళు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు.సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు ఉంటాయి. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. తమిళనాడు , మహారాష్ట్ర భిన్నం. తెలంగాణ దేశానికి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆదర్శంగా నిలుస్తుంది. ఈ సమాచారం అధ్యయనం చేసి ఏ వర్గాలకు అయితే న్యాయం జరగలేదో వారికి న్యాయం చేసి దిశ దశ గా ఉంటుందని అన్నారు.

# ప్రజాబలం

15 నవంబర్ 2024 శుక్రవారం


## ట్రంప్ గెలుపుపై ఇంత ఆక్రోశమా?

అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చునే వ్యక్తి ఆలోచనలతో ప్రపంచ రాజకీయ దిశ మారుతుందని చాలామంది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అందుకు కారణాలు లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో అమెరికా రాజకీయాలను శాసించే అధ్యక్షుడు సమర్థుడు, స్థిర చిత్తుడు దృఢ చిత్తుడు కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అవసరాన్ని అమెరికాలోని దేశభక్తి కలిగిన ఓటర్లు గుర్తించారు. అందుకే ట్రంప్‌ను భారీ మెజార్టీతో గెలిపించారు. అయితే, మీడియా హౌస్‌లు, పేపర్లు, ఛానళ్లు ఇంటర్నెట్ సైట్లు మొత్తంగా ప్రజా తీర్పు డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు అనుకూలంగా ఉందని ఊదరగొట్టాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే వాటి నిజస్వరూపం బట్టబయలైంది. కమలా హారిస్ భారతీయ సంతతికి చెందిన మహిళ అని, ఈ ఎన్నికలలో ట్రంప్ గెలిస్తే-భారతీయ వలసదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటారని, హెచ్‌వన్‌బి వీసాల జారీలో నిబంధనలు కఠిన తరమవుతాయని డెమొక్రటిక్ పార్టీ చేతుల్లోని లెఫ్ట్ మీడియా చేసిన ప్రచారాన్ని భారతీ య అమెరికన్ ఓటర్లు విశ్వసించలేదని ఈ ఎన్ని కల ఫలితాలు తెలియజేస్తున్నాయి. కమలా హారిస్ తల్లి శ్యామలా గోపాలన్ భారతీయ సంతతికి చెందినప్పటికీ, ఆమెకు గానీ, ఆమె కూతురు కమలా హారిస్‌కు గానీ భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాల పట్ల, భారతీయ జీవన విలువల పట్ల సదాభిప్రాయం లేదనే విషయం తెలిసిందే. భారతీయ అమెరికన్లకు కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 ఆర్టికల్ రద్దు విషయంలో మోడీ ప్రభుత్వంపై భారతదేశ భద్రతకు వ్యతిరేకంగా జో బైడెన్, కమల హారిస్ ద్వారా నడపబడే డెమొక్రటిక్ పార్టీ ప్రభుత్వం నోరు పారేసుకోవడం, బంగ్లాదేశ్ లోని హిందువులపై జరిగిన మారణకాండను డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిగా కమలా హారిస్ ఖండించకపోవడం, అదే సమ యంలో భారతీయులు తనకు అత్యంత ఆప్తులని, బాంగ్లాదేశ్‌లో హిందువులపైన జరిపిన దాడులను తాను ఖండిస్తున్నట్లు ట్రంప్ చెప్పిన మాటలను భారతీయ అమెరికన్ ఓటర్లు బాగా నమ్మారు. ఇక ట్రంప్ గెలుపును జీర్ణించుకోలేని భారతదేశంలోని లెఫ్ట్ మీడియా, మోడీ వ్యతిరేక మీడియా, విదేశీ ఎన్జీవోల ఆర్థిక సహకారం అందుతున్న సంస్థలు తప్పుడు వ్యాఖ్యలతో వ్యాసాలు రాయడంలో తలమునకలై ఉన్నాయి. అమెరికా ఓటర్ల నిర్ణయం అమాయకమని, అనాగరికమని, అమెరికా దేశ ప్రజాస్వామ్యం గజిబిజిగా ఉందని వాపోవడంలో దాగి ఉన్న మర్మం ఏమిటి అని దేశ హితాన్ని కోరే భారతీయ మేధావులు ప్రశ్నిస్తున్నారు. సహజంగా ఏ దేశ ఓటర్లైనా ఆ దేశ భద్రతను, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, తగిన పార్టీని, తగిన అభ్యర్థిని ఎన్నికల్లో ఎన్నుకుంటారు. అమెరికన్ ఓటర్ల నిర్ణయం ఆ దేశ భద్రతకు అనుకూలంగా ఉంది. ఈ విషయంలో భారతదేశంలోని మీడి యా ప్రతినిధులు ఆక్రోశం, ఆందోళన ఎందుకు వ్యక్తం చేస్తున్నట్లు? భారతదేశంలో మే నెలలో లోక్‌సభకు జరిగిన ఎన్నికలను, నవంబర్ 5వ తేదీన జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలను పోలు స్తూ, ఇండియాలో మోడీని గెలిపించిన ఓటర్లూ, అమెరికాలో ట్రంప్‌ను గెలిపించిన ఓటర్లూ ఒకే కోవకు చెందిన అనాగరికులని దుర్వ్యాఖ్యలు చేయడంలో బిజీగా ఉన్న వారి మానసిక స్థితి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. అమెరికన్ ఓటర్ల నిర్ణయాన్ని అట్లా ఉంచితే, మూడవసారి మోడీ ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోబెట్టడంలో ఈ దేశ హితాన్ని కోరే ఓటర్లు ఎంతో నిబద్ధతను, నిజాయితీని, హేతు బద్ధతన ప్రదర్శించారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని రద్దు చేస్తుం దని, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వబడుతున్న రిజర్వేషన్లు ఎత్తివేస్తుందని, నిమ్నవర్గాలపై దాడులు పెరుగుతాయని ఇలా అనేక తప్పుడు ప్రచారాలు కాంగ్రెస్ పార్టీ నాయకులూ, దాని మిత్రపక్షాల నాయకులు చేసినప్పటికీ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమికి అధికారం అందని ద్రాక్ష పండులా మిగిలిపోయింది. పైగా ఇండియా కూటమి అనేక ఉచిత పథకాల హామీలను ఓటర్ల ముందు ఉంచింది. పైగా కుల విభజన చేసి, కులాల వారిగా రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఊదరగొట్టింది. అయినప్పటికీ ఆ కూటమిని భారతీయ ఓటర్లు తృణీకరించారు. వాస్తవంగా హిందుత్వమే జాతీయ విధానంగా ఎన్నికల బరిలోకి దిగిన బీజేపీకి వ్యతిరేకంగా ముస్లింలు, క్రైస్తవులు, కుల పిచ్చి ముదిరిన హిందువులు సంఘటితమవుతారు. ఈ ఎన్నికల్లో అదే జరిగింది. కాబట్టి ఇండియా కూటమికి 230 సీట్లు వచ్చాయి. కుల పరంగా విడిపోయిన హిం దూ సమాజం ఓటర్లను నమ్ముకుని, మూడవసారి బీజేపీకి 240 సీట్లు సాధించి, మిత్రపక్షాల సహా యంతో అధికారంలోకి రావడం ఆషామాషీ విషయం కాదు. ఆ పార్టీకి పోలైన ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే, 2019కీ 2024కు 0.6 శాతం ఓట్లు మాత్రమే వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసంతోనే 63 లోక్‌సభ సీట్లను కోల్పోయింది. ఒకప్పుడు దేశాన్ని తిరుగులేని అధికారంతో పాలించిన కాంగ్రెస్ పార్టీ ఉత్తరాది రాష్ట్రాల్లో, ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలలో తుడిచిపెట్టుకుపోయిందనే విష యాన్ని మోడీ వ్యతిరేక మీడియా దాచిపెట్టడం మీడియా పక్షపాతానికి ప్రబల నిదర్శనం. ఇక చివరగా శత్రువు మిత్రుడు శత్రువు అనే చాణుక్య నీతిని మనదేశంలోని మోడీ వ్యతిరేకులు బాగా వంట పట్టించుకుని, ట్రంప్ గెలుపుపై అవాకులు చవాకులు పేలడం, అమెరికా ఓటర్ల నిర్ణయాన్ని తప్పు పట్టడం సంస్కార హీనతగా, బుద్ధిహీనతగా పరిగణించబడుతుంది.

## సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్

డోర్నకల్ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎం ఎల్ ఏ రామ చంద్రు నాయక్ హాజరయ్యి మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.. పాఠ శాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్ నీ ఎం ఎల్ ఏ రామ చంద్రు నాయక్ ప్రారంభించారు.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ రామ చంద్రు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక భాధ్యత తో విద్యను అభ్యసించాలని సూచించారు. జవహర్ లాల్ నెహ్రూ విద్యా,ఉపాధి,వ్యవసాయ రంగాల్లో వినూత్న మార్పులు తీసుకొచ్చి దేశ ప్రగతి లో కీలక భూమిక వహించారని అన్నారు.

## గందరగోళంగా శాసనమండలి

అమరావతి గురువారం నాడు శాసనమండలి ప్రారంభం కాగానే ఒక్కసారిగా గందరగోళంగా మారింది. వైకాపా ఎమ్మెల్యసీలు సోషల్ మీడియా పోస్టులపై, అక్రమ అరెస్టులపై చర్చించాలని పట్టుబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీల నిరసన నేపథ్యంలో ఐదు నిమిషాల పాటు మండలి వాయిదాపడింది. 32 నిమిషాల పాటు వైసీపీ ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలియజేసారు. ప్రజాస్వామ్యం కాపాడాలంటూ నినాదాలు చేసారు. ఒక దశలో స్పీకర్ పోడియం ఎక్కారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ తమ రాజీనామాలను ఆమోదించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. చైర్మన్ పోడియం పైకెక్కి ప్లకార్డులు ప్రదర్శించారు.

## ఏడు వేల కొట్లకు రింగ్ రోడ్డు లీజుకిచ్చారు

నిజామాబాద్ మంత్రి జూపల్లి కృష్ణారావు హాట్ కామెంట్స్ చేసారు. గురువారం నాడు ఆర్మూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం అనేక అవినీతి అక్రమాలు చేసింది. రింగు రోడ్డు లీజు ద్వారా వచ్చిన డబ్బులతో ఇచ్చి రైతు భరోసా అమలు చేశారు. 7 వేల కోట్లు తీసుకుని 35 ఏళ్ళు లీజుకు ఇవ్వలేదా . ఇది వాస్తవం కాదని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:గోషామహల్ నియోజకవర్గంలోనిఅబిడ్స్ చౌరస్తాలో జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద గోషామహల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన కు ఘనంగా నివాళులర్పించడం జరిగినది. ఈ కార్యక్రమం లో కప్రవేణి నగేష్,సోంపరి ధనరాజ్, చంద్ర మోహన్ యాదవ్, ముంద్రాయి శ్రీనివాస్,బద్ధం సతీష్ గౌడ్,పల్లెటి నగేష్ మరియు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## గోషామహల్ నియోజకవర్గం లోని కల్తీ వ్యాపారుల పైన చర్యలు తీసుకోవాలి.

**మేయర్.శ్రీమతి. విజయలక్ష్మి కి.జీ ఎచ్ ఎమ్ సి.**
**డిప్యూటీ మేయర్ శ్రీమతి. శ్రీలతా మోతె శోభన్ రెడ్డి**
**కమీషనర్. జీ. ఎచ్. ఎమ్. సి.ని విన్నవించిన**
**బద్దం సతీష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**
**కన్వినర్. గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్.**



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి: గోషామహల్ నియోజకవర్గం లోని కల్తీ వ్యాపారుల పైన. తిను భండారాల విక్రయాల పైన చర్యలు తీసుకోవాలి.

గోషామహల్ నియోజకవర్గం లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కల్తీ ఆహార పదార్థాల నియంత్రణకు పక్కడ్బంది తనిఖిలు నిర్వహించాలి ముఖ్యంగా రద్దీ ప్రాంతాలైన బేగంబజార్ సిద్ధింబర్ బజార్ ఫీలఖనా. కోఠి.సుల్తాన్ బజార్.గౌలిగూడ స్ట్రీట్ వేండర్స్ విక్రయించే తిను బండారాలలో కల్తీ లేకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖిలు నిర్వహించాలి అస్టెటంట్ మెడికల్ ఆఫీసర్ జీ హెచ్ ఎమ్ సి వారుకూడా తరుచు నియోజకవర్గం లోని హొటల్. రెస్టారంట్ లలో తరుచు తనిఖిలు నిర్వహించాలి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులపైన పలు ఆరోపణలు రావడం సస్పెండ్ కావడం జరిగింది. ఇప్పటికయినా చిత్తషుది గల అధికారులను నియమించి ప్రజల ఆరోగ్యలను కాపాడుతూ ముఖ్యంగా బేగంబజార్ లో కల్తీ ఆహారపదార్థాల విక్రయింపును అడ్డుకోవాలి. బేగంబజార్. కిషన్ గంజ్. ఉస్మాంగంజ్. ముక్తార్ గంజ్. మహారాజ్ గంజ్.మహబూబ్ గంజ్. ఫీలఖానా.లోని తరుచుగా తనిఖీలు చెప్పటాలి.ఆయా ప్రాంతాల్లోని గోడౌన్ మరియు దుకాణల్లో తరుచు తనిఖీలు నిర్వహించి ప్రజల ప్రాణాలను కపడాలని కోరుకుంటూ ఎలాంటి రాజకీయ వొత్తిడిలకు లోనుకాకుండా విధి నిర్వహణ చేసే అధికారులను నియమించాలి హై డ్రా అధికారుల సహకారం సహకారం కూడా తీసుకోవాలని విజ్ఞప్తి.



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి: గురువారంనాడు అబిడ్స్ సి ఐ రాజా గోపాల్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించిన తెలంగాణా రాష్ట్రశివసేన నాయకులు సుదర్శన్



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:ఎగ్జిబిషన్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ డి మోహన్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించిన తెలంగాణా రాష్ట్రశివసేన నాయకులు సుదర్శన్

# సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే

వినోబా భావే (1895–1982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్ర లోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించి నప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు.1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను "వినోబా" అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు. 1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పోచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదలకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది.వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. "సర్వోదయం" అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామస్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయం–పోషణకు ప్రాముఖ్యతనిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు.వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది "గీతా ప్రవచన్", ఇది భగవద్గీత పై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీత పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి.వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు. ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం– ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజసేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి.

# శివకేశవులకు ప్రీతికరం కార్తీక పౌర్ణమి

కార్తీకమాసం అన్ని మాసములలో అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతున్నది. 'న కార్తీక సమో మాసః' అని అత్రి మహాముని వచనము. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదని అర్థం. చంద్రుడు పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రములో సంచరించే మాసం కార్తీక మాసం". ఇందు కార్తీక పౌర్ణమి శివరాత్రితో సమానమై నదిగా భావించ బడుతుంది. దీనిని "త్రిపుర పూర్ణిమ, రాస పూర్ణిమ, దేవ దీపావళి" అని కూడా అంటారు. ఈ దినాన్ని మనువులలో పద్నాలుగవ వాడైన భౌత్యుని పేరున భౌత్య మన్వంతరాది, ఇంద్ర సావర్ణిక మన్వంతర మని కూడా అంటారు. ఈనాడు కైలాస నాథుడు త్రిపురాసురుడిని సంహరించాడు. శంకరుని కీర్తిని నారదుని వల్ల విన్న త్రిపురాసురుడు శివుడంటే అసూయ చెంది కైలాస పర్వతం మీదకు దండెత్తి వెళ్ళి, శంకరుడిని యుద్ధానికి రమ్మంటాడు. మూడు రోజుల తీవ్ర యుద్ధానంతరం పరమ శివుడు, త్రిపురాసురుడిని సంహరించాడు. దేవతలు అభయంకరుడైన శంకరుడిని స్తోత్రం చేశారు. వెయ్యేళ్ళ అసుర పాలన అంతరించిన శుభ సందర్భాన శివుడు తాండవం చేశా డని పురాణాధారం. ఈ దినాన దీపం వెలిగిస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్ని హరించుకు పోతాయని విశ్వాసం. రోజంతా ఉప వాసం ఉండి, రోజుకొక వత్తి చొప్పున 365 వత్తులను కూడిన దీపాన్ని వెలిగిస్తారు. కొందరు దీపాలను నదిలో లేదా చెరువులో వదులుతారు. ఇళ్ళల్లో తులసి కోట వద్ద దీపాలను వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాటి శివాలయంలో దీపారాధన, ముక్కోటి దేవతల పూజ, సకల పుణ్య నదుల స్నాన ఫలం దక్కి ఇహ పరలోక సుఖ సౌఖ్యాలు, ముక్తి లభించ గలవని నమ్మకం. ఈ రోజున కేదారేశ్వర వ్రతాన్ని ఆచరిస్తారు. మర్రి చెట్టు ఊడలను తోరణాలుగా, మర్రి పళ్ళను బూరెలుగా, ఆకులను విస్తర్లుగా పెట్టి, పూజలు చేయడం ప్రాచీన కాలం నుండి సంప్రదాయంగా వస్తున్నది. ఇలా చేయడం వల్ల భార్యాభర్తల మధ్య అనుబంధం పెరుగుతుందని నమ్మకం. జైనులకు, పంజాబీలకు ఇది విశిష్టదినం. గంగా మహోత్సవం కూడా ఈ రోజునే నిర్వహిస్తారు. తెలుగు వారు కార్తీక పూర్ణిమ వ్రతంలో చలిమిడి చేస్తారు. అరవవారు వేపుడు బియ్యం, అటుకులు చేస్తారు. బలి చక్రవర్తికి ఒళ్ళంతా మంటలు పుడితే, కార్తీక పౌర్ణమి నాడు శివారాధన చేస్తే, మంటలు తగ్గినట్లు, మహిషాసురుడితో యుద్ధం చేసిన సమయాన శివలింగాన్ని బద్దలు కొట్టిన పాప నివృత్తికై పార్వతీదేవి కూడా శివారాధన చేసినట్లు పురాణ కథనాలు. నాలుగు మాసాలు బుద్ధుడు ఉత్తమ లోకంలో తల్లి వద్ద ఉండి తిరిగి భూలోకానికి ఈదినమే దిగి వచ్చే క్రమంలో బౌద్ధులు దీపమాలికలు వెలిగించి మత స్థాపకునికి స్వాగతోపచారాలు చేస్తారు. బర్మాలో ప్రతి చోటు దీపాలతో నిండి ఉంటుంది. "నందన సంవత్సరమున, పొందుగ కార్తీక శుద్ధ పున్నమ నాడున్, వింధ్యాద్రి సేతుబంధన, సందున నొక వీరు డేలు సరుగన వేమా" అని క్రీ.శ.1532లోదిగా పరిశోధకులు నిర్ణయించిన వేమన పద్యంలో కార్తీక పున్నమి ప్రస్తావన ఉంది. కార్తీక శుద్ధ పూర్ణిమ రోజున కృత్తికా దీపోత్సవమును ఆచ రించడం, ఉసిరి చెట్టుకు ప్రదక్షిణలు గావించి, కార్తీక దామోదరుని పూజ, దీపారాధన గావించుట అత్యంత పుణ్యప్రదం.

# నిష్కామ కర్మయోగి చంద్రమౌళి

ఆయన తొలితరం ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ నాయకుడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధేయవాది. అంతే కాకుండా మహాత్మా గాంధీకి అత్యంత సన్నిహితుడు. సంయుక్త మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ మూడింటిలో మంత్రిపదవులు నిర్వహించిన గొప్పతనం ఆయనది. భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా ఎన్నికైన ఘనత ఆయనది. దేవాదాయ శాఖా మంత్రిగా, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా, శ్రీశైలం, భద్రాచలం దేవాలయాల జీర్ణోద్ధారకునిగా, భద్రాచల దేవస్థాన అధ్యక్షునిగా, పుణ్యక్షేత్ర పునఃనిర్మించిన కీర్తి ఆయనకే దక్కింది. సమగ్ర పంచాయితీ రాజ్ చట్టం మొదటిసారి రూపొందించి మద్రాసు శాసన సభలో అమోదింప జేసిన వ్యక్తిగా చిరకాలం గుర్తుండే పనితనం ఆయనది. ఆయనే మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకరైన కల్లూరి చంద్రమౌళి. మహాత్మాగాంధీ చూపిన బాటలో నడిచి ఆనాటి మేటి ఉద్యమాలైన సైమన్ గో బ్యాక్, ఉప్పు సత్యాగ్రహం. విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన, హరిజనోద్ధరణ, సహాయ నిరాకరణ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు నాయకత్వం వహించి పలుమార్లు జైలు జీవితం అనుభవించాడు. కల్లూరి చంద్రమౌళి (నవంబరు 15, 1898 – జనవరి 2, 1992) 1898 నవంబరు 15న గుంటూరు జిల్లా, అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో వెంకమాంబ, సుదర్శనంలకు జన్మించాడు. బాల్యం నుండి భారతీయ సంస్కృతి సంప్రదాయాలంటే ఇష్టం కాగా, ప్రాథమిక విద్య తుళ్ళూరు, తెనాలి, బాపట్ల లో ఉన్నత విద్య కలకత్తా లోనూ చదివాడు. 1920లో ఇంగ్లాండు వెళ్ళి స్కాట్లాండు లోని ఎబర్డీన్ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1926లో వార్ధా సేవాగ్రాం వెళ్ళి తొలిసారి గాంధీజీని కలిసాడు. అక్కడ మూడు నెలలు ఉండి కాంగ్రెస్ కార్యకర్తగా ఖద్దరు దరించి, గుంటూరు వచ్చాడు. ఊరురూ తిరిగి యువజన సంఘాలను పెట్టి వారిలో స్వతంత్ర భావాలను నాటాడు.1929 లో గాంధీజీ గుంటూరు జిల్లా పర్యటనలో తోడుగా ఉండి స్వాతంత్ర్య సమరానికి విరాళాలు పోగుచేసాడు. మహాత్మా గాంధీ నాయకత్వంలో అన్ని జాతీయోద్యమాలల్లో పాల్గొని అనేకసార్లు జైలు కెళ్ళాడు. ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొని అరెస్టై 18–6–1930 నుండి 12–3 1931 వరకు రాయవెల్లూరు జైల్లో గడిపాడు. గుంటూరులో కొండా వెంకటప్పయ్య ఇంటిలో ఉప్పు తయారు చేసి శాసనోల్లఘన చేసినందులకు 25–2–1932 నుండి 24–2–1933 వరకు కడలూరు జైల్లో గడిపాడు.1933 డిసెంబరులో గాంధీజీ ఆంధ్రలో హరిజన యాత్ర సాగించాడు. గుంటూరు పర్యటనలో చంద్రమౌళి అన్ని తానై దానిని విజయవంతం చేసాడు. గాంధీజీ చేత 1933 డిసెంబరు 23 న కావూరు విమానాశ్రయానికి ప్రారంబోత్సవం జరిపించాడు. అనేక గ్రామాలలో హరిజనులచేత దేవాలయ ప్రవేశం చేయించాడు.1934 లో గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీకి, 1938లో జిల్లా బోర్డ్ అధ్యక్షుడైనాడు. 1937, 1946, లలో శాసనసభకు ఎన్నికై మద్రాసు ప్రావిన్సులో శాసన సభ్యునిగా పనిచేసాడు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓ,పి రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలో చంద్రమౌళి స్దానిక సంస్థలు, సహకార శాఖామాత్యులుగా (1947 – 1949) పనిచేసాడు.1946 లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా మద్రాస్ ప్రావెంషియల్ నుండి ఎన్నికై భారత రాజ్యాంగ సభ్యులుగా రెండు ఏళ్ళు పనిచేసాడు. 1933లో ఆయన రాసిన నానా దేశ రాజ్యాంగాలు, రైతు రాజ్యాంగం పుస్తకాలు, వివిధ దేశాల రాజ్యాంగాలపై ఉన్న పట్టుకి నిదర్శనాలుగా నిలిచినందునే ఆయనను భారత రాజ్యాంగ పరిషత్తుకి సభ్యునిగా ఎన్నుకొన్నారు.1949– 52 లలో పి.యస్. కుమారస్వామి రాజా మంత్రివర్గంలో స్థానిక స్వపరిపాలన, సహకార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. 1955 లో జరిగిన తొలి శాసన సభ ఏన్నికలో చంద్రమౌళి అమృతలూరు నుండి ఏన్నికై బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో రెవెన్యూ, దేవాదాయ శాఖా మంత్రిగా (1955–56) పనిచేసాడు. దామోదరం సంజీవయ్య గారి మంత్రి వర్గంలో దేవాదాయ శాఖా మంత్రిగా (1960– 62) పనిచేసాడు.1964లో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షునిగా, రామాలయ జీర్ణోద్ధరణ సంఘం అధ్యక్షునిగా పనిచేశాడు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యినిగా పనిచేసాడు. చంద్రమౌళి అధ్యక్షులుగా భద్రాచల రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ఆలయాన్ని ఆగమ విరుద్ధంగా నిర్మిస్తున్నారని దానిని నిలువరించాలని కాంగ్రెస్ లోని వీరి ప్రత్యర్థులు ఆందోళన చేసి, అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డిచే విచారణ కమిటీని ఏర్పాటు చేయించారు. తనను కనీసం సంప్రదించకుండా సంజీవ రెడ్డి కమిటీ నియమించినందులకు నిరసించాడు. ఆత్మాభిమానంతో రామాలయ జీర్ణోద్ధరణ సంఘానికి, తర్వాత స్వార్థ రాజకీయాలకు నిరసనగా 1965 లో తన శాసన సభ సభ్యత్వానికి, టి.టి.డి అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసాడు. నమ్మిన సిద్ధాంతం కొరకు పదవిని తృణప్రాయంగా విసర్జించిన పరిశుద్ధ గాంధేయ వాది చంద్రమౌళి.భద్రాచలం గుడి 1960 నాటికి గుడి బాగా శిథిలమైంది. చంద్రమౌళి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా నియమితులైన, వెంటనే గుడి పునఃనిర్మాణానికి నడుం కట్టారు. తమ అధ్యక్షతన రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ద్వారా చంద్రమౌళి రాష్ట్రం నలుమూలల తిరిగి లక్షలాది రూపాయల విరాళాలు పోగుచేశాడు. తమిళనాడులోని రామనాథపురం జిల్లాకు చెందిన శిల్పాచార్యులు గణపతి స్థపతిని ఆహ్వానించి, ముందుగా కల్యాణమండపం కోసం సరైన రాయిని తమిళనాడులోని దిండివనంలో గుర్తించి, కొత్తగూడెం వరకు రైళ్ళలో తెచ్చి అక్కడినుండి గోదావరి వరకు లారీలలో తరలించారు. పెద్ద పెద్ద రాతి శిలలను ఇసుకలో నెట్టుకు వచ్చి, లాంచీలలో కెక్కించి అతికష్టంతో భద్రాచలం చేర్పించారు. 500 శిల్పులు 3 లక్షల ఖర్చుతో సకల కళాశోభితమైన కళ్యాణ మండపం, రామాలయానికి దక్షిణాన ఉన్న రంగనాయకుల గుట్టపై రామదాసు ధ్యానమందిరం, శిల్ప శోభాయమానమైన గోపురాలు నిర్మించారు. దీనిలో ఆరు అడుగుల పచ్చరాయి రామదాసు విగ్రహం ప్రతిష్ఠించారు. సమీపంలోని తాటియాకుల గూడెంలో సేకరించిన పూర్తిగా నల్లరాతితో ప్రధాన ఆలయాన్ని సౌందర్య శిల్పాలతో నిర్మించారు మహామండపాన్ని అష్టలక్ష్ములు, దశావతారాలు, ఆళ్వారుల శిల్పాలతో అలంకరించారు. 32 టన్నుల ఏకశిలతో మూడు అంతస్తులు కలిగి అన్ని దేవతామూర్తుల శిల్పాలతో శోభాయమానమైన ఆలయ విమానం ఏర్పాటు చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టగానే 1974 లో తిరిగి రామాలయ ధర్మకర్తల సంఘానికి అధ్యక్షులుగా నియమించాడు. వెంటనే విశేషంగా విరాళాలు సేకరించి చిత్రకూట మంటపాన్ని 127 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో నిర్మించాడు. స్తంభాలపై అద్భుతమైన శిల్పాలు చెక్కించాడు.నిడారంబత, నిష్కలంక నిస్వార్ద నిర్మల జీవనం గడిపిన ఆర్ష విద్యాలంకార బిరుదాంకితు డయిన కల్లూరి చంద్రమౌళి 94 ఏళ్ళ వయస్సులో మోపర్రులో 1992 జనవరి 2న ఒక కర్మయోగిగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

# సంపదలోనూ... బీసీలది వెనకబాటేనా!

భారతదేశంలో వెనుకబడిన కులాలు పేదరికంలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో పేదరికం చాలా తీవ్రంగా ఉంది. అనాదిగా వెనుకబడిన కులాలకు చెందిన ప్రజలకు స్థిరమైన జీవనాధారాలు లేకపోవడం, భూస్వామ్య వ్యవస్థ, వ్యవసాయ కార్మికులుగా పనిచేయడం, చిన్న చిన్న పనులు చేసుకుని రోజువారీ జీవితాలు గడపడం వంటివి మాత్రమే ఉపాధిగా ఉంటూ వస్తోంది. మొదటి నుంచి కూడా ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా రాజకీయ పరంగా ఎదిగిన ఉన్నత వర్గాల వ్యక్తులకూ, అణగారిన వర్గాలకూ మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను రూపమాపడమే లక్ష్యంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగ రూపకల్పన చేయటం జరిగింది. కానీ రాజ్యాంగ రూపకల్పనతో సామాజిక అసమానతలు కొద్దిగా తగ్గినా.. ఆర్థిక అసమానత్వం మాత్రం అలానే ఉంది. మొత్తం సంపదలో కులాలవారీగా పరిశీలిస్తే.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 88.4 శాతం సంపద ఉన్నత కులాల దగ్గర ఉన్నట్టు కొన్ని సామాజిక ఆర్థిక సంస్థలు చేస్తున్న ప్రాథమిక నివేదికలు తెలుపుతున్నాయి. బీసీల దగ్గర కేవలం 9శాతం సంపద మాత్రమే ఉండటం బాధాకరం. ఇప్పటికే అన్ని రంగాల్లో వెనుకబడుతున్న బీసీలు సంపద విష యంలో కూడా మరింత వెనుకబడి ఉన్నారు. అందుకే తమకు సరియైన న్యాయం జరగాలం టే జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో బీసీ రిజర్వేషన్లు పెంచాలని, రాజ్యాధికార దిశగా అడుగులు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. మన దేశం ఆకలి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్య వైపరీత్యాలు వంటి బహుళ సంక్షోభాలతో బాధపడుతుండగా, దేశంలోని బిలియనీర్లు మాత్రం ఆర్థికంగా సామాజికంగా బాగా అభివృద్ధి చెందుతున్నారు. భారతీయుల అసమానతలపై 2023 ఆక్స్‌ఫామ్ నివేదికను పరిశీలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలిగించక మానదు. భారతదేశ జాతీయ సంపదలో 1 శాతం మంది జనాభా వద్దనే 42.5 శాతం సంపద కలిగి ఉండటం ఆశ్చర్యకరం. ప్రపంచంలోనే అత్యధికంగా 228.9 మిలియన్ల పేదలు మన దేశంలోనే ఉండటం కూడా అవమానకరం. దేశంలో కరోనా మొదలైనప్పటి నుంచి భారతదేశంలోని బిలియనీర్ల సంపద రోజుకు 121 శాతం లేదా రూ. 3,608 కోట్లు పెరుగుతూనే ఉంది. దేశంలోని 100 మంది అతి సంపన్నుల మొత్తం సంపద రూ.54.12 లక్షల కోట్లకు చేరుకుంది, అంటే ఇది మొత్తం ఒక ఏడాదిన్నర కేంద్ర బడ్జెట్‌కు సమానమన్నమట. ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా బలంగా ఉన్న ఉన్నత వర్గాల సంపద అటూ దేశంలోను, ఇటూ రాష్ట్రంలోనూ అనూహ్యంగా రోజురోజుకు పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో దాదాపుగా 10 శాతం ఉన్న ఓసీల వద్ద సుమారు 89 శాతం సంపద ఉండటం విశేషం. రాష్ట్రంలో 60 శాతం పైగా జనాభా గల బీసీల వద్ద కేవలం 9 శాతం మాత్రమే ఉండటం ఆశ్చర్యకరం. 2013లో 17.8 శాతం సంపదను కలిగి ఉన్న బీసీలు 2022 సంవత్సరం వచ్చే నాటికి 9 శాతం సంపదను మాత్రమే కలిగి ఉండటం ఆలోచించదగ్గ విషయం. ఇందుకు ప్రధాన కారణం బీసీలు కేవలం శ్రామిక వర్గాలుగానే జీవనం కొనసాగించడం, ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు ఏ మాత్రం సహకరించకపోవడం సరికదా ఉచితాల మాయలో భ్రమలో బీసీలను ఓటు బ్యాంక్ యంత్రాలుగానే చూడ టం, సామాజికంగా, ఆర్థికంగా, ఉద్యోగ అవకాశాలు కనీస స్థాయిలో కల్పించలేకపోవడం. అందుకే బీసీలు ఆర్థిక సమానత్వానికి కనుచూపు మేరలో కానరావడం లేదు. బీసీలు రాజ్యాంగ పరమైన లక్ష్యానికి అనుగుణంగా ఎలాంటి ప్రతిఫలాలను కూడా అందిపుచ్చుకోలేకపోతున్నారు. బీసీల సంపద పెరగకపోగా మరింతగా తగ్గుతూ వస్తుంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు, రాజ్యాధికార అంశాలపై బీసీల ఆవేదనలో అర్థం ఉందనే విషయాన్ని సబ్బండ వర్గాలు ముఖ్యంగా పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం పదేపదే చెప్పడాన్ని అధికార పక్ష నేతలు అర్థం చేసుకోలేకపోవడం ఎంత మాత్రం మంచిది కాదు.తెలంగాణ సంపదలో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు కూడా జనాభాకు అనుకూలమైన ఆర్థిక భాగస్వామ్యం లేదు. గణాంకాల ప్రకారం 2013లో 1.8 శాతం సంపదను, 2020లో 4.1 సంపదను కలిగి 2022 వచ్చేసరికి మళ్లీ 2.6 శాతానికి దిగజారిపోయారు. బీసీలతో పోల్చుకుంటే వారి స్థాయిలో ఎస్సీలు బీసీలంతగా ఆర్థికంగా వెనుకబడి లేకపోయినప్పటికీ, జనాభా స్థాయి పరంగా వారికి తగిన ఆర్థిక ప్రాధాన్యత లభించడం లేదు. ఇక సంపద జాబితాలో ప్రామాణికంగా తీసుకునే స్థాయిలో ఎస్టీ కులాలు లేకపోవడం మరింత విచారకరం. సంపదలో బీసీలతోపాటు వెనుకబడిన ఎస్సీలు, ఎస్టీలు, సామాజిక, ఉద్యోగ, రాజకీయ పరంగా అవకాశాలు పొందుతున్నప్పటికీ ఆర్థికంగా మాత్రం అనుకున్న స్థాయిలో ఎందుకు ఎదగలేక పోతున్నారో ప్రభుత్వ పెద్దలు గ్రహించాలి. స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ, బడ్జెట్ పత్రాలలో భారీ కేటాయింపుల గారడీ ఉన్నప్పటికీ, కింది స్థాయిలో ఆర్థిక సమానత్వం అలాగే ఉండిపోవడాన్ని ప్రభుత్వ పెద్దలు గ్రహించలేక పోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర సాధనలో వెనుకబడిన కులాల ఎంత కీలకమో అందరికీ తెలుసు. 90 శాతానికి పైగా బీసీ కులాల బిడ్డలే పోరాడి ప్రాణాలు కోల్పోయారు. కానీ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలోనూ నేటికీ వాళ్ల కులాల సామాజిక ఆర్థిక పరిస్థితిలో ఏ మాత్రం మార్పులు రాలేకపోయాయి. తెలంగాణ రాక ముందు 2013లో బీసీల సంపద 17.8 శాతం వరకు ఉండేది. తెలంగాణ వచ్చిన 2014లో 20 శాతం సంపదతో బీసీల వాటా కొంత పెరిగినట్టు అనిపించినా.. ఆ తర్వాత ఆ పెరుగుదల శాతం ఎక్కువ కాలం నిలువలేదు. మళ్లీ 2022 నుంచి బీసీల సంపద ప్రతి ఏటా తగ్గడం మొదలైంది. మొత్తంగా చూస్తే దాదాపు బీసీల సంపద భాగస్వామ్యం 9 శాతం వద్దనే నిలిచిపోయింది. బీసీలు ఈ స్థాయిలో దిగజారిపోతున్నా ఓసీల సంపద మాత్రం గణనీయంగా పెరుగుతోంది. 2013లో 80.3 శాతంగా ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 78.1కి పడిపోయి, తిరిగి 2022 ఏడాది వచ్చే సరికల్లా 88.4 శాతం భారీ సంపదను కలిగి ఉన్నారు. సుమారు పదేళ్ల కాలంలో ఓసీలు దాదాపు 10 శాతం సంపదను వృద్ధి చేసు కుంటే.. ముఖ్యంగా బీసీలు మాత్రం దాదాపుగా 8 నుంచి 9 శాతం సంపదను కోల్పోవడం బాధాకరం.

# మొహం చాటేస్తున్న అనిల్ కుమార్

నెల్లూరు, నవంబర్ 14,2024 ఎన్నికలకు ముందు పల్నాడు జిల్లా మొత్తం వైసీపి కంచుకోటగా ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. పల్నాడు జిల్లాలో అసెంబ్లీ స్థానాలతో పాటు నరసరావుపేట పార్లమెంటు స్థానంలోనూ వైసీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గత ఎన్నికల్లో నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పోటీ చేశారు. అప్పటికి నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉన్న అనిల్‌పై నియోజకవర్గంలో వ్యతిరేకత పెరిగిందని సర్వేల్లో తేలడంతో జగన్ అక్కడ అయన్ని పక్కన పెట్టేశారు.సరిగ్గా అదే టైంలో నరసరావుపేట వైసీపీ ఎంపీగా ఉన్న లావు కృష్ణదేవరాయుల్ని జగన్ గుంటూరు ఎంపీగా పోటీ చేయాలని ఆదేశించారు. దానికి నిరాకరించిన దేవరాయులు టీడీపీలో చేరిపోయి ఆ పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా ఫిక్స్ అయ్యారు. దాంతో నరసరావుపేటలో దేవరాయుల్ని ఢీ కొనే సమర్థుడైన నేత వైసీపీకి కరువయ్యారు. ఆ క్రమంలో నెల్లూరులో టికెట్ లేకుండా ఖాళీగా ఉన్న అనిల్ యాదవ్ నరసరావుపేట షిఫ్ట్ అవ్వాల్సి వచ్చింది. అయిష్టంగానే నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా వచ్చిన అనిల్ తర్వాత ప్రచారంలో దూకుడు పెంచారు. బీసీ కార్డు వాడుకుంటూ జగన్ తనకు ఎమ్మెల్యే నుంచి ఎంపీగా ప్రమోషన్ ఇచ్చారని హడావుడి చేశారు.తనకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలని తన రాజకీయాలకు పల్నాడు జిల్లానే కరెక్ట్ అంటూ ప్రచారంలో ఓటర్లను ప్రాధేయపడ్డ అనిల్ కుమార్ యాదవ్.. ఓటమి తర్వాత పల్నాడు జిల్లా రాజకీయాల్లో ఎక్కడా కూడా కనిపించకపోవడం విశేషం.. వైసీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేసిన అనిల్‌కుమార్ యాదవ్.. పల్నాడు జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకు వెళ్తారని పార్టీ వర్గాలు అంచనా వేశాయి.. చంద్రబాబుని, పవన్ కళ్యాణ్‌లపై బూతులతో చెలరేగిన అనిల్.. ఎన్నికల ప్రచారంలో స్థానిక నేతలు పైన కూడా పరుషపదజాలంతో విరుచుకుపడ్డారు.ఎన్నికల పోలింగ్ తర్వాత ఒకటి రెండు సార్లు పల్నాడు నేతలతో కలిసి మీడియా ముందుకు వచ్చిన అనిల్ ఎన్నికల ఫలితాల తర్వాత కనిపించడమే మానేశారు . హైదరాబాద్‌లో తన వ్యాపారలావాదేవీలు చూసుకుంటున్న ఆయన అప్పుడప్పుడు రహస్యంగా నెల్లూరు వచ్చి వెళ్తున్నారంట. కేసుల భయంతో ఆయన రాజకీయాలకు స్వస్తి పలికే ఆలోచనలో ఉన్నారంటున్నారు. ఆ క్రమంలో ప్రస్తుతం నరసరావుపేట పార్లమెంటు సెగ్మెంట్లో వైసీపీకి ఇన్చార్జ్ కరువయ్యారు.నరసరావుపేట ఇన్చార్జిగా వైసీపీ ఎవరిని నియమిస్తుంది? ఎప్పుడు నియమిస్తుంది? లావు కృష్ణదేవరాయుల్ని ఎదుర్కొనగలిగే సమర్థుడు ఎవరున్నారు? ప్రస్తుతం పల్నాడు పార్టీ శ్రేణుల్లో చర్చంతా దీని గురించే నడుస్తుంది. ప్రస్తుతం జిల్లాలో వైఎసీపీకి సంబంధించి ఎవరూ కూడా యాక్టివ్‌గా లేకపోవడంతో ఇన్చార్జ్‌గా ఎవరిని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని దానిపైన నేతల్లోనూ క్లారిటీ లేదు.. పార్టీని దూకుడుగా ముందుకు తీసుకువెళ్లే నేత కోసం అధిష్టానం అన్వేషిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.. అందులో భాగంగా మాజీ ఎంపీ మోదుగుల వేణగోపాలరెడ్డిని మళ్లీ ఇంఛార్జ్‌గా పంపుతారని ప్రచారం జరుగుతుంది.అసెంబ్లీ కంటే పార్లమెంట్ కు వెళ్లటానికే మోదుగుల మొదట నుండి మొగ్గు చూపుతున్నారు.

# రుషికొండ మిస్సింగ్ ఫైల్స్



విశాఖపట్టణం, నవంబర్ 14, అద్భుత కట్టడం చుట్టూ అంతులేని చర్చ కొలిక్కి రావడం లేదు. ఎన్నికలకు ముందు ఎన్నికలకు తర్వాత కూడా..ఆ సౌధం చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. రుషికొండ భవనాలకు సంబంధించిన ప్రతీ విషయం చర్చనీయాంశం అవుతోంది. అయితే ఇన్నాళ్లుగా ఆ భవనాలను దేని కోసం వాడుతారోనన్న చర్చ జరిగింది. కానీ ఇప్పుడు రుషికొండ నిర్మాణాల ఫైళ్లు, ఫర్నీచర్ లెక్కలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయట. నిర్మాణ అనుమతుల ఫైళ్లు, కొన్ని కీలక పేపర్లు ఇప్పటికే కనిపించడం లేదంటున్నారు.కొండపై గతంలో ఉన్న రిసార్టును కూలగొట్టేందుకు తీసుకున్న అనుమతుల ఫైళ్లు కూడా గయాబ్ అయినట్లు తెలుస్తోంది. పాత రిసార్టులో 80 గదులతో పాటు ఒక ఫంక్షన్ హాలు, బార్ అండ్ రెస్టారెంట్ ఉండేవి. వాటిల్లో ఉండాల్సిన దాదాపు రూ.50 కోట్ల విలువైన ఏసీలు, ఫ్రిజ్‌లు, ఇతర సామాగ్రి ఏమైందో తెలియక ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారట. పాత రిసార్టును కూలగొట్టినప్పుడు అప్పటి అధికారులు ఈ సామాగ్రిని ఏం చేశారో తెలిపే ఫైల్ అందుబాటులో లేదు. పాత రిసార్ట్ సామాగ్రి వివరాలతో ఒక ప్రత్యేక ఫైల్ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ దగ్గర ఉంటే..ప్రభుత్వం మారిన తర్వాత అది మాయమైనట్లు తెలుస్తోంది.నిబంధనల ప్రకారం రిసార్ట్‌ను తొలగించే సమయంలో అందులోని సామాగ్రిని ఇతర రిసార్ట్‌లకు పంపడం లేదా వాటికి తగిన ధరను నిర్ణయించి, టెండర్ ద్వారా బయట మార్కెట్‌లో అమ్మడం చేయాల్సి ఉంటుంది. రుషికొండ విషయంలో టూరిజం అధికారులు ఈ నిబంధనలేవీ పాటించలేదట. రుషికొండపై రిసార్ట్స్ తొలగించే సమయంలో ఈడీగా ఉన్న మల్‌రెడ్డి, ఈఈ రమణ తూతూమంత్రంగా ఫైల్ నడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రుషికొండ ధ్వంసం, కొత్త కట్టడాల నిర్మాణంలో వీరిద్దరిదే కీలక పాత్ర. ఒక్క ఫైల్ కూడా కార్పొరేషన్‌కు వెళ్లకుండా..సెక్రటేరియట్ నుంచి చక్రం తిప్పారని ఆరోపణలున్నాయి.రుషికొండ నిర్మాణాల వెనక కీలకంగా వ్యవహరించిన మల్‌రెడ్డి 2019లో డిప్యుటేషన్‌పై తెలంగాణ నుంచి ఏపీకి వచ్చారు. అప్పట్లో ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి మరీ ఆయనను రాష్ట్రానికి రప్పించారు. తిరిగి ఆయన తెలంగాణకు వెళ్లే సమయంలో కూడా ఇదే నిబంధనలు పాటించాలి. కానీ ఏపీటీడీసీ అధికారులు మాత్రం టూరిజం సెక్రటరీ అనుమతి లేకుండా, జీవో ఇవ్వకుండానే ఆయన్ను రిలీవ్ చేసేశారు. ఇప్పుడు ఆయన తెలంగాణలో రిపోర్టు చేసి రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్‌లో విధుల్లో చేరిపోయారు. రుషికొండ నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించిన మరో అధికారి రమణ. ఇరిగేషన్ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీటీడీసీకి వచ్చారు. ఇలా రుషికొండ భవనాల నిర్మాణంలో కీలకంగా పనిచేసిన ఆ ఇద్దరు అధికారులను వివరణ కోరకపోవడం చర్చనీయాంశం అవుతోంది.ఇలా రుషికొండ సిత్రాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కట్టడాలే పెద్ద వివాదాస్పదం అయితే అందులో వాడిన ఫర్నీచర్ చర్చనీయాంశం అవుతున్నాయి. రుషికొండ భవనాలకు వాడిన ప్రధాన ద్వారం తలుపు, కమోడ్, బాత్ టబ్‌లకు చేసిన ఖర్చు చూస్తే షాక్ కావాల్సిందే. మెయిన్ డోర్‌కు రూ.31 లక్షల 84వేలు ఖర్చు పెట్టగా? ఇతర తలుపులు ఒక్కోదానికి రూ.17లక్షల 93వేలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అదే విధంగా బాత్ రూంలలోని ఒక్కో బాత్ టబ్‌కు పెట్టిన ఖర్చు రూ.12.38 లక్షలు కాగా.. వాష్ బేసిన్‌కు పెట్టిన ఖర్చు రూ.2.61 లక్షలని అంటున్నారు.ఇదే సమయంలో కాన్ఫరెన్స్ టేబుల్ ఖర్చు దాదాపు రూ.25 లక్షలు కాగా..ఇంగ్లీష్ లెటర్ యూ ఆకారంలోని టేబుల్ ఖర్చు రూ.53.73 లక్షలని అంటున్నారు. ఖర్చు, రాజభవనానికి మించిన వసతుల సంగతి అలా ఉంచితే..రుషికొండ ఫైళ్లు మాయమవడం మాత్రం చర్చకు దారి తీసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఫైళ్లు కనిపించకపోవడంపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల ఫైళ్లు, సైట్‌లో ఉన్న ఎన్ క్లోజర్స్ క్లియరెన్స్‌కు సంబంధించిన ఫైళ్లు కనిపించకపోవడంపై టూరిజం శాఖ ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది.

# విజన్ సరే... రివిజన్ ఏదీ



విజయవాడ, నవంబర్ 14, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోకడలు ఒకవైపే ఉంటాయి. ఆయన 1995 లో ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి అంతే. ఆయన ధోరణిలో రాజీ ఉండదు. సంక్షేమం కన్నా ఆయనకు అభివృద్ధి ముఖ్యం. అభివృద్ధితోనే సంపదను సృష్టించగలమని బలంగా నమ్ముతారు. ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఆయన తీరుమాత్రం మారదు. సంక్షేమానికి ఎంత ఖర్చు చేసినా వేస్ట్ అనే అభిప్రాయం ఆయనలో బలంగా ఉంటుంది. అదే అభివృద్ధి పనులు జరిగితే సంపద సృష్టి సులువుగా మారుతుందని భావిస్తారు. ఆయన విజన్ కూడా అంతే. ఇరవై ఏళ్ల ముందు ఉండి ఆలోచనలు చేసి వాటికి అనుగుణంగా నిర్ణయాలను అమలు చేస్తుంటారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం సంక్షేమంపై ఎక్కువగా మాట్లాడుతుంటారు.కానీ అధికారంలోకి రాగానే వెల్ఫేర్ ను పెద్దగా పట్టించుకోరు. లైట్ గా తీసుకుంటారు. ఆయన ఆలోచనలు ఎప్పుడూ హైఫైగానే ఉంటాయి. పేద, మధ్యతరగతి ప్రజలను గురించి పట్టించుకున్నట్లే కనిపిస్తున్నా వారికి అంతగా ఆయన పాలన ఉపయోగపడదన్నది అక్షర సత్యం. ఆయనదంతా సీ ప్లేన్.. డ్రోన్ ప్రపంచం.. అమరావతి నిర్మాణం.. పోలవరం పనులు ప్రారంభం వంటి వాటిపైనే ఎక్కవ ఫోకస్ ఉంటుంది. అంతే తప్ప తాము ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి పెద్దగా ఆలోచన కూడా చేయరు. ఎన్నికల ఏడాది చివరి నాటికి మాత్రం దానిపైన ఆలోచిస్తారు. ఖజానా ఖాళీ అంటూనే ఉంటారు. విద్యుత్తు ఛార్జీల భారం మోపుతారు. ఆ తప్పు నాది కాదంటారు. కానీ అదే అమరావతి నిర్మాణానికి పదిహేను వేల కోట్ల అప్పులు తెచ్చి పనులు ప్రారంభిస్తామంటారు. ఈరెండింటినీ ప్రజలు కూడా బేరీజు వేసుకుంటారు. తమకు అందాల్సిన ప్రయోజనాలను కొన్నింటికే ఖర్చు చేయడాన్ని పెద్దగా ఎవరూ హర్షించరు. నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడుకు ఇది తెలియంది కాదు. కానీ ప్రజలు తనను అర్థం చేసుకుంటారని గుడ్డిగా నమ్ముతుంటారు. ఎమ్మెల్యేలు, పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలున్నా ఎవరూ చెప్పే సాహసం చేయరు. ఎందుకంటే ఆయన విజన్ ను ఎవరూ ప్రశ్నించలేరు. క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్సీ విజన్ ను తప్పుపట్టలేరు కానీ... చంద్రబాబు విజన్ ను ఎవరూ తప్పుపట్టలేరు. ఆయన రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకుని అభివృద్ధి జరిగితే భవిష్యత్ తరాలకు తాము బంగారు బాట వేశామని భావిస్తారు. అదే సమయంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని నమ్ముతారు. తాము మౌలిక సదుపాయాలను క్రియేట్ చేయగలిగితే డెవలెప్ మెంట్ దానికదే జరుగుతుందని బలంగా విశ్వసిస్తారు. అయితే చివరకు ప్రజలు అలా అనుకునే అవకాశం లేదు కదా? సహజంగా మార్పు కోరుకుంటారు. ఆయన విజన్ కు బ్రేకులు పడతాయి. కానీ మరోసారి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఆయన ధోరణి అంతే. అందుకే చంద్రబాబు మారరు. ప్రజల్లో కూడా మార్పు రాదు. ఈ సైకిల్ ఇలా నడవాల్సిందే... అంతే మరి.

# కాకినాడలో వలసల పక్షులు సందడి

కాకినాడ, నవంబర్ 14, శీతాకాలం ప్రవేశంతోనే కాకినాడ జిల్లా కోరింగలో వివిధ రకాల పక్షుల సందడి వాతావరణం నెలకొంటుంది. ఆహార అన్వేషణలో భాగంగా వేల కిలోమీటర్ల దాటి ఇక్కడకు చేరుకుంటాయి ఈ అందమైన పక్షులు.. కాకినాడ జిల్లా కోరంగి అభయారణ్యం మడ అడవుల్లో ఆహారం లభించే చోట ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆరు నెలల పాటు అక్కడ ఉండి తిరిగి ఆయా దేశాలకు వెళ్తాయి.సైబీరియా, మంగోలియా, రష్యా చైనా ఒడిశాలోని మహానది, చంబల్ ప్రాంతాల నుండి విదేశీ వలస పక్షులు కోరింగ అభయారణ్యానికి చేరుకుంటాయి. ఇప్పటికి ఐ.పోలవరం మండలం భైరవ పాలేనికి ఇండియన్ స్కివర్ పక్షులు వచ్చాయి. నవంబరు నుండి మార్చి వరకు అభయారణ్యంలో 12 ప్రాంతాల్లో కనిపిస్తాయి. కోరంగిలోని హోప్ ఐలాండ్స్ కాకినాడ ఏటిమొగ, కుంభాభిషేకం, బీడి, బ్యాక్ వాటర్ కెనాల్, తాళ్లరేవు మండలం చొల్లం ఉప్పు మడులు, కాట్రేనికోన మండలం సాంకిమెంట్ లైట్ హౌస్, ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం ప్రాంతాల్లో కె.పొర వద్ద వలస పక్షులకు అనుకూల ప్రాంతంగా ఉంది. మడ అడవులు, చిత్తడి నేలలు వీటికి ఆహారం దొరికే ప్రాంతాలు.. సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా వంటి దేశాల్లో పక్షులు ఉండే ప్రదేశాలు ఈ సీజన్లో మంచుతో కప్పేసి ఉంటాయి. ఆహార కొరత వంటి పరిస్థితుల కారణంగా అక్టోబరు నుంచి మార్చి వరకు ఇక్కడికి పక్షులు చేరుకుంటాయి. నత్తలు చేపలు జూప్లాంట్, చామస్ ఆహారాన్ని అధికంగా తింటాయి. అందుకే వివిధ రకాల అందమైన పక్షులు అనేక రకాల జాతులు పక్షులు ఒకే ప్రాంతానికి చేరుకుని కనువిందు చేస్తాయి.2024లో 108 జాతుల పక్షులను గుర్తించారు. కోరింగ అభయారణ్యం విస్తీర్ణం 235.76 కాగా పొడవు 15 కిలోమీటర్లు. మడ అడవులు 193 హెక్టార్లలో ఉన్నాయి. జనవరిలో విదేశాల నుంచి వచ్చే పక్షులను లెక్కిస్తారు. అందులో వివిధ సంస్థలు పాల్గొంటాయి. ఒక్కోచోట అయిదుగురు చొప్పున 12 ప్రాంతాల్లో 12 బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కెమెరాల ద్వారా పక్షులను గుర్తిస్తారు. 2011లో ఏర్పాటైన ఈ కౌంటింగ్ నేటికి కొనసాగుతోంది. 2016 నుంచి నేటికీ పక్షుల సంఖ్య గణనీయంగా పెరిగింది. స్కిమ్మర్ ను అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేర్చడం విశేషం.

# ఏపీకి జాతీయ రహదారులకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, నవంబర్ 14, ఏపీకి కేంద్రం మరో గుడ్ న్యూస్ చెప్పింది. పలు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. రాజమండ్రి-అనకపాల్లి, రాయచోటి-కడప జాతీయ రహదారుల విస్తరణకు పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.రాజమహేంద్రవరం-అనకాపల్లి, రాయచోటి-కడప జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని బీజేపీ ఎంపీ డా.సీఎం రమేష్ తెలిపారు. జాతీయ రహదారి 16వ నెంబర్ లోని రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వరకు ఉన్న నాలుగు వరుసల రహదారిని ఆరువరసల రహదారిగా విస్తరించనున్నారు. అలాగే జాతీయ రహదారి 40లోని రాయచోటి-కడప రహదారిలో నాలుగు వరసలుగా టన్నెల్ తో రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలు ఆమోదించారని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు.జాతీయ రహదారి 16 పరిధిలోని అనకాపల్లి-అన్నవరం-దివాన్ చెరువు 741.255 కి.మీ నుంచి 903 కి.మీ సెక్షన్లో నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరణకు డీపీఆర్ కన్సల్టెంట్ కు అందజేశారని, అదేవిధంగా జతీయ రహదారి 40లో రాయచోటి-కడప 211/500 కి.మీ నుంచి 217/200 కి.మీ సెక్షన్లో నాలుగు వరుసల రహదారి టన్నెల్ నిర్మాణం ఈ ఏడాది వార్షిక ప్రణాళికలో చేర్చినట్లు కేంద్రం తెలిపిందని సీఎం రమేష్ అన్నారు. టన్నెల్ నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు అవసరం ఉన్నందున, అటవీ శాఖ నుంచి అలైన్మెంట్ అనుమతులు వచ్చిన తరువాత టన్నెల్ తో పాటు నాలుగు వరుసల రహదారి నిర్మాణ ప్రతిపాదనలు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారని ఎంపీ సీఎం రమేష్ తెలియజేశారు.విశాఖ మెట్రో సమగ్ర రవాణా ప్రణాళిక కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ఏపీ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖపట్నంకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,పీజీవీఆర్ నాయుడు,వెలగపూడి రామకృష్ణ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. 2014 విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ఐటం 12 ప్రకారం విజయవాడ,విశాఖకు మెట్రో రైలుపై సాధ్యాసాధ్యాలపై రిపోర్ట్ ఇవ్వాలని పొందుపరిచారు.దీని ప్రకారం 2014లో డీపీఆర్ సిద్దం చేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కు నాటి టీడీపీ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించిందని 2015లోనే డీఎంఆర్సీ ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందించిందని నారాయణ పేర్కొన్నారు. విశాఖపట్నంకు సంబంధించి 42.5 కిమీల నెట్ వర్క్ తో మూడు కారిడార్లతో మీడియం మెట్రో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చారని 2019 ఏప్రిల్ లో టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా దాఖలు చేసాయన్నారు.అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసి ఉంటే విశాఖపట్నంతో పాటు విజయవాడకు మెట్రో రైలు వచ్చి ఉండేదని, విశాఖపట్నంలో భోగాపురం వరకూ పొడిగింపు సాకుతో ప్రాజెక్ట్ ను పెండింగ్ లో పెట్టేసారని మంత్రి నారాయణ తెలిపారు.

# ఆరు కొత్త విమానశ్రయాలకు కసరత్తు...

విజయవాడ, నవంబర్ 14, ఏపీలో కొత్త విమానాశ్రయాలకు కసరత్తు జరుగుతోంది. ఆరు కొత్త ఎయిర్ పోర్టుల ఏర్పాటు కోసం సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం సర్వే చేయనుంది. ఈ కొత్త ఎయిర్‌పోర్టులకు సంబందించిన ప్రతిపాదనలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు పంపింది.ఆంధ్రప్రదేశ్‌లో మరో ఆరు కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయి. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై సర్వే చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది. ఈ అధ్యయనం తొమ్మిది అంశాలపై చేస్తారు. శ్రీకాకుళం, కాకినాడ, పశ్చిమగోదావరి, ప్రకాశం, చిత్తూరు, పల్నాడు మొత్తం ఆరు జిల్లాల్లో కొత్త ఎయిర్ పోర్టులను పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో 1,383 ఎకరాలు, కాకినాడ జిల్లాలోని తుని-అన్నవరంలో 787 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెంలో 1,123 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో ఒంగోలులో 657 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో కుప్పంలో 1,501 ఎకరాలు, పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్‌లో 1,670 ఎకరాల భూములు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక అందింది. దీంతో ఆయా ప్రాంతాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు రూ.2.27 కోట్లు చేయనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాట్లపై ఫోకస్ పెట్టింది. అందుకు కేంద్రంలోని పౌర విమానయాన శాఖ మంత్రి కూడా టీడీపీకి చెందిన కె.రామ్మోహన్ నాయుడే ఉండటం సానుకూలంగా ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే విమాన సర్వీసులను పెంచిన రామ్మోహన్ నాయుడు,? ఇప్పుడు కొత్త ఎయిర్‌పోర్టులకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఎయిర్‌పోర్టులు పెట్టడానికి ట్రాఫిక్ కీలకమైనది. ఆ ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో ఎయిర్‌ఫోర్టు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ పంపిస్తే, వెంటనే అనుమతి వస్తుంది. ఒకవేళ ట్రాఫిక్ లేని చోట్ల విమానశ్రయాలు పెడితే అవి నష్టాల్లోకి వెళ్తాయి.దేశంలోని మెజార్టీ విమానశ్రయాలు అదానీ గ్రూప్స్ చేతిలో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ఇప్పుడు ఆరు ప్రాంతాలను గుర్తించారు. ఆ ఆరు ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టు పెట్టేందుకు అనువుగా ఉంటుందా? లేదా? అనే సాధ్యాసాధ్యాలపై సర్వే చేస్తారు. అనువుగా అంటే సాంకేతిక అంశాలతో పాటు, ప్రయాణికుల ట్రాఫిక్ కూడా కీలకంగా సర్వే చేయనున్నారు. ఆరు ప్రాంతాల్లో సర్వే ముగిసిన తరువాత? కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే పీపీపీ మోడల్‌లో నిర్మిస్తారని తెలిసింది.ఈ కొత్త ఎయిర్‌పోర్టులకు సంబందించిన ప్రతిపాదనలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి భూములను గుర్తించి నివేదికలు పంపాలని ఏఏఐ నుంచి ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందాయని పేర్కొన్నారు. ఈ కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఆయా జిల్లా కలెక్టర్లు అందుబాటులో ఉన్న భూముల వివరాలను ప్రభుత్వానికి పంపారని అన్నారు.జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన నివేదిక ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో 1,383 ఎకరాలు, కాకినాడ జిల్లాలోని తుని-అన్నవరంలో 787 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెంలో 1,123 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో ఒంగోలులో 657 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో కుప్పంలో 1,501 ఎకరాలు, పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్‌లో 1,670 ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్త ఎయిర్‌పోర్టులకు సంబంధించి తొమ్మిది అంశాలపై ప్రాథమిక అధ్యయనం చేస్తామని అన్నారు. అందుకోసం ఒక్కో ఎయిర్‌పోర్టుకు రూ.37 లక్షలు అవసరం అవుతోందని, మొత్తం ఆరు ఎయిర్‌పోర్టులకు కలిపి రూ.2.27 కోట్లను విడుదల చేస్తున్నామని వివరించారు.

## దుర్గాబ్యాంక్ దివాళ...

విజయవాడ, నవంబర్ 14,విజయవాడలో దశాబ్దాల చరిత్ర ఉన్న దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు దివాళా తీసింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరడంతో ఆర్‌బిఐ లైసెన్స్ రద్దు చేసింది. బ్యాంకు మొండి బకాయిలు, వడ్డీలతో కలిపి రూ.200కోట్లకు చేరువలో ఉండటంతో ఆర్‌బిఐ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసింది.గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా రుణాలను మంజూరు చేయడం, ఆర్‌బిఐ మార్గదర్శకాలను పాటించకపోవడంతో బ్యాంకు దివాళా తీసేలా నిర్వహణ సాగింది. చివరకు ఆర్‌బిఐ విచారణలో బ్యాంకులో అవకతవకలు బయటపడటంతో లైసెన్స్ రద్దైంది. దీంతో డిపాజిటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకులో అధిక వడ్డీ వస్తుందనే ఉద్దేశంతో డిపాజిట్లు చేసిన వారంతా లబోదిబోమంటున్నారు.విజయవాడ పాతబస్తీ దుర్గా కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఆర్‌బిఐ అనుమతులు రద్దు చేయడం కలకలం రేపింది. బ్యాంకు నిర్వహణలో అవకతవకల పై కొన్నాళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. గత ఐదేళ్లలో రాజకీయ జోక్యం అధికం కావడంతో బ్యాంకు డైరెక్టర్ల నియామకంలో చోటు చేసుకున్న అక్రమాలతో బ్యాంకు పరిస్థితి దయనీయం మారింది. 90ఏళ్ల చరిత్ర ఉన్న దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు గతంలో కూడా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది.తాజాగా రిజర్వ్ బ్యాంకు లైసెన్సు రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువరించడంతో బ్యాంకులో డిపాజిటర్లలో కలకలం రేపింది. గత కొన్నేళ్లుగా రుణాల మంజూరులో బ్యాంకులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడం, సరైన తనిఖీలు లేకుండా పట్టా భూములకు రుణాలు మంజూరు చేయడం, అవి తిరిగి వసూలు కాకపోవడం వంటి సమస్యలు బ్యాంకు ఎదుర్కొంటోంది. బ్యాంకు నిర్వహణపై ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో కొంత కాలంగా ఆర్‌బిఐ విచారణ జరుపుతోంది.బ్యాంకు లావాదేవీల నిర్వహణకు తగినన్ని నిల్వలు లేకపోవడంతో చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. డైరెక్టర్ల మధ్య విభేదాలతో రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్‌బిఐకు ఫిర్యాదులు అందాయి. 1926లో ఏర్పాటైన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఘన చరిత్ర ఉంది. నగరంలోని నాలుగు స్తంభాల సెంటర్, సత్యనారాయణపురంలో బ్యాంకు శాఖలు ఉన్నాయి. దుర్గా కో- ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎన్నిక విజయవాడ రాజకీయాలను శాసించే స్థాయిలో జరిగేది. బ్యాంకు ఛైర్మన్ పదవిని దక్కించుకోడానికి ప్రధాన పార్టీలు పోటీపడేవి.కొన్నేళ్లుగా రాజకీయ జోక్యం మితిమీరడంతో బ్యాంకు పతనం దిశగా పయనించింది. బ్యాంకులో మొండి బకాయిలు పెరిగిపోయాయి. డిపాజిట్లు చేసిన వారికి కూడా గడువు ముగిసినా చెల్లింపులు చేయలేని స్థితికి బ్యాంకు చేరింది. దీంతో ఖాతాదారులు పలుమార్లు ఆందోళ నకు దిగారు. బ్యాంకు రుణాల జారీలో ఉద్యోగులు, పాలక మండలి డైరెక్టర్ల చేతివాటంతో పారుబకాయిలు పెరిగిపోయాయి. బ్యాంకు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని గతంలో కో ఆపరేటివ్ రిజస్ట్రార్ నుంచి పలుమార్లు హెచ్చరికలు వచ్చినా ప్రజా ప్రతినిధుల అండతో చర్యలు నిలిచిపోయాయి. చివరకు ఆర్‌బిఐ అనుమతి రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో డిపాజిటర్లలో ఆందోళన నెలకొంది.బ్యాంకు డిపాజిటర్లలో దాదాపు 95శాతం మంది రూ.5లక్షల్లోపు డిపాజిటర్లు కావడంతో వారికి దశల వారీగా చెల్లింపులు జరుపనున్నట్టు ఆర్‌బిఐ అధికారులు వివరించారు. ఐదేళ్ల లక్షలకు పైబడిన డిపాజిట్లపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెబుతున్నారు.దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు దగ్గర తగిన మూల ధనం లేకపోవడం, బ్యాంకు నిర్వహణ సామర్థ్యం లేకపోవడంతో బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 ప్రకారం లైసెన్స్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించిది. బ్యాంక్ కార్యకలాపాలు అనుమతిస్తే డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఆర్‌బిఐ పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకు డిపాజిటర్లకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిపే స్థితిలో దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లేదని ఆర్‌బిఐ వెల్లడించింది.2024 నవంబర్ 12 తర్వాత బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోతాయని ప్రకటించింది. బ్యాంకును మూసివేసి లిక్విటేడర్‌ను నియమించాలని కమిషనర్ ఆఫ్ కో ఆపరేషన్ అండ్ రిజస్ట్రార్ ఆప్ కో ఆపరేటివ్స్ సొసైటీని ఆర్‌బిఐ సూచించింది. లిక్విడేషన్‌లో ప్రతి డిపాజిటర్‌కు డిపాజిట్‌పై బీమా క్లెయిమ్ చెల్లిస్తారు. డిపాజిట్ ఇన్స్యూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ద్వారా గరిష్టంగా ఐదు లక్షల వరకు చెల్లిస్తారు. బ్యాంకు రికార్డుల ప్రాకరం డిపాజిటర్లలో 96శాతం మంది ఈ పరిహారం పొందడానికి అర్హత కలిగి ఉన్నారు. డిపాజిట్లలో పూర్తి మొత్తాన్ని డీఐసీజీసీ నుంచి పొందుతారని ఆర్‌బిఐ వివరణ ఇచ్చింది. ఐదు లక్షలకు మించిన డిపాజిట్లపై కసరత్తు చేస్తున్నారు.

## తెలంగాణలో పెరిగిన చలి

అదిలాబాద్, నవంబర్ 14, తెలంగాణలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. వర్షాకాలం పూర్తై చలికాలంలోకి అడుగుపెట్టగానే ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. గత పది రోజులుగా రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగిపోయింది. పలు జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల దిగువకు పడిపోయినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తర, ఈశాన్య దిశ నుండి గాలులు వీస్తున్న కారణంగా చలి ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు వెల్లడించారు. చలితో పాటూ భారీగా పొగమంచు ఉండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు.ఈ నేపథ్యంలో వాహనదారులు నెమ్మదిగా చూసుకుంటూ వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఇక నిన్న అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు చల్లటి గాలులు వీచాయి. పగటిపూట సైతం కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా మెదక్ జిల్లాలో 14.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉంటున్నాయి. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. ఇక్కడ ఉదయం ఎండకొడుతూ పొడి వాతావరణం కనిపించగా రాత్రి తరవాత ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలితీవ్రత పెరగడంతో రాత్రిపూట ప్రజలు బయట తిరగడం మానేశారు. మరోవైపు నేడు, రేపు కొన్ని జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది

# పెరిగిన సీఆర్డీఏ పరిధి

గుంటూరు, నవంబర్ 14, ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిని కుదించడంతో అమరావతి పరిధి గణనీయంగా తగ్గిపోయింది. దీనిని పూర్వపు స్థితికి చేరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఆర్‌డిఏ ఏర్పాటైన సమయంలో భవిష్యత్ అవసరాలతో పాటు భారీ నగరాన్ని నిర్మించే లక్ష్యంతో సిఆర్‌డిఏను విజయవాడ-గుంటూరు నగరాల చుట్టూ 8వేల చదరపు కిలోమీటర్ల పరిధి నిర్ణయించారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని పరిధిని ,సిఆర్‌డిఏ పరిధిని కుదించారు. పల్నాడు, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశారు. తాజాగా పూర్వపు సిఆర్‌డిఏ పరిధిని పునరుద్ధరిస్తూ మునిసిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. సత్తెనపల్లి పురపాలక సంఘంతో పాటు పల్నాడు జిల్లాలోని 92గ్రామాల్లోని 1,069.55చదరపు కి.మీ విస్తీర్ణానికి పెంచారు. దీంతో పాటు బాపట్లలో 562.41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కలిపి మొత్తం 1631.96చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని సీఆర్‌డిఏలోకి చేరుస్తూ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ సీఆర్‌డిఏ పరిధి, విస్తీర్ణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఉమ్మడి గుంటూరులోని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గత ప్రభుత్వం విడదీసిన పలు ప్రాంతాలను తిరిగి సీఆర్డీఏలో విలీనం చేస్తూ పురపాలక శాఖ జీవో విడుదల చేసింది.తాజా నిర్ణయంతో సీఆర్డీఏ విస్తీర్ణం 6,983.24 చదరపు కి.మీ నుంచి 8,352 69 చ.కి.మీకు పెరిగింది. సీఆర్‌డిఏ పరిధి పెంపుదలపై ఆగస్టు 2న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డిఏ అథారిటీ సమావేశంలో తీర్మానానికి ఆమోదం తెలిపారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డిఏ విస్తీర్ణం పెంపుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంతో తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఆర్డీఏ నుంచి వేమూరు నియోజకవ ర్గాన్ని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో భాగం చేశారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో ఉన్న ప్రాంతాలను విడదీసి పల్నాడు అర్బన్ డెవ లప్మెంట్ ఆథారిటీలో విలీనం చేశారు. దీంతో సీఆర్‌డిఏ పరిధి గణనీయంగా తగ్గిపోయింది. సీఆర్‌డిఏ పరిధిని కుదించేందుకు ఇలా చేశారనే విమర్శలు ఉన్నాయి.గతంలో సీఆర్డీఏ పరిధిలో ఉన్న సత్తెన పల్లి మునిసిపాలిటీలోని 21.88 చ కి.మీతో పాటు సత్తెనపల్లి మండలం, పెదకూరపాడు నియో జకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాలు, చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు మండలాలను పల్నాడు డెవలప్‌మెంట్ అథారిటీలో కలిపారు. వాటిని ఇప్పుడు సీఆర్డీఏలో కలిపారు.సత్తెనపల్లి మున్సిపాలిటీతో పాటు గ్రామీణ మండలం, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, ఆచ్చంపేట, యడ్లపాడు మండలాల్లోని 82 గ్రామాల పరిధిలో 1,069.55 చదరపు కిలోమీటర్ల మేర విస్తీర్ణం రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థలో కలిసింది. దీంతో పాటు వేమూరు నియోజక వర్గంలోని ఐదు మండలాలను 562. 41 చ కి.మీ విస్తీర్ణాన్ని సీఆర్డీఏ నుంచి విడగొట్టి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో విలీనం చేశారు. చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాలను కూడా బుడాలో కలిపారు. తాజా నిర్ణయంతో ఈ మండలాల పరిధి లోని 62 గ్రామాలు సీఆర్డీఏలో విలీనమైనట్లైంది.

# సోషల్ మీడియాకు సినిమాటిక్ కలర్



ఒంగోలు, నవంబర్ 14, ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో ఈనెల 10న దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై ఫిర్యాదు నమోదు కావడం.. ఏపీలో సోషల్ మీడియా రగడను కొత్త మలుపు తిప్పేసింది. మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగం ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 19న విచారణకు హాజరుకావాలంటూ వర్మకు నోటీసులు వెళ్లాయి. ఎస్ఐ శివరామయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ హైదరాబాద్‌లోని వర్మ ఆఫీసుకు వెళ్లి స్వయంగా నోటీసులు హ్యాండోవర్ చేశారు. వ్యూహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, బ్రహ్మణిపై అభ్యంతరకర పోస్టులు పెట్టారన్నది వర్మపై నమోదైన అభియోగం.ఎన్నికలకు ముందు, టీజర్ ట్రైలర్లతోనే సంచలనం సృష్టించిన మూవీ వ్యూహం. అప్పట్లో ఆ సినిమా విడుదల ఆపాలంటూ కోర్టును కూడా ఆశ్రయించింది టీడీపీ. ఈ సినిమా సెన్సార్‌ను తెలంగాణా హైకోర్టు రద్దు చేసినా, డివిజన్ బెంచ్‌లో వర్మ సవాల్ చేయడంతో మరోసారి సినిమా మీద రివ్యూ జరిగింది. బెంగుళూరు సెన్సార్‌బోర్డు ఐ సర్టిఫికెట్ ఇవ్వడంతో సినిమా థియేటర్లలో రిలీజైంది.గుంటూరు జిల్లా తుళ్లూరులో కూడా ఖీఊఎ మీద కేసు నమోదైంది. రాష్ట్ర తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు ఫిర్యాదు మేరకు ఈఎఫ్‌ఐ నమోదు చేశారు పోలీసులు. ఈ కేసులోనూ నోటీసులిచ్చే అవకాశం ఉంది. దేనిమీదైనా.. ట్విట్టర్‌లో తనదైన స్టయిల్‌గా రియాక్టవడం వర్మకు అలవాటు. కానీ.. ఏఐ వీడియోలతోనో, అమెరికా ఎన్నికల ఫలితాల మీదో టైమ్‌పాస్ చేస్తున్నారు తప్ప.. తనమీద నమోదౌతున్న కేసుల పరంపరపై వర్మ ఖాతాల్లో చిన్న ప్రస్తావనైనా లేకపోవడం ఆసక్తికరంగా మారింది. పోలీసు కేసుల్ని తేలిగ్గా తీసుకుంటారని, వీలైతే ఎంజాయ్ చేస్తారని చెబుతున్నారు ఆయన ఫాలోయర్లు.నటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై కూడా ఏపీలో కేసు నమోదైంది. విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై ఫిర్యాదు చేశారు జనసేన నాయకులు. 2021 సెప్టెంబర్‌లోనూ, 2024 ఏప్రిల్‌లోనూ వైసీపీ కార్యాలయం వేదికగా పవన్ కళ్యాణ్‌పై పోసాని కృష్ణ మురళి చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలని కంప్లైంట్ చేశారు. పోసాని మాటల్ని వైసీపీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో పెట్టి.. పవన్‌కల్యాణ్ ప్రతిష్టను దెబ్బతీశారన్నది కంప్లయింట్ సారాంశం. ఐపీసీ సెక్షన్ 153, 153జీ, 354జీ, 505 క్లాజ్ 1, క్లాజ్ ఇ, క్లాజ్ 2 ప్రకారం వర్మపై కేసు నమోదైంది. కానీ.. తాను పవన్ కల్యాణ్‌పై తప్పుడు వ్యాఖ్యలేమీ చేయలేదని, తాను చెప్పినవన్నీ నిజాలేనని రియాక్టయ్యారు పోసాని.కానీ.. పవన్‌నుద్దేశించి పోసాని దారుణమైన పదజాలంతో పరుషంగా మాట్లాడారని వాదిస్తోంది జనసేన. గతంలో కూడా పోసానిపై ఫిర్యాదు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని చెబుతున్నారు. అటు.. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసుల పరంపర కొనసాగుతోంది. జనసేన, టిడిపి నేతల ఫిర్యాదులతో పోలీసులు చురుగ్గా కదులుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 48 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో 11 మందిపై గరిష్టంగా ఐదు కేసులు పెట్టారు. 22 మందికి 41ఏ నోటీసులిచ్చి పంపారు. మిగిలినవారు జిల్లా జైళ్లలో ఉన్నారు. జూనియర్ ఆర్టిస్ట్, వైసీపీ సానుభూతిపరురాలు శ్రీరెడ్డిపై అనకాపల్లి టౌన్ పీఎస్‌లో కంప్లయింట్ నమోదైంది. కూటమి నేతలపై ఆమె చేసిన సీరియస్ కామెంట్లను ఫిర్యాదులో జతపరిచారు.పోలీసుల అదుపులో ఉన్న వర్రా రవీందర్‌రెడ్డి వాంగ్మూలం ఆధారంగా.. సజ్జల భార్గవ్ సహా ఐదుగురు వైసీపీ నేతలపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకు ఐదు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు సజ్జల భార్గవ్ రెడ్డి. అటు.. ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం గాలింపు కొనసాగుతోంది. అటు.. హోమ్‌మంత్రి అనితపై అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డిని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంట్లో అరెస్టు చేశారు పోలీసులు. ఫేక్ అకౌంట్లతో వాళ్లమీద వాళ్లే పోస్టులు పెట్టుకున్నారని, పోలీసులు మాత్రం తమను టార్గెట్ చేస్తున్నారని వాపోతోంది వైసీపీ.అటు.. కేసులను, అరెస్టులను తీవ్రంగా తీసుకున్న వైసిపి అదే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. ఇప్పటికే జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసింది. కానీ.. అసభ్యకర పోస్టులు పెట్టినవారిని చట్టబద్ధంగానే అరెస్టు చేస్తున్నామంటూ సమర్థించుకుంటోంది ప్రభుత్వం. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుని ప్రతిపక్షాన్ని టార్గెట్ చేశారని, దీనిపై కేంద్ర ఎన్నికల ఎలక్షన్ కమిషన్ స్పందించాలని, వైసీపీ గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తోంది టీడీపీ.

# సమానత్వం నినాదమేనా

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మన దేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లేదు. ఆకాశంలో సగం అంటూ పేరున్న మహిళలు ఇప్పటికీ అధికారానికి దూరంగా ఉంటున్నారు. 75 సంవత్సరాల ప్రజాస్వామ్య పాలనలో, ఒక మహిళా ప్రధానమంత్రి, ఒక మహిళా అధ్యక్షురాలు మాత్రమే అధికారం చేపట్టగా, మిగిలిన వారందరూ పురుషులే. దేశవ్యాప్తంగా మహిళల అభివృద్ధికి, లింగ సమానత్వానికి మధ్య అంతరం రోజురోజుకూ పెరుగుతోంది. కొంతమంది మేధావులు స్త్రీలు, పురుషులు సమానమని, కానీ పురుషులు కొంచెం ఎక్కువ సమానమని చెబుతారు. ఫలితంగా మహిళల అభివృద్ధి, సమానత్వం అనేవి కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. సంప్రదాయాల పేరుతో నేటి స్త్రీలను పురుషుల అణిచివేతకు గురిచేస్తూనే ఉన్నారు. అయితే, రాజ్యాంగం స్త్రీలను, పురుషులను సమానంగా గుర్తించి గౌరవిస్తుంది. ఆర్టికల్ 15(3) ప్రకారం రాష్ట్రం మహిళల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ప్రత్యేక చట్టాలు చేయవచ్చు. ఆర్టికల్ 39(బి) ప్రకారం సమాన వేతనాలు చెల్లించాలి. ఆర్టికల్ 39(ఎ) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి. ఆర్టికల్ 15o(ఇ) ప్రకారం ప్రతి పౌరుడు మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేయాలి. అయితే దేశంలోని ప్రతి అంశంలోనూ రాజకీయ జోక్యం వల్ల వారి అభివృద్ధి కుంటుపడుతోంది.కాలంతో పాటు సమాజం, ఆలోచనలు రెండూ మారుతున్నాయి. కానీ, మహిళల విషయంలో మాత్రం ఇది భూమిపై కనిపించదు. ఇది ఆధునిక యుగం.. ఈ యుగంలో మనిషి సైన్స్ ద్వారా రోజుకో కొత్త అవిష్కరణలకు జీవం పోస్తున్నాడు. కానీ, స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించే విషయంలో సమాజం శతాబ్దాల వెనక్కి వెళు తుంది. ప్రపంచబ్యాంకు నివేదిక కూడా అదే నమ్ముతుంది.ప్రపంచ బ్యాంకు 2023లో ప్రచురించిన నివేదిక ప్రకారం ప్రపంచంలోని 14 దేశాల్లో మాత్రమే మహిళలకు వ్యాపారం, చట్టంలో సమాన హక్కులు ఉన్నాయి. ఈ దేశాలు బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫ్రాన్స్, గ్రీస్, ఐస్లాండ్, ఐర్లాండ్, లాట్వియా, లక్సెంబర్గ్, పోర్చుగల్, స్పెయిన్, స్వీడన్, జర్మనీ , నెదర్లాండ్స్. చట్టపరమైన వ్యాపార దృక్కోణంలో పురుషులు, మహిళలకు పూర్తి సమాన హక్కులను అందించే 14 దేశాలు ఇవి.2023లో తొలిసారిగా 100 పాయింట్లు సాధించిన వారి జాబితాలో జర్మనీ, నెదర్లాండ్‌లు చేర్చబడ్డాయి. అంటే ఈ రెండు దేశాలు స్త్రీ, పురుషుల హక్కులను అనేక విషయాల్లో సమానంగా చేశాయి. అత్యంత పేదరికాన్ని అంతం చేయడం మరియు భాగస్వామ్య శ్రేయస్సును పెంచడం అనే ప్రపంచ బ్యాంక్ లక్ష్యాలకు లింగ సమానత్వం ప్రధానమైనది. ఎక్కువ లింగ సమానత్వం, మహిళల ఆర్థిక సాధికారత యొక్క మొత్తం ఎజెండా కూడా స్మార్ట్ ఎకనామిక్స్ అని విశ్వసిస్తున్నారు ఎందుకంటే ఇది ఉత్పాదకతను పెంచుతుంది తర్వాతి తరం సామాజిక అభివృద్ధి కోసం అవకాశాలు సహా ఇతర అభివృద్ధి ఫలితాలను మెరుగుపరుస్తుంది. అమ్మాయిలు, మహిళలు అబ్బాయిలు పురుషులకు సమానమైన హక్కులు అవకాశాలు లేకపోతే ఏ సమాజం, దేశం లేదా ఆర్థిక వ్యవస్థ తన పూర్తి సామర్థ్యాన్ని సాధించలేవని రుజువైంది. మహిళల ఆర్థిక సాధికారత సాధించడం చాలా పెద్ద పని. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం గత దశాబ్దాలుగా మహమ్మారికి ముందు 50% కంటే తక్కువగా ఉంది. టర్కీలో, గత కొన్ని దశాబ్దాలుగా స్త్రీల శ్రామిక శక్తి భాగస్వామ్యం పురుషుల కంటే కనీసం 2:1 కారకంతో స్థిరంగా వెనుకబడి ఉంది. కరోనా మహమ్మారి దానిని మరింత దిగజార్చింది: 66% మంది పురుషులతో పోలిస్తే, కేవలం 29% మంది మహిళలు కార్మిక శక్తిలో పాల్గొంటున్నారు. కానీ మహిళల ఆర్థిక భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలు అపారమైనవి. జీతంతో కూడిన ఉద్యోగాలలో పని చేయడం సమాన వేతనాలు పొందడం ద్వారా మహిళలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగాన్ని కలిగి ఉంటే ప్రపంచ సంపద గణనీయంగా పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వం మరియు మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం మా పనికి ఎల్లప్పుడూ ప్రధానమైనది మరియు కొనసాగుతుంది, కానీ ముఖ్యంగా మహమ్మారి ప్రభావం నుండి కోలుకోవడానికి మేము కృషి చేస్తున్నప్పుడు. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ యొక్క పని లింగ సమానత్వంపై ఒక వ్యూహంతో మార్గనిర్దేశం చేయబడింది, ఇది విద్య ఆరోగ్యంలో లింగ అంతరాలను మూసివేయడం, మరింత మెరుగైన ఉద్యోగాలకు అడ్డంకులను తొలగించడం మరియు మహిళల యాజమాన్యం భూమిపై నియంత్రణకు అడ్డంకులను తొలగించడం వంటి అనేక కీలక రంగాలపై దృష్టి సారించింది. , హౌసింగ్ మరియు బ్యాంక్ ఖాతాలు.ఉదాహరణకు, తల్లిదండ్రుల సెలవు హక్కు సమానంగా చేయబడింది. ఇది కాకుండా, పురుషులు, స్త్రీలను సమానంగా ఉంచే అనేక హక్కులు ఉన్నాయి.వెస్ట్ బ్యాంక్, గాజా ఈ జాబితాలో అట్టడుగున ఉన్నాయి. ఇక్కడ మహిళలకు వాణిజ్యపరమైన, చట్టపరమైన హక్కులు దాదాపు లేవు. దీని తరువాత యెమెన్, సూడాన్ , ఖతార్ ఉన్నాయి. ఈ దేశాల్లో కూడా మహిళలకు వృత్తిపరమైన, చట్టపరమైన హక్కులు చాలా తక్కువ. 2019 జాబితాలో సౌదీ అరేబియా అట్టడుగున ఉంది. కానీ, ఇటీవల అక్కడ అమలులోకి వచ్చిన కొత్త చట్టాల తర్వాత సౌదీ అరేబియా స్కోరు మెరుగుపడి 71.3 శాతంతో 136వ స్థానంలో ఉంది.

# కాసిపేట లో బ్యాంక్ రుణాలు ఇన్సూరెన్స్ స్కీములపై అవగాహన

### కళాకారుల ఆట, పాటలతో ప్రజలకు అవగాహన సదస్సు

### పెద్ద ఎత్తున హాజరైన గ్రామీణ రైతాంగం

### బ్యాంకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసిన ప్రజానికం



తాండూర్:మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామంలో నా బార్డ్ వారి సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత సదస్సు విజయవంతమైంది. ఈ మేరకు గురువారం కాసిపేట లో నిర్వహించిన సదస్సుకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు, ప్రజలు హాజరై సక్సెస్ చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అందుతున్న రుణాలు, ఇన్సూరెన్స్, తదితర స్కీములను ప్రజలు వినియోగించుకోవాలని సదస్సు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన కళాకారులు వారి యొక్క ఆట,పాట, మాటల ద్వారా ప్రజలకు పలు స్కీములపై అవగాహన ను కల్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మండలంలోని బ్యాంకు లబ్దిదారులు, ఇతర ప్రజానికం పెద్ద ఎత్తున హాజరయ్యారు. సదస్సు నిర్వాహకులు వివరిస్తున్న పలు స్కీముల వివరాలను హాజరైన ప్రజానీకం ఆసక్తిగా వినడం కనిపించింది. పలువురు లబ్ధిదారులు వారికి ఉన్న అనుమానాలను సదస్సు నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ ఉదయ్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ లో పెట్రో బాంబు...

లాహోర్, నవంబర్ 14, (న్యూస్ పల్స్)పాకిస్థాన్ ద్రవ్యోల్బణం బంధంలోకి జారిపోతున్నట్లు కనిపిస్తోంది. ఇది అక్కడ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. మరికొద్ది రోజుల్లో పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ (హెచ్ఎస్‌డి) ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని పాక్ మీడియా ఇటీవల పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడం, పెట్రోల్‌పై దిగుమతి ప్రీమియం కారణంగా లీటరుకు రూ.4 నుంచి రూ.5 వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోల్, హెచ్ఎస్‌డి ధరలు బ్యారెల్‌కు సుమారు 1.7డాలర్లు, 4.4డాలర్ల మేర పెరిగాయి. ఇది కాకుండా, పెట్రోల్‌పై దిగుమతి ప్రీమియం బ్యారెల్‌కు దాదాపు 1డాలర్ పెరిగి బ్యారెల్‌కు 9.80డాలర్లకి చేరుకుంది. అయితే హెచ్ఎస్డీ లో ఈ ప్రీమియం బ్యారెల్‌కు 5డాలర్ల స్థాయిలో స్థిరంగా ఉంది.అంతకుముందు అక్టోబర్ 31న ప్రభుత్వం పెట్రోల్ ధరలను రూ.3.85, హైస్పీడ్ డీజిల్ ధరలను లీటరుకు రూ.1.35 పెంచింది. ఇప్పుడు ఈ కొత్త మార్పు తర్వాత, పెట్రోల్, హెచ్ఎస్‌డి ధరలు మళ్లీ లీటరుకు రూ.4, రూ.5 పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలు ధర బ్యారెల్‌కు 77.2 డాలర్లకు చేరగా, అంతకుముందు బ్యారెల్‌కు 75.6 డాలర్లుగా ఉంది. అదేవిధంగా, హెచ్ఎస్‌డి ధర బ్యారెల్‌కు 88డాలర్ల నుండి 83.6డాలర్లకు చేరింది. రూపాయి మారకం విలువలో స్వల్ప మార్పు కూడా ఉంది. దీని కారణంగా దిగుమతి చేసుకున్న చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.పెట్రోలు ప్రధానంగా ప్రైవేట్ వాహనాలు, చిన్న వాహనాలు, రిక్షాలు, ద్విచక్ర వాహనాలలో ఉపయోగించబడుతుంది. ఇంధన ధరల పెరుగుదల మధ్యతరగతి, పేద తరగతి ప్రజల బడ్జెట్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. మరోవైపు, హెవీ వెహికల్స్, రైళ్లు, ట్రక్కులు, బస్సులు, ట్రాక్టర్లు, ట్యూబ్‌వెల్‌లు, థ్రెషర్‌ల వంటి వ్యవసాయ ఇంజిన్‌లలో హెచ్ఎస్ డీ ఉపయోగించబడుతుంది. దీని ధర పెరగడం మూలనా ఇది కూరగాయల ధరలను కూడా పెంచుతుంది. ఒక్కసారి పాకిస్తాన్ ద్రవ్యోల్బణం బరిలోకి ప్రవేశిస్తుంది. పెట్రోల్, హెచ్ఎస్‌డి ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయ వనరులు. వారి నెలవారీ విక్రయాలు 7 లక్షల నుంచి 8 లక్షల టన్నులు ఉండగా, కిరోసిన్ డిమాండ్ 10,000 టన్నులకు మాత్రమే పరిమితమైంది. పెట్రోలు, హెచ్ఎస్‌డి ధరలు పెరగడం సాధారణ ప్రజలపై ఒత్తిడిని మాత్రమే కాకుండా, పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఇది రైతుల నుండి రవాణా రంగానికి ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతుంది.

# 12 గంటలకు కనిపించని రోడ్లు

న్యూఢిల్లీ, నవంబర్ 14, (న్యూస్ పల్స్) దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వాతావరణం రోజు రోజుకూ అధ్వానంగా మారుతోంది. గాలి నాణ్యత పడిపోతోంది. చలికాలం నేపథ్యంలో వాయు కాలుష్యం పెరిగింది. మరోవైపు పొరుగ రాష్ట్రాల నుంచి వస్తున్న పొగ రాజధానిని కమ్మేస్తోంది. తాజాగా బుధవారం అత్యంత అధ్వాన స్థాయికి గాలి నాణ్యత పడిపోయింది. ఏక్యూఐ 400 కన్నా ఎక్కువగా నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. గుర్‌గ్రామ్, నోయిడాలోనూ వాతావరణం అధ్వానంగా మారింది. దట్టమైన పొగ కారణంగా గాలి నాణ్యత పడిపోయింది.వాయి కాలుష్యం, దట్టమైన పొగ కారణంగా ఉదయం 12 గంటలకు కూడా ఢిల్లీలో రోడ్లు కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకునే వెళ్తున్నారు. ఇక పొగ కారణంగా విమానాలు కూడా టేకాఫ్ అయ్యే పరిస్థితి లేదు. దీంతో విమానాల రాకపోకలకు అంతరాకం కలుగుతోంది. ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశ రాజధానికి వెళ్లే కొన్ని విమానాలను దారి మళ్లించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం, ఉదయం 5.30 గంటలకు చాలాదట్టమైన పొగమంచు ఏర్పడటం ప్రారంభించింది, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) మంగళవారం సాయంత్రం 316 నుంచి బుధవారం ఉదయం 370కి దిగజారింది. రాజధాని ప్రాంతంలోని అనేక ప్రాంతాలలో 300 కంటే ఎక్కువ నమోదైంది.సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం, అయా నగర్, ఆనంద్ విహార్, ఢిల్లీ యూనివర్శిటీ నార్త్ క్యాంపస్‌లు బుధవారం నాడు 400 కంటే ఎక్కువ గాలి నాణ్యతతో నగరంలో అధ్వాన్నమైన గాలి నాణ్యతను నమోదు చేశాయి. ఇది తీవ్రమైన కేటగిరీ కిందకు వస్తుంది. ఏక్యూఐ 300 కంటే ఎక్కువ ఉన్న ఇతర ప్రాంతాలలో ఆనంద్ విహార్, ఏక్యూఐ 396, జహంగీర్‌పురి, 389, ఐఎఐ ఎయిర్‌పోర్ట్ 368లో నమోదు చేసింది.ఇక నోయిడా, గురగ్రామ్‌లోనూ బుధవారం గాలి నాణ్యత పడిపోయింది. పొరుగున ఉన్న పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి వస్తున్న దట్టమైన పొగ కారణంగా వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతున్నా గాలి నాణ్యత దెబ్బతింటోంది. పొగ మంచు కారణంగా బుధవారం నోయిడా, గుర్‌గ్రామ్ ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. రెండు నగరాల్లో ఏక్యూఐ 260కిపైనే నమోదైంది. ఇది వృద్ధులు, పిల్లలకు ఇబ్బందిగా మారింది. శ్వాస కోస సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఢిల్లీలో అయితే ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారింది. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.

# స్టార్ డైరెక్టర్ సీక్రెట్ కాపురం..

హైదరాబాద్, నవంబర్ 14, సినిమా అంటేనే గ్లామర్ ప్రపంచం. అందచందాలు ఉంటే ఈ రంగంలో రాణిస్తారని నానుడి. దీంతో కొందరు అమ్మాయిలు కాస్త అందంగా ఉంటే సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని ఆరాటపడుతుంటారు. చిత్ర పరిశ్రమలో అవకాశం రావడం అంటే మామూలు విషయం కాదు. ఆ విషయం ఇప్పటికే వివిధ సినిమాల ద్వారా అర్థమైపోయింది. అయితే సినిమాల్లో అవకాశాలు ఉండాలంటే ఏం చేయాలో అదే చేస్తున్నారు కొందరు హీరోయిన్లు.. ఒకప్పుడు సినిమాల్లో అవకాశం రావడం గగనంగా ఉండేది. కానీ ఇప్పుడు అవకాశం వచ్చినా.. ఆ తరువాత సినిమాలు దొరకడం కష్టంగా మారింది. ఈ తరుణంలో ఓ హీరోయిన్ తనకు అవకాశాలు రావాలని ఏం చేసిందో తెలుసా?సినిమా ఇండస్ట్రీలో డైరెక్టర్ లేదా హీరో లేదా ప్రొడ్యూసర్.. ఇలా ఎవరో ఒకరితో చనువుగా ఉంటారన్న వార్తలు ఇప్పటికే బయటకు వచ్చాయి. కొందరు 'మీ టూ' ద్వారా తమనే వేధించారని సోషల్ మీడియా ద్వారా చెప్పారు. కానీ ఓ హీరోయిన్ మాత్రం సినిమాల్లో అవకాశాల కోసం ఓ డైరెక్టర్ తో రిలేషన్ షిప్ కొనసాగిస్తోందని సమాచారం. సదరు హీరోయిన్ ఆ డైరెక్టర్ తో కలిసి ఉండడం వల్ల కొన్ని సినిమాల్లో కూడా అవకాశాలు వచ్చాయన్న చర్చ సాగుతంది. ఈ ఏడాదితో ఓ డిజాస్టర్ సినిమా తీసిన ఆ డైరెక్టర్ భార్య ప్రస్తుతం విదేశాలకు వెళ్లింది. దీంతో ఆయన ఓ హీరోయిన్ కు సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చనువుగా ఉంటున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ఈ చనువు ఆ హీరోయిన్ కు కలిసి వచ్చిందని తెలుస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన ఓ మూడు సినిమాల్లో ఆమె మెరిసింది. అందుకు కారణం ఆ డైరెక్టర్ పుణ్యమేనని అంటున్నారు. ఈ సంవత్సరం అయితే ఎలాగో గడిచింది. మరి వచ్చే ఏడాది సంగతి ఏంటి? అని కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ హీరోయిన్ సినిమాల్లో అవకాశాల కోసం ఇలాంటి పనులు చేయడంపై కొందరు వ్యతిరేకిస్తుండగా.. బతుకు దెరువు కోసం తప్పదు గురూ.. అని మరికొందరు సపోర్టు చేస్తున్నారు. అయితే ఇద్దరి ఇష్టంతోని ఎవురు ఏం చేసినా పట్టించుకోరు. కానీ ఆ తరువాత తమకు అన్యాయం జరిగిందని రోడ్డుపై పడితే ఇండస్ట్రీకే మచ్చ వస్తుందని కొందరు సీక్రెట్ గా చర్చించుకుంటున్నారు.మిగతా ఇండస్ట్రీల్లో కంటే ఈ రంగంలో ఇలాంటి విషయాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. గతంలోనూ ఇలాంటివి జరిగాయని కొందరు లోలోపల చర్చించుకుంటుండగా.. కొందరు సోషల్ మీడియా ద్వారా బయటపెట్టి రచ్చ చేశారు. ఇటీవల మలయాళ ఇండస్ట్రీలో అయితే సినిమాల్లో అవకాశాల కోసం డైరెక్టర్లు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించిన విషయం తెలిసింద. కొందరు టాలీవుడ్ లోనూ దీనిపై చర్చించాలని పట్టుబడుతున్నారు. కానీ కొందరు తాము సినిమాల్లో కొనసాగాలంటే ఇలాంటివి తప్పవనే భావనతో ఉన్నారు. ఒకవేళ మలయాళ ఇండస్ట్రీలో లాగా కమిషన్ వేస్తే మాత్రం ఉన్న అవకాశాలు పోతాయనే భయం కొందరిలో ఉంది. దీంతో టాలీవుడ్ నుంచి ఎవరూ బయటకు రావడం లేదు.

# మోడీ తర్వాత పవర్ ఫుల్ చంద్రబాబే...

విజయవాడ, నవంబర్ 14, ఏపీ సీఎం చంద్రబాబు మరో అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఇండియన్ మోస్ట్ పవర్ ఫుల్ పొలిటీషియన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నేతగా ప్రధాని మోదీ నిలిస్తే..ఐదో స్థానంలో నిలిచారు ఏపీ సీఎం చంద్రబాబు. 2019 ఎన్నికల్లో టిడిపి దారుణంగా ఓడిపోయింది. ఆ పార్టీ పని అయిపోయిందని అంతా భావించారు. కానీ చంద్రబాబు తన శక్తి యుక్తులతో పార్టీని అధికారంలోకి తేగలిగారు. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి రావడానికి కారణమయ్యారు. ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండడంతో చంద్రబాబుకు ఈ అరుదైన గౌరవం దక్కింది. అయితే చంద్రబాబు రాజకీయ జీవితం పూల పాన్పు కాదు. ఎన్నో కష్టనష్టాలను అధిగమించారు. నిందలు, అపవాదులను ఎదుర్కొన్నారు. పడిపోయిన ప్రతిసారి నిలబడేందుకు ఆయన పడిన కష్టం వర్ణనాతీతం. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం చంద్రబాబు సొంతం. ఆయన పేరు లేకుండా ఏ రోజు న్యూస్ పేపర్లు అచ్చు అయ్యేవి కాదు. ఏడాది కిందట ఇదే సమయానికి చంద్రబాబు జైల్లో ఉండేవారు. అవినీతి కేసుల్లో అరెస్టయినా ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో 52 రోజులు పాటు గడిపారు. అయితే ఏడాది తిరగకముందే ఆయన దేశంలోనే మోస్ట్ పవర్ఫుల్ పర్సన్ జాబితాలో ఐదో స్థానం దక్కించుకోవడం విశేషం. ఇండియా టుడే సంస్థ ప్రకటించిన జాబితాలో ఆయనకు ఈ ఘనత దక్కింది.ఈ జాబితాలో దేశ ప్రధాని మోదీ తొలి స్థానంలో నిలిచారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రెండో స్థానంలో ఉన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుగవ స్థానంలో ఉన్నారు. ఐదో స్థానంలో మాత్రం చంద్రబాబు నిలిచారు. గడిచిన ఐదేళ్లలో రాజకీయ పరంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు చంద్రబాబు. కానీ ఈ ఎన్నికల్లో కూటమిపరంగా ఏపీలో సూపర్ విక్టరీ సాధించారు. కేంద్రంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి రావడానికి కారణమయ్యారు. 23 అసెంబ్లీ సీట్లకే పరిమితమైన పార్టీని.. ఐదేళ్లు తిరగకముందే 135 స్థానాలకు పెంచడం అంత ఆషామాషీ కాదు. ఈ ఘనత సాధించిన వన్ అండ్ ఓన్లీ పొలిటికల్ లీడర్ చంద్రబాబు.2019 ఎన్నికల తర్వాత చంద్రబాబు ప్రభావం జాతీయస్థాయిలో తగ్గుముఖం పట్టింది. ఆ ఎన్నికల్లో దారుణ పరాజయంతో చంద్రబాబు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. జాతీయ రాజకీయాలను శాసించిన చంద్రబాబుకు ఒకానొక దశలో ప్రధాని అపాయింట్మెంట్ కూడా లభించలేదు. కానీ ఇప్పుడు అదే ఢిల్లీలో, జాతీయస్థాయిలో చక్రం తిప్పుతున్నారు చంద్రబాబు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన ఏపీ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబెట్టుకుంటున్నారు. అందుకే దేశ రాజకీయాల్లోఅత్యంత శక్తివంతమైన నేతల్లో చంద్రబాబు టాప్ ఫైవ్ లో నిలిచారు. మున్ముందు ఆయన మరింత ముందుకు పోయే అవకాశాలు ఉన్నాయి.కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రావడం.. ఏపీలో చంద్రబాబుకు ఎక్కువ ఎంపీ సీట్లు రావడంతో దేశంలో రాజకీయాలలో చక్రం తిప్పే నేతగా చంద్రబాబు ఎదిగారు.చంద్రబాబు మద్దతు లేకుంటే దేశంలో ప్రభుత్వం పడిపోయే ప్రమాదం ఉండడంతోనే దేశంలో ఇప్పుడు పవర్ ఫుల్ లీడర్లను చంద్రబాబు ఒకరిగా నిలిచారు

# గిరిజనులలో విప్లవ స్ఫూర్తి రగిలించిన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా

## -నేడు ఆయన జయంతి



బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు. ఇతడు ముండా జాతికి చెందినవాడు.19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, ఝార్ఖండ్ ఆటవిక ప్రాంతాల్లో, బ్రిటిషు కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించాడు. తద్వారా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడు. ఇతడి గౌరవార్థం భారత పార్లమెంటులోని సెంట్రల్ హాల్లో ఈయన చిత్రపటం ఉంది. ఈ విధంగా సత్కరింపబడిన ఏకైక ఆటవిక జాతుల నాయకుడు బిర్సా ముండా. బిర్సా ముండా 1875 నవంబరు 15 ఉలిహట్, రాంచీ, జన్మించారు.1900 9జూన్ రాంచీ జైలు లో మరణించారు.బ్రిటిషు వలసవాదంపై తిరుగుబాటుగా సాగిన భారతీయ స్వాత్రంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధునిగా బిర్సా ముండా పేరును అత్యంత గౌరవంతో ప్రస్తావిస్తారు. కనీసం పాతికేళ్లు కూడా దాటకుండానే ఇవన్నీ సాధించడం వల్ల ఈయన ఘనత మరింత ఉత్కృష్టమైనది.బిర్సా ముండా, నవంబర్ 15, 1875, గురువారం రోజున జన్మించాడు. అప్పట్లో ఆచరణలో ఉన్న ముండా ప్రజల ఆచారం ప్రకారం ఆయన పుట్టిన రోజును బట్టి పేరు పెట్టారు. జానపద గేయాలలో కూడా ఈయన జన్మస్థలం ఉలిహటు లేదా చల్కడ్ అన్న అయోమయం నెలకొన్నది. బిర్సా తండ్రి సుగణ ముండా జన్మస్థలం ఉలిహటు. ఉలిహటులో బిర్సా అన్న కొమ్టా ముండా నివసించి ఉండటం వల్ల, ఆయన ఇల్లు ఇంకా అక్కడ శిథిలావస్థలో ఉండటం వల్ల, ఈయన ఉలిహటులో జన్మించాడన్న వాదన ఉంది.బిర్సా తండ్రి సుగుణా ముండా, తల్లి కర్మి హాటు, మరియు అతని తమ్ముడు, పస్నా ముండా, ఉలిహటును వదిలి కూలిపని కోసం బీర్బంకీ వద్ద ఉన్న కురుంబ్దాలో స్థిరపడ్డారు. కురుంబ్దాలో, బిర్సా అన్న కొమ్టా, మరియు అక్క దస్కిర్ పుట్టారు. అక్కడి నుండి బంబాకు తరలి వెళ్ళింది. అక్కడే బిర్సా అక్క చంపా మరియు బిర్సా పుట్టారు.బిర్సా ముండా గుర్తుగా రాంచీలోని విమానాశ్రయానికి బిర్సా ముండా విమానాశ్రయంగా పేరు దీనికి పెట్టడం జరిగింది.

# డ్రంకన్ డ్రైవ్ లో దొరికిన ఏసీపీ

హైదరాబాద్ అతనో పోలీస్ అధికారి.. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులపై చిందులేశాడు.. నా కారే ఆపుతారా.. మీ కెంత ధైర్యం అంటూ.. నానా రభస చేసి పోలీసు శాఖ పరువుని బజారు పాల్జేశాడు. అమీర్పేట్ వైపు నుంచి ఎస్. ఆర్. నగర్ వైపునకు సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ తో సహా మరో ముగ్గురు మంగళవారం రాత్రి సఫారీ కారులో వెళ్లారు. అక్కడ ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండటాన్ని గమనించారు. తప్పతాగి కారు డ్రైవింగ్ చేసిన కారు డ్రైవర్.. కారును ఆపి తన సీటు నుంచి దిగి వెనకాల సీటులోకి.. వెనుకున్న వ్యక్తి డ్రైవింగ్ సీట్లోకి మారాడు. అక్కడే విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ కావేరి ఇదంతా గమ నించింది. వెనుక సీట్లోని వ్యక్తి డ్రైవింగ్ చేశాడని ఆమె అక్కడున్న అధికారులకు చెప్పారు. తనిఖీల్లో భాగంగా వారి కారును ఆపి వెనుక కూర్చున్న డ్రైవర్ ను బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు యత్నించారు. అంతలో కారులోని వ్యక్తి కిందకు దిగి.. తాను సిద్దపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ న్ను అని.. తమ కారు వదిలేయా లని హుంకరించాడు. కారు నడిపిన మద్యం మత్తులోని డ్రైవర్ జైపాల్ రెడ్డిని వదిలేయాలని బిగ్గ రగా కేకలు వేశాడు. డ్రైవర్ బ్రీత్ అనలైజర్ పరీక్షకు మొండికేశాడు. ఊదొద్దని అతనికి ఏసీపీ అడ్డుప డ్డాడు. అక్కడ తనిఖీలు చేసే కానిస్టేబుల్ను ఏసీపీ సుమన్ కుమార్ తోసేశాడు. కాను బానెట్పై గుద్దుతూ.. దూషిస్తూ హల్ చల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో మధు రానగర్ పోలీసులకు సమాచారం అందించారు. కారు నడిపిన జైపాల్ రెడ్డిని పోలీస్ స్టేషన్కు తర లించి బ్రీత్ అనలైజర్ పరీక్షించగా.. మద్యం తాగి నట్లు తేలింది. మోతాదుకు మించి 39 పాయిం ట్లుగా నమోదైంది. డ్రైవింగ్ చేసిన వ్యక్తి జైపాల్ రెడ్డి అని.. అల్వాల్కు చెందిన వ్యాపారిగా పోలీసులు గుర్తించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమనక్కు మార్, కారు నడిపిన జైపాల్ రెడ్డి, వారితోపాటు ఉన్న ఎం.శ్రీనివాస్, జి.వెంకట రరావులపై ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ ఎస్సై జి.కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు మధురాన గర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# కేటీఆర్ చుట్టూ ఉచ్చు.. అరెస్ట్ చేస్తారని ప్రచారం



హైద్రాబాద్, నవంబర్ 14, ఫార్మా కంపెనీ భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్తో పాటు ఇతర అధికారులపై జరిగిన దాడి కేసు తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజేస్తోంది. సీఎం సొంత నియోజక వర్గంలో జరిగిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ కుట్ర ఉందని అనుమానిస్తున్నారు. ఇప్పటికే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని హైదరాబాద్లో అరెస్ట్ చేశారు. పట్నం రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును ప్రస్తావించడంతో ఆయన్ని కూడా అరెస్ట్ చేస్తారని ప్రచారం జరుగుతోంది.కొడంగల్లోని దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. పట్నంను ఈ కేసులో మొదటి నిందితుడిగా చేర్చారు. హైదరాబాద్లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడం, న్యాయమూర్తి ఆదేశంతో జైలుకు తరలించారు. కొడంగల్ కోర్టు పట్నం నరేందర్ రెడ్డికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయన్ని చర్లపల్లి జైలుకు తరలించారులగచర్ల ఘటనలో మంగళవారం 16 మందిని రిమాండ్కు తరలించిన పోలీసులు బుధవారం మరో నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు సురేశ్ సోదరుడితో పాటు మరో ముగ్గురు ఉన్నారు.నరేందర్రెడ్డి రిమాండ్ రిపోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరును పోలీసులు ప్రస్తావించారు. నరేందర్రెడ్డిని కేటీఆర్ స్వయంగా ప్రోత్సహించినట్లు దర్యాప్తులో వెల్లడైందని... ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కుట్ర జరిగిందని పోలీసులు రిమాండ్ రిపోర్టులో వివరించారు. లగచర్లలో అధికారులపై దాడి చేసిన 46 మందిలో 19 మందికి అక్కడ భూములు లేవని ఐజీ స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లో వారి భూములు లేవని స్పష్టం చేశారు.లగచర్ల ఘటనలో కేటీఆర్ను అరెస్టు చేస్తారనే ప్రచారంతో ఆయన ఇంటి వద్ద హైడ్రామా నెలకొంది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కేటీఆర్ నివాసానికి తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్రెడ్డి బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్తీక్రెడ్డి తదితర నేతలు బుధవారం బుధవారం అర్ధరాత్రి వరకు అక్కడే ఉన్నారు. మాజీ మంత్రి హరీశ్రావు కూడా కేటీఆర్తో భేటీ అయ్యారు. లగచర్ల ఘటన అనంతరం జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు.లగచర్ల ఘటనలో కుట్ర లేదని.. బలవంతంగా భూసేకరణ చేస్తుండడంతో కడుపు మండిన రైతులు తిరగబడ్డారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. సురేశ్ అనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త తన ఏడెకరాల భూమి పోతుండడంతో.. కడుపు మండి, అదే విషయాన్ని అడిగారు. భూమి కోల్పోతున్న రైతులు అడగడం తప్పా? సురేశ్ దాడికి పాల్పడినట్లు ఏమైనా ఆధారాలున్నాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు.తమ పార్టీ కార్యకర్త సురేశ్... పార్టీ నాయకుడైన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డితో మాట్లాడడం తప్పేమిటన్నారు. ఫార్మా విలేజ్ల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్నం నరేందర్రెడ్డితో సహా రైతులందరినీ తక్షణమే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరే స్వయంగా దాడి జరగలేదని చెబుతుంటే.. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారు. ఇది ఇంటెలిజెన్స్ వైఫల్యాలమేనని, అరెస్టు చేసిన రైతులను ప్రభుత్వ వైద్యులతో కాకుండా న్యాయస్థానం సూచనల మేరకు ప్రైవేటు వైద్యులతో రైతులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**అర్ధరాత్రి హై డ్రామా**

అర్ధరాత్రి కేటీఆర్ అరెస్ట్ అంటూ ప్రచారంతో హైదరాబాద్లో ఒక్కసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేటీఆర్ను అరెస్ట్ చేసే అవకాశం ఉందనన ప్రచారం కలకలం రేపింది. అర్ధరాత్రి కేటీఆర్ ఇంటి వద్దకు బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకున్నారు. హైదరాబాద్ నందినగర్ కేటీఆర్ ఇంటి వద్ద చేరుకున్న కార్యకర్తల కేటీఆర్కు సంఘీభావం తెలిపారు.వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల హస్తం ఉందన్న ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని మంగళవారం అరెస్ట్ చేశారు. అనంతరం ఏ క్షణానైనా కేటీఆర్ను సైతం అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో ఈ వార్త దహనంలా వ్యాపించడంతో కేటీఆర్ ఇంటి వద్దకు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ అగ్రనేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.కేటీఆర్ను కలిసిన పార్టీ శ్రేణులు సంఘీభావం తెలిపారు. 'కేటీఆర్ను ముట్టుకోకముందే మమ్మల్ని ఎదుర్కోవాలి' అనే నినాదాలు నివాసం వెలుపల నిలబడితే జనం నుంచి వినిపించాయి. అర్ధరాత్రి క్రిందకు వచ్చిన కేటీఆర్ కార్యకర్తలతో మాట్లాడి వెళ్లారు. తెల్లవారుజామున 4 గంటల వరకు కేటీఆర్ ఇంటి వద్ద ఃఖీూ కార్యకర్తలు చేరుకుంటూనే ఉన్నారు. పోలీసులు వస్తారని, పార్టీ కార్యకర్తలు ఎదురుచూడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అయితే కేటీఆర్ అరెస్ట్ ఖాయమన్న వార్తలపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఆయన నివాసం వెలుపల జనం అప్రమత్తంగా ఉన్నారు. కార్యకర్తకు తమ మద్దతును తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నారు.

# నల్గొండ చుట్టూ ఫోన్ ట్యాపింగ్...

నల్గొండ, నవంబర్ 14,ఉమ్మడి నల్గొండ జిల్లా చుట్టూ ఫోన్ ట్యాప్ కేసు దర్యాప్తు సాగుతోంది.జిల్లాకు చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.గురువారం పోలీసుల ఎదుట నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరు కానున్నారు. భువనగిరి, కోదాడ మాజీ ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు అందాయి.పదేళ్ల పాటు తెలంగాణలో అధికారంలో ఉన్న అప్పటి పాలక పక్షం, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మాజీ ఎమ్మెల్యేలు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. రాష్ట్రాన్ని కుదుపు కుదిపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఇన్నాళ్లూ ఇది కేవలం పోలీసు అధికారులకే పరిమితం అవుతుందనుకున్నా.. తాజాగా, ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్న బీఆర్ఎస్ కు చెందిన మాజీ ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ అవుతున్నాయి.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మునుగోడు ఉప ఎన్నిక సమయం నుంచే ఫోన్ ట్యాపింగ్ పై నాటి బీఆర్ఎస్ పాలకులు బాగానే ఆధారపడ్డారని నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇపుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉమ్మడి నల్గొండ జిల్లా నేతల చుట్టూ ఉచ్చు బిగిస్తోంది.ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన అభియోగాలు ఎదుర్కొంటున్న ఎస్.ఐ.బి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు గతంలో నల్గొండ ఎస్పీగా పనిచేసిన వారే. ఇదే కేసులో ప్రస్తుతం జైళ్ళోనే ఉన్న అదనపు ఎస్పీ తిరుపతన్న జిల్లాలో వివిధ స్థాయిలో సర్వీసులో పనిచేసిన వారే. వీటికి తోడు 2021 ఆఖరులో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలకు కళ్లెం వేసేందుకు ముఖ్య నాయకుల ఫోన్లన్నీ ట్యాప్ చేశారన్న ఆరోపణల నేపథ్యం... జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య (నకిరేకల్), పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), బొల్లం మల్లయ్య యాదవ్ (కోదాడ) లకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.. జిల్లాలో మునుగోడు ఎన్నికల సమయంలో మొదలైన ట్యాపింగ్ వ్యవహారం 2023 శాసన సభ ఎన్నికల సమయంలో పూర్తి స్థాయిలో అమలైందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న అదనపు ఎస్పీ తిరుపతన్న తో నిత్యం ఫోన్ సంభాషణలు జరిపిన వారిలో గుర్తించిన మాజీ ఎమ్మెల్యేలలో తొలుత జిల్లాకు చెందిన ముగ్గురితో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే , ప్రభుత్వ మాజీ విప్ గువ్వల బాలరాజు పేరు కూడా బయటకు రావడంతో నోటీసులు ఇచ్చారు.మునుగోడు ఉప ఎన్నిక జరుగుతున్న సమయంలోనే బీజేపీ తమ ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ప్లాన్ చేసిందని బీఆర్ఎస్ పసిగట్టి బీజేపీ నాయకులను ట్రాప్ చేసింది. వీరి సంభాషణలను ఫోన్ ట్యాపింగ్ ద్వారా రికార్డు చేయడంతో పాటు, ఉచ్చు పన్ని ఓ ఫాం హౌజ్ కు బీజేపీ నాయకలు, ఢిల్లీకి చెందిన మధ్యవర్తులు అక్కడకు వచ్చేలా చేసి రికార్డు చేసి పోలీసు దాడులు చేయించింది.మునుగోడు ఉప ఎన్నిక రావడానికి ప్రధాన కారణం బీజేపీ అన్న కారణంతో , బీజేపీ దూకుడుకు ఆ ఎన్నికల్లో బ్రేక్ వేసేందుకు ప్లాన్ చేసింది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని రాజీనామా చేయించడం ద్వారా ఉప ఎన్నికకు బీజేపీ పథక రచన చేసింది. అప్పటికే తెలంగాణలో జరిగిన హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన బీజేపీ, మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా గెలవడం ద్వారా, కొందరు ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుపోవడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనుకుంది.ఈ కారణంగానే ఒక వైపు బీజేపీ ప్లాన్ తిప్పికొట్టి ఆ పార్టీని డిఫెన్స్ లో పడేసేలా ఫాం హౌజ్ ఆపరేషన్ అమలు చేసింది. మునుగోడు లో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ లను అడ్డుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఆ పార్టీ నేతల కదలికలపై నిఘా పెట్టింది.తెలంగాణలో కాంగ్రెస్ కు మంచి పట్టున్న జిల్లాల్లో నల్గొండ ముఖ్యమైంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కూడా ఆ పార్టీ తన మిత్రపక్షం సీపీఐతో కలిపి 6 స్థానాలు, అంటే సగం నియోజకవర్గాలు దక్కించుకుంది. 2018 ఎన్నికల్లో సైతం 3 చోట్ల గెలిచి సత్తా చాటడందో పాటు ఉమ్మడి జిల్లాల్లోని రెండు లోక్ సభా నియోజకవర్గాలనూ కైవసం చేసుకుంది.దీంతో 2023 ఎన్నికల్లో ఆ పార్టీని అడ్డుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ పై ఎక్కువగా ఆధారపడినట్టు కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అదనపు ఎస్పీ తిరుపతన్నతో నిత్యం టచ్ లో ఉండి ప్లాన్ అమలు చేసిన వారిలో ఇపుడు ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు మాత్రమే బయటకు వచ్చాయి. ఆయన తన ఫోన్లోని సమాచారాన్ని అంతా డిలెట్ చేసినా.. పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్ లో ఆయన ఫోన్ నుంచి తిరిగి సమాచారాన్ని రాబట్టారు.దీంతో ఈ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేల సంభాషణల విషయం బయటకు వచ్చిందంటున్నారు. ప్రతిపక్ష నేతల కదలిలకలను గమనించడం, విపక్ష పార్టీల అభ్యర్థుల డబ్బు రవాణాను బ్రేక్ చేయడం, తమ డబ్బులను గ్రామ స్థాయి వరకు ఎలాంటి తనిఖీలు, ఇబ్బందుల్లేకుండా పంపిణీ చేసుకోవడం వంటి పనులను జిల్లా బీఆర్ఎస్ కు చెందిన కొందరు నాయకులు పూర్తి చేశారని విధితమవుతోంది. అయితే, ఫోన్ ట్యాపింగ్ కేసు ఈ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకే పరిమితం అవుతుందా..? ఇంకా సంఖ్య పెరిగే అవకాశం ఉందా..? అన్న ప్రశ్నలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

# ఓరుగల్లులో మరో ఐదు మున్సిపాలిటీలు- ప్రభుత్వం కసరత్తు

వరంగల్ నవంబర్ 14, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గ్రేటర్ వరంగల్ తో పాటు ఉమ్మడి జిల్లాలో 9 మున్సిపాలిటీలు ఉండగా..త్వరలో మరో ఐదు మున్సిపాలిటీలు ఏర్పాటు చేసేందుకు పురపాలక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా మున్సిపాలిటీల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మున్సిపాలిటీలు ఉండగా.. తొందర్లోనే మరో ఐదు మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. కొద్దిరోజుల కిందట ప్రతిపాదిత మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరగగా.. ఆఫీసర్ల ప్రపోజల్స్ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ కూడా కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించిన అనంతరం కొత్త మున్సిపాలిటీలు మనుగడలోకి వచ్చే అవకాశం కనిపిస్తుండగా.. అందులో కొందరు విలీన గ్రామాల ప్రజలు మున్సిపాలిటీల ఏర్పాటుకు విముఖత చూపుతుండటం గమనార్హం.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇదివరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా.. దాంతో పాటు హనుమకొండ జిల్లాలో పరకాల, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, జనగామ జిల్లాలో జనగామ మున్సిపాలిటీలున్నాయి. ఇదిలాఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణీకీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రపోజల్స్, అబ్జెక్షన్స్ తీసుకున్న మున్సిపల్ శాఖ.. ఆ తరువాత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించింది. కాగా దాని ప్రకారం ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడనున్న మున్సిపాలిటీల వివరాలు ఇలా ఉన్నాయి..

హనుమకొండ జిల్లాలో..

ఆత్మకూరు మున్సిపాలిటీ.. హనుమకొండ జిల్లాలో ఆత్మకూరు మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా డెవలప్ చేసేందుకు అడుగులు వేస్తుండగా.. ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు ఇదే మండలంలోని తిరుమలగిరి, గూడెప్పాడ్, కామారం నీరుకుళ్ల, పెంచికలపేట, దుగ్గొండి మండలంలోని కేశవాపురం గ్రామాలను విలీనం చేసి ఆత్మకూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రతిపాదించారు.

వరంగల్ జిల్లాలో..

నెక్కొండ మున్సిపాలిటీ.. నెక్కొండ మండల కేంద్రంతో పాటు గుండ్రపల్లి, అమీర్ పేట, నెక్కొండ తండా, టీకే తండా

మహబూబాబాద్ జిల్లాలో..

కేసముద్రం మున్సిపాలిటీ.. కేసముద్రం టౌన్, కేసముద్రం విలేజ్, అమీనాపురం, ధనసరి గ్రామాలు

జనగామ జిల్లాలో..

స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ.. ఛాగల్లు, స్టేషన్ ఘన్పూర్, శివునిపల్లి గ్రామాలు

ములుగు జిల్లాలో..

ములుగు జిల్లా కేంద్రంగా కొనసాగుతున్నప్పటికీ ఇంతవరకు దానికి మున్సిపాలిటీగా హోదా మాత్రం దక్కలేదు. దీంతోనే ఈసారి ములుగును మున్సిపాలిటీగా మార్చేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ములుగుతో పాటు బండారుపల్లి, జీవంత రావుపల్లి గ్రామాలను కలిపి ములుగు మున్సిపాలిటీ ఏర్పాటుకు అడుగులు వేస్తోంది.

గ్రామాల్లో వ్యతిరేకత

ప్రస్తుతం పంచాయతీలుగా కొనసాగుతున్న గ్రామాలను మున్సిపాలిటీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండగా.. విలీన గ్రామాల్లో చాలాచోట్లా ప్రజలు విలీనానికి వ్యతిరేకంగానే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొద్దిరోజుల కిందట ఆత్మకూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. అంతటా వ్యతిరేకంగానే అభిప్రాయాలు వ్యక్తం అయినట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడు ప్రతిపాదించిన మిగతా మున్సిపాలిటీల్లో కూడా చాలా వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉన్నట్లు తెలిసింది. పట్టణీకీకరణ వైపు అడుగులు వేస్తున్న ప్రభుత్వం.. ప్రజల అభ్యంతరాలు వ్యక్తమైన చోట ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# 24 గంటల్లో రైల్వే లైన్ పునరుద్ధరణ....

కరీంనగర్, నవంబర్ 14, పెద్దపల్లి-రామగుండం రైల్వే లైన్‌ను యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టి రైళ్ళ రాకపోకలు పునరుద్ధరించడంలో రైల్వే సిబ్బంది విజయం సాధించారు. మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో మూడు లైన్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాఘవపూర్ కన్నాల మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 12 బోగీలు ఒకదానిపై మరొకటి ఎక్కి భీభత్సంగా మారాయి. ప్రమాద తీవ్రతకు చైన్నై డిల్లీ ప్రధాన రైలు మార్గంలో మూడు లైన్ లు ధ్వంసమయ్యాయి. వంద మీటర్ల వరకు పట్టాలు విరిగి చెల్లాచెదురుగాపడ్డాయి.విద్యుత్ పోల్స్ విరిగి పవర్ సప్లై కి అంతరాయం ఏర్పడింది. గూడ్స్ ప్రమాదం తో కాజీపేట బల్లార్షా మధ్య రైళ్ళ రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఎక్కడిక్కడే రైళ్ళు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వేకు భారీగా నష్టం వాటిల్లింది. రాత్రికి రాత్రే రైల్వే అధికారులు, సిబ్బంది ప్రమాద ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు పనులు చేపట్టారు.గూడ్స్ రైలు పట్టాలు తప్పి కాజీపేట బల్లార్షా మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో రైల్వే శాఖ వాయువేగంతో మరమ్మతు పనులు చేపట్టింది. వెయ్యి మంది సిబ్బంది 24 గంటలు అవిశ్రాంతంగా పనిచేసి ధ్వంసమైన 12 బోగీలను, విద్యుత్ స్థంభాలను భారీ క్రేన్లు, జేసీబీల సాయంతో తొలగించారు.రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్...ఘటన స్థలం వద్దనే ఉండి పనులు పర్యవేక్షించారు. చూస్తుండగానే వంద మీటర్లు కొత్తగా రైల్వే ట్రాక్ ఏర్పాటు చేశారు. బుదవారం రాత్రి 8 గంటలకు గూడ్స్ రైలుతో పెద్దపల్లి నుంచి రామగుండం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం ఒక ట్రాక్ వినియోగంలోకి రాగా,ధ్వంసమైన మిగతా రెండు లైన్ లను శరవేగంగా మరమ్మత్తు చేస్తున్నారు. గురువారం ఉదయం వరకు పూర్తి చేసి రైళ్ళను నడిపేందుకు రైల్వే అధికారులు సిద్ధమయ్యారు.శరవేగంగా మరమ్మత్తు చేసిన రైల్ మార్గంలో గూడ్స్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి జమ్ముతావికి ఈ మార్గంలో వన్ వే లో ప్రత్యేక రైలు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 9గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి కాజీపేటకు రాత్రి 11 గంటలకు చేరుతుందని ప్రకటించారు. అర్ధరాత్రి 12గంటలకు పెద్దపల్లి చేరుకొనే విధంగా షెడ్యూల్ చేశారు. మంచిర్యాల, సిర్పూర్ కాగజ్ నగర్, బల్హార్షా, న్యూఢిల్లీ మీదుగా శుక్రవారం సాయంత్రం ఏడున్నర గంటలకు జమ్ముతావికి చేరుతుందని రైల్వే శాఖ ప్రకటించింది.రైల్వే అధికారులను పరుగులు పెట్టించిన గూడ్స్ రైలు ప్రమాదానికి ఓవర్ లోడ్ కారణమని భావిస్తున్నారు. బళ్లారి నుంచి ఘజియాబాద్ కు ఐరన్ లోడ్ తో వెళ్తున్న 44 బోగీల గూడ్స్ లింక్ ఊడిపోయి రాఘవపూర్ కన్నాల మధ్య పట్టాలు తప్పింది. రైలు ఇంజన్, గార్డ్ వ్యాగన్ సేఫ్ గా ఉన్నాయి. 12 బోగీలు ఒకదానిపై మరొకటి ఎక్కాయి. ప్రమాద తీవ్రతను బట్టి ఓవర్ లోడ్ తో ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రమాదానికి కారణాలను స్పష్టంగా అధికారులు చెప్పడం లేదు.గూడ్స్ ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ప్రాణనష్టం లేకపోయినప్పటికీ ప్రమాద తీవ్రతను బట్టి చూస్తే ప్యాసింజర్ రైలు అయితే ఏ విధంగా ఉంటుందోనని ఊహించుకోవడానికే భయం వేస్తుంది. ప్రమాదంపై కేంద్ర రైలు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విచారణకు ఆదేశించారు. ఓ వైపు విచారణ నిర్వహిస్తూనే మరో వైపు ధ్వంసమైన ట్రాక్ పనులు శరవేగంగా పూర్తి చేశారు.కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రమాదం పై ఆరా తీసి అధికారులను అప్రమత్తం చేశారు. పనులు వేగవంతంగా చేపట్టి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆదేశించారు. గూడ్స్ ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం సంభవించినప్పటికీ ప్రాణం నష్టం లేకపోవడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# క్రీడాకారులు గెలుపు - ఓటములను సమానంగా తీసుకోవాలి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులుగడ్డంవంశీ కృష్ణ



ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 14 : క్రీడాకారులు గెలుపు - ఓటములను సమానంగా తీసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోనిటి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఈ.ఐ.ఎస్.(బాలికలు) ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన 10వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2024-25 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు - ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని తెలిపారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, శారీరక ధారుధ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. కష్టపడే తత్వం అలవాటై జీవితంలో అన్ని రంగాలలో ముందుకు సాగేందుకు దోహదపడుతుందని, సమిష్టిగా పని చేయడం తెలుస్తుందని, సమిష్టి కృషి వల్ల కలిగే విజయం తెలుస్తుందని అన్నారు. క్రీడలు ఒత్తిడిని దూరం చేయడంలో సహకరిస్తాయని, విద్యార్థులలో ఏకాగ్రత పెంపొంది చదువులో రాణించేందుకు ఉపయోగపడుతుందని, క్రీడా రంగం ఐకమత్యంతో కలిగే లాభాలను వివరిస్తుందని తెలిపారు. సమాజంలో స్నేహభావం పెంపొందుతుందని, ప్రజలందరు కలిసికట్టుగా ముందుకు సాగితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్ మీట్లో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు

మెదక్, నవంబర్ 14, తెలంగాణలో వరి ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు చెబుతున్నా..ధాన్యం అమ్ముకోవడానికి రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ప్రభుత్వ అధికారులు ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్నా, ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా ఒక చోట లారీల కొరత, మరో చోట మిల్లుల వద్ద ధాన్యం రోజుల తరబడి దించకపోవడంతో రైతుల సమస్య మరింత పెరుగుతుంది. దీనికి తోడు అకాల వర్షాల సూచనతో రైతులు పండించిన పంటను ఎలా కాపాడుకోవాలా అని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యల మధ్య సతమతమవుతూ చేసేదేమి లేక చివరికి తక్కువ రేటుకు దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం రైతు ధాన్యాన్ని పండించడం కంటే, పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఎక్కువ ఇబ్బంది పడుతున్నాడు.మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలో అధికారులు ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో అది కనపడటం లేదు. సిద్దిపేట జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో అనుకున్న స్థాయిలో కొనుగోలు జరగడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎక్కువ శాతం రైతులు ప్రైవేట్ వ్యాపారులకు, మిల్లులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,548 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీని విలువ రూ. 59.10 కోట్లు కాగా, ఇప్పటివరకు రైతులకు రూ. 13.60 కోట్లు మాత్రమే చెల్లించింది. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 214 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 18,875మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం విలువ రూ. 43. 30 కోట్లు కాగా, రైతుల ఖాతాల్లో రూ.10. 70 కోట్లు మాత్రమే జమ చేశారుబుధవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం జాన్సీ లింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై రైతులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటివరకు 2 లారీల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారే తప్ప కొనుగోళ్లు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు చేయాలనీ, లేని పక్షంలో రామాయంపేటలో వేల మందితో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు. మరొక వైపు, తొనిగండ్ల గ్రామ రైతులు అక్కన్నపేట్ నుండి చిన్న శంకరంపేట్ రోడ్డు పై బయటినుంచి తమ నిరసన వెలిబుచ్చారు. వవరికి మద్దతు ధర రూ 2,320 నిర్ణయించగా, రైతులు రూ 1,700 నుండి రూ 2,000 కు దళారులకు అమ్ముకుంటున్నారు. మద్దతు ధర లభించకపోవడంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

# మేమేంటే...మేమే...

# పఠాన్ చెరువు కాంగ్రెస్ లో వర్గపోరు

హైదరాబాద్, నవంబర్ 14, పటాన్ చెరు కాంగ్రెస్‌లో వర్గ పోరు పీక్ లెవల్‌కు చేరింది. నేతల మధ్య సఖ్యత లేక..ఒకరంటే ఒకరికి గిట్టని వైఖరితో ఉన్న నాయకుల వ్యవహార శైలి కార్యకర్తలకు అయోమయం కలిగిస్తుంది. పార్టీ పవర్‌లో ఉన్నా..యాక్టివ్‌గా పనిచేయలేకపోతున్నామని ద్వితీయ శ్రేణి నేతలు అసంతృప్తితో ఉన్నారట. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కారు దిగి కాంగ్రెస్ చేరాక పటాన్‌చెరు కాంగ్రెస్ పరిస్థితి మూడు ముక్కలాట అయిపోయిందట. మెదక్ ఎంపీగా పోటీ ఓడిన నీలం మధు, ఎప్పటి నుంచో కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్‌కు , గూడెం మహిపాల్ రెడ్డి మధ్య ఏ మాత్రం సఖ్యత కన్పించడం లేదు.పార్లమెంట్ ఎన్నికల తర్వాత నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఎమ్మెల్యే చేసే కార్యక్రమాల్లో ఆమధ్య అడపాదడపా నీలం మధు కనిపించేవారు. ఇప్పుడు ఆయన కూడా యాక్టివ్‌గా లేనట్లే కనిపిస్తోంది. ఎమ్మెల్యే కూడా వీరిద్దరికీ సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలుస్తోందిగూడెం కాంగ్రెస్‌లో చేరినప్పటికీ అంత సంతృప్తిగా లేరట. హస్తం పార్టీ వ్యవహారాలు ఆయనకు మింగుడు పడటం లేదంటున్నారు. సైలెంట్ అయిపోవడంతో ఆయన వర్గం పూర్తిగా నైరాశ్యంలో ఉండిపోయింది. కాట వర్గీయులు కొందరు నీలం మధు వర్గంలో చేరిపోయి కార్యక్రమాల్లో అక్కడక్కడ కనిపిస్తున్నారు. ఇక ఎమ్మెల్యే గూడెంతో పాటు కాంగ్రెస్‌లో చేరిన అమీనుపూర్ మున్సిపల్ ఛైర్మన్ కూడా పార్టీ మారి తప్పుచేశానన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారట.పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ మూడు గ్రూపులుగా విడిపోవడంతో క్యాడర్ అయోమయంలో పడిపోయింది. మరోవైపు నియోజకవర్గానికి మంత్రులెవరు వచ్చినా తనకు సమాచారం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వాపోతున్నారు. ఇటీవల కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ చిట్కుల్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్ ఇద్దరూ డుమ్మా కొట్టగా..నీలం మధు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఇక జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ కార్యక్రమాల సమాచారం కూడా అందటం లేదని గూడెం పెదవి విరుస్తున్నారట.తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌లో ఉన్న నీలం మధుకు, గూడెం మహిపాల్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత విభేదాలు ఉండేవి. ఈ ఇద్దరినీ ఎదుర్కొని నిలిచిన కాట శ్రీనివాస్ గౌడ్‌కు..వీళ్లిద్దరు కాంగ్రెస్‌లో చేరడం మింగుడు పడటం లేదు. ఒకే ఒరలో రెండు కాదు మూడు కత్తులు అయిపోయాయి. అందుకే ఇమడలేకపోతున్నారు నేతలు. ఆ మధ్య రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న గూడెం మహిపాల్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టడంతో పాటు ప్రోటోకాల్ రగడ తీవ్ర చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బద్ధ శత్రువులుగా ఉన్న నీలం మధు, గూడెం మహిపాల్ రెడ్డిలు ఆరోజు ఒకే వేదికపై కనిపించడం, మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న కాట మాత్రం దూరంగా ఉండిపోవటం హాట్ టాపిక్ అయింది.ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమానికి కూడా కాట శ్రీనివాస్ గౌడ్ డుమ్మా కొట్టారు. నీలం మధు మాత్రం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతూ పార్టీ క్యాడర్‌కు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ సీనియర్లతో విభేదాలు లేకుండా జాగ్రత్త పడుతూ భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటున్నారు. పటాన్‌చెరులో బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను ఢీకొట్టాలంటే ఈ ముగ్గురి నేతల మధ్య సఖ్యత లేకపోతే కష్టమేనన్న టాక్ వినిపిస్తోంది. ఈ గందరగోళ పరిస్థితులు చక్కబడాలంటే పార్టీ అధిష్టానం జోక్యం చేసుకోవాలంటున్నారు ద్వితియ శ్రేణి నేతలు.

# 150 కోట్ల ఎక్కడా.... ప్రశ్నిస్తున్న స్థానికులు

నిజామాబాద్, నవంబర్ 14, తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి.. ఇద్దరు ఉద్దండులను ఓడించి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలపై కాటిపల్లి అనూహ్య విజయం సాధించారు. గెలిచిన కొద్ది రోజుల పాటు దూకుడుగా ఉన్న సదరు ఎమ్మెల్యే.. కొద్ది రోజులుగా ష్.. గప్ చిప్ అంటూ మౌనం పాటిస్తున్నారు. వివాదాలకు దూరంగా ఉంటున్నారు. ముఖ్య నేతలు, కార్యకర్తలకు సైతం వివాదాల్లో తలదూర్చొద్దని చెబుతున్నారట. కొద్ది రోజుల వరకు ఏ పంచాయతీలు తన వద్దకు తీసుకు రావొద్దని చెప్పేశారట.ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసిన కాటిపల్లి వెంకటరమనారెడ్డి ప్రచారంలో ఘనమైన హామీలు గుప్పించారు . 150 కోట్ల రూపాయల సొంత నిధులతో నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని సొంత మ్యానిఫెస్టో కూడా ప్రకటించారు. అయితే గెలిచి ఏడాది కావస్తున్నా ఆ హామీల ఊసే ఎత్తడం లేదంట. హామీల విషయమై ఓ వైపు ప్రజలు, ప్రతిపక్షాలు విమర్శలు సంధిస్తున్నా.. ఆయన మాత్రం వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. ఎమ్మెల్యే సైలెంట్ అవ్వడంతో ఆయన అనుచరులు కూడా ఎన్నికల హామీలపై ఏం మాట్లాడలేక పోతున్నారంట. ప్రజలకు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారంట.కాటిపల్లి వెంకటరమణారెడ్డి మౌనం వెనుక వ్యూహం ఉందటున్నారు ఆయన అనుచరులు.. గ్రామాల వివాదాల్లో వేలు పెడితే.. త్వరలో జరిగే స్దానిక సంస్థల ఎన్నికల్లో మైనస్ అవుతుందని, అందుకే ఎవరూ వివాదాల జోలికి వెళ్లవద్దని చెప్తున్నారంట. త్వరలో జరగనున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మెజార్టీ సీట్ల పై ఆయన కన్నేశారంటున్నారు. దిగ్గజాలను ఓడించి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఎమ్మెల్యే రమణారెడ్డి.. నియోజకవర్గంలో మరింత పట్టు పెంచుకోవడానికి మౌనంగా పావులు కదుపతున్నారంటున్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ.. స్థానిక సంస్థల టికెట్ల ఆశావాహుల్ని గ్రౌండ వర్క్ చేసుకోవాలని సూచించారట.ఎవరు ఏం అనుకున్నా.. తన పని తాను చేసుకుపోయే కాటిపల్లి.. త్వరలో జరిగే లోకల్ బాడీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే స్కెచ్ లు వేస్తున్నారంట. మెజార్టీ సీట్లు గెలిస్తే పార్టీలో మరింత పట్టు పెరుగుతుందని భావిస్తున్నారట. అయితే ప్రస్తుతమున్న పోటీ రాజకీయ వాతావరణంలో దూసుకుపోవాలని, ప్రత్యర్థుల తప్పులను ఎత్తిచూపితూ దూకుడు ప్రదర్శిస్తే కాని ప్రజల దృష్టి ఆకర్షించలేమని.. అలాంటిది మౌనమునిలా వ్యవహరిస్తే గెలిచేది ఎలా అని పార్టీ కేడర్ అయోమయంలో పడిందంటకాషాయ పార్టీ ఎమ్మెల్యే మౌనం అర్ధం కాని ప్రజలు.. ఎందుకు గెలిపించామా? అని తలలు పట్టుకుంటున్నారట. మాజీ సీఎం కేసీఆర్ నో.. తాజా సీఎం రేవంత్ రెడ్డి నో గెలిపించుకుంటే కథ వేరేలా ఉండేదని.. ఇద్దరిలో ఎవరు గెలిచినా ప్రతిపక్ష నేత నియోజకవర్గంగానో, లేదా ముఖ్యమంత్రి నియోజవర్గంగానో ఉండేదని గొణుక్కుంటున్నారు కాటిపల్లిని గెలిపించిన కామారెడ్డి ఓటర్లు.. అయితే ఇక్కడ మరో వాదన కూడా గెలిపిస్తుంది. గట్టిగా మాట్లాడితే ప్రత్యర్థులు, ప్రజలు తాను సొంతగా ప్రకటించిన 150 కోట్ల రూపాయల మ్యానిఫెస్టో గురించి ప్రశ్నిస్తారన్న భయంతోనే ఆయన సైలెంట్ అయ్యారన్న విమర్శలు కూడా గట్టిగానే వినిపిస్తున్నాయి. మరి చూడాలి రానున్న నాలుగేళ్లలో ఎమ్మెల్యే వ్యవహారతీరు ఎలా ఉంటుందో?

## నాంపల్లి రెడ్ హిల్స్ నిలోఫర్ కేఫ్ వద్ద అర్ధరాత్రి కారు బీభత్సం

హైదరాబాద్ నాంపల్లి రెడ్ హిల్స్ నిలోఫర్ కేఫ్ వద్ద అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. కారు అదుపుతప్పడంతో పలువురికి గాయాలు అయ్యాయి. మద్యం మత్తులో కారు నడిపి వ్యక్తిని స్థానికులు చితకబాదారు. నాంపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని , కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

# సినిమా





## ఎన్నేళ్లకు వినిపించావ్ ఇలా



ఇప్పుడంటే తమన్, అనిరుధ్, డీఎస్పి అంటూ కొత్త తరం సంగీతంలో మునిగి తేలుతున్నాం కానీ ఒకప్పుడు విలక్షణమైన మ్యూజిక్, విభిన్నమైన గొంతుతో యువతను ఊపేసిన రమణ గోగుల చాలా కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే.పదకొండేళ్ల క్రితం 2013లో తేజ 1000 అబద్దాల తర్వాత మళ్ళీ ఆయన కంపోజింగ్ చేయలేదు. ఎంత కనిపించకపోయినా ఫ్యాన్స్ మాత్రం పాటలు విన్నప్పుడల్లా తలుచుకుంటూ ఉంటారు. తిరిగి ఇన్ని సంవత్సరాల తర్వాత ఆయన గాయకుడిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాంలో ఒక సాంగ్ ఆయనతో పాడించాడు భీమ్స్.ఇంత ప్రత్యేకంగా రమణ గురించి చెప్పడానికి కారణాలున్నాయి. వెంకటేష్ ప్రేమంటే ఇదేరాతో 1998లో పరిశ్రమకు వచ్చారు. తొలి ఆల్బమ్ సూపర్ డూపర్ హిట్. తర్వాత పవన్ కళ్యాణ్ తో సింక్ కుదిరింది. తమ్ముడు, బద్రి, జానీ రూపంలో ఛార్ట్ బస్టర్స్ పడ్డాయి. వెంటనే మహేష్ బాబు నుంచి పిలుపు. యువరాజు అంతగా ఆడకపోయినా ఆడియో జనంలోకి బాగా వెళ్ళింది. వెంకటేష్ లక్ష్మితో పాటు ప్రభాస్ యోగికి పాటలు ఇచ్చారు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాత్రం మణిశర్మతో చేయించారు. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ మినహా మిగిలిన నాలుగైదు సినిమాలు నిరాశ పరిచాక సెలవు తీసుకున్నారు. తిరిగి ఇంత గ్యాప్ తర్వాత రమణ గోగులని తీసుకురావడం చూస్తే దర్శకుడు అనిల్ రావిపూడి టేస్ట్ ని మెచ్చుకోవచ్చు. తొలి ఆడియో సింగల్ గా దీన్నే త్వరలో రిలీజ్ చేయబోతున్నాడు.

## హీరోని మార్చిన వంశీ పైడిపల్లి..

తెలుగు సినీ పరిశ్రమలో మంచి గుర్తింపును కలిగి ఉన్న దర్శకులలో వంశీ పైడిపల్లి ఒకరు. ఈయన మున్నా అనే సినిమాతో దర్శకుడిగా కెరియర్ను మొదలు పెట్టాడు. మొదటి సినిమాతో ఈయనకు అపజయం వచ్చింది.ఆ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ తో బృందావనం అనే సినిమాను తెరకెక్కించి బ్లాక్ బాస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఇకపోతే ఈయన ఈ మధ్య కాలంలో తెలుగు హీరోలతో కంటే పక్క భాష హీరోలతో సినిమాలను తెరకెక్కించడానికి అత్యంత ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈయన కొంత కాలం క్రితం ఊపిరి అనే మూవీ ని రూపొందించాడు.ఇందులో నాగార్జున తో పాటు తమిళ నటుడు అయినటువంటి కార్తీ కూడా ప్రధాన పాత్రలో నటించాడు. ఇకపోతే వంశీ ఆఖరుగా వారిసు అనే సినిమాకు దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరో తలపతి విజయ్థూరో గా నటించాడు. ఈ మూవీ మంచి అంచనాల నడుమ విడుదల అయ్యి మంచి విజయాన్ని అందుకుంది. ఇకపోతే వారిసు సినిమా తర్వాత ఈ దర్శకుడు హిందీ నటుడు షాహిద్ కపూర్ తో ఓ సినిమా చేయనున్నట్లు , దీనిని దిల్ రాజు నిర్మించనున్నట్లు ఓ వార్త వైరల్ అయింది. కానీ ఈ మధ్య కాలంలో ఇందుకు సంబంధించిన ఎలాంటి వార్తలు బయటకు రావడం లేదు.

## ఒక్క సినిమాతో లీగ్ మారిపోయింది



శివ కార్తికేయన్.. తమిళంలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా మొదలు పెట్టి స్టార్‌గా ఎదిగిన హీరో. తన జర్నీ గురించి తెలిస్తే సినిమా వాళ్లే కాదు.. వేరే రంగాల వాళ్లకు కూడా ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.అతను ఒకప్పుడు విజయ్ టీవీలో వీడియో జాకీగా పని చేయడం విశేషం. అలాంటి నేపథ్యం నుంచి అనుకోకుండా సినిమాల్లోకి వచ్చి కొన్నేళ్ల పాటు చిన్న చిన్న పాత్రల్లోనే నటించాడు. '3' మూవీలో ధనుష్ ఫ్రెండు పాత్రలో అతణ్ని చూడొచ్చు. మరి కొన్ని చిత్రాల్లో ఇలాంటి క్యారెక్టర్లే చేశాడు. ఆపై ధనుష్ నిర్మాణంలో 'ఎదిరి నీచ్చిల్' అనే సినిమాలో హీరోగా నటించి తొలి ప్రయత్నంలోనే సక్సెస్ అందుకున్నాడు. రెండో చిత్రం 'వరుత్త పడాద వాలిబర్ సంఘం' (తెలుగులో కరెంటు తీగ) ఇంకా పెద్ద హిట్ అవడంతో శివ వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఆ తర్వాత నిలకడగా విజయాలందుకుంటూ స్టార్‌గా ఎదిగాడు. ఐతే ఇంత కాలం అందుకున్న విజయాలు వేరు. ఇప్పుడు 'అమరన్'తో అందుకున్న విజయం వేరు. ఇప్పటిదాకా శివ అంటే మిడ్ రేంజ్ హీరో. తన సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే 60-70 కోట్ల వసూళ్లు వచ్చేవి. ఇంకా పెద్ద సక్సెస్ అయితే వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టేవాడు. 'డాక్టర్' సినిమా వంద కోట్ల వసూళ్లతో తన కెరీర్లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. కానీ 'అమరన్' ఏకంగా రూ.300 కోట్ల వసూళ్ల దిశగా సాగుతోంది. ఇప్పటికే రూ.250 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. రిలీజైన రెండు వారాలకు కూడా ఈ సినిమా జోరు తగ్గట్లేదు. తమిళనాట హౌస్ ఫుల్ వసూళ్లతో సాగుతోంది.

# ప్యాన్ ఇండియా నిర్మాతకు చుక్కలు చూపించిన పోటీ



భూషణ్ కుమార్ అంటే మన ప్రేక్షకులకు వెంటనే ఫ్లాష్ కాకపోవచ్చు కానీ ఆదిపురుష్, యానిమల్, స్పిరిట్ లాంటి భారీ ప్యాన్ ఇండియా సినిమాల నిర్మాత అంటే ఠక్కున గుర్తొస్తారు. నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన టి సిరీస్ అధినేతగా బాలీవుడ్ లో ఆయనకున్న పట్టు గురించి మూవీ లవర్స్ లో తెలియని వారు ఉండరు. ఇంత ట్రాక్ రికార్డు ఉన్న వ్యక్తికి పోటీ వల్ల చుక్కలు కనిపించాయంటే నమ్మడం కష్టమైనా నిజం. ఇటీవలే ఒక జాతీయ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనే ఈ విషయాలు స్వయంగా పంచుకున్నాడు. ఇటీవలే తమ ప్రొడక్షన్లో విడుదలైన భూల్ భులయ్యా 3 వాటిలో ముఖ్యమైంది.ముందు దీపావళి విడుదల తేదీని తాము ప్రకటిస్తే సింగం అగైన్ చాలా ఆలస్యంగా అదే రిలీజ్ డేట్ నవంబర్ 1 అనౌన్స్ చేశారని, ఇది చాలా అన్యాయమంటూ పలు మార్లు వాళ్లతో సంప్రదింపులు జరిపినా లాభం లేకపోయిందని చెప్పుకొచ్చారు. కాంపిటీషన్ కమీషన్ ని ఫిర్యాదు చేసినా సమానంగా థియేటర్ల కేటాయింపు జరగలేదని, ఎక్కువ స్క్రీన్లు సింగం అగైన్ కే వెళ్లాయని వివరించారు. అడ్వాన్స్ బుకింగ్స్ లో భూల్ భులయ్యా 3 ముందంజలో ఉండటం చూసి అప్పుడు పెంచారట. ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లోనే తమ సినిమా మొదటి రోజే 36 కోట్ల గ్రాస్ సాధించడం సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. సరే ఇదంతా పక్కనపెడితే అంత బడా ప్రొడ్యూసర్ కే పోటీ వల్ల ఇంతటి ఇబ్బంది తలెత్తితే మరి చిన్న మధ్య తరగతి నిర్మాతల వెతలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

# బెల్లంకొండ హీరో.. మంచు విలన్



కెరీర్ ఆరంభం నుంచి పెద్ద పెద్ద డైరెక్టర్లు, టాప్ హీరోయిన్లతో సినిమాలు చేస్తూ ఒక రేంజ్ మెయింటైన్ చేస్తూ వచ్చాడు బెల్లంకొండ శ్రీనివాస్. కానీ తండ్రి బెల్లంకొండ సురేష్ బ్యాకప్‌తో అతను చాన్నాళ్ల పాటు భారీ సినిమాలు చేస్తూ వచ్చాడు కానీ..హీరోగా ఒక స్థాయికి మించి ఎదగలేకపోయాడు. దీంతో కెరీర్లో కొంచెం గ్యాప్ తప్పలేదు. మధ్యలో హిందీలో 'ఛత్రపతి' రీమేక్ చేసి చేతులు కాల్చుకున్న శ్రీనివాస్.. తిరిగి టాలీవుడ్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు.'భీమ్లా నాయక్' దర్శకుడు సాగర్ చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు' చేస్తూనే.. 'భైరవం' అంటూ మరో సినిమాను లైన్లో పెట్టాడు. కొంచెం లేటుగా రేసులోకి వచ్చినప్పటికీ 'భైరవం'యే ముందు రిలీజయ్యే పరిస్థితి కనిపిస్తోంది. 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వంలో తెరకెక్కిన 'భైరవం'లో నారా రోహిత్, మంచు మనోజ్ కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ కలయికలో విజయ్ ఎలాంటి కథ రాసి ఉంటాడనే ఆసక్తి నెలకొంది. ఐతే ఈ సినిమాకు సంబంధించి చాలామందికి తెలియని విషయం ఏంటంటే.. ఇది 'గరుడన్' అనే తమిళ చిత్రానికి రీమేక్. తమిళంలో కమెడియన్ సూరి లీడ్ రోల్ చేసిన సినిమా ఇది. ఆ పాత్రనే తెలుగులో బెల్లంకొండ శ్రీనివాస్ చేశాడు. ఒరిజినల్లో దర్శకుడు శశికుమార్, మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోతో సమానంగా సాగే ముఖ్య పాత్రలు చేశారు. ఆ పాత్రలనే ఇక్కడ నారా రోహిత్, మంచు మనోజ్ చేస్తున్నారు. ఇక్కడో ట్విస్ట్ ఏంటంటే మాతృకలో ఉన్ని పాత్ర నెగెటివ్ షేడ్స్‌తో ఉంటుంది.

# జీబ్రాకు ఊపు తీసుకొచ్చిన మెగాస్టార్



వచ్చే వారం నవంబర్ 22 విడుదల కాబోతున్న జీబ్రాని సత్యదేవ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. సోలో హీరోగా బ్లఫ్ మాస్టర్ తప్ప చెప్పుకోదగ్గ గుర్తింపు రాని పరిస్థితుల్లో దీంతో ఎలాగైనా హిట్టు కొట్టాలన్న సంకల్పంతో ఉన్నాడు.అయితే బజ్ పరంగా ప్రేక్షకుల్లో అంచనాలు రేపడం అంత సులభం కాదు. అందుకే ఆసక్తికరమైన ట్రైలర్ తో దాన్ని సగం వరకు నెరవేరిస్తే మిగిలింది చిరంజీవి ముఖ్య అతిథిగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరపడం ద్వారా పూర్తి చేశారు. నిన్న జరిగిన వేడుకలో చాలా మెరుపులు, చమక్కులు చోటు చేసుకున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ఆ వీడియోలే జీబ్రా వైపు చూసేలా చేసాయి. మాములుగా ఇలాంటి ఫంక్షన్స్ కు వచ్చినప్పుడు చిరంజీవి స్పీచులు పెద్దరికం నింపుకుని ఎక్కువ శాతం సీరియస్ గా ఉంటాయి. కుర్రాళ్లకు సలహాలు ఇవ్వడం లాంటివి చూడొచ్చు. కానీ నిన్న మాత్రం మెగాస్టార్ లోని సరదా యాంగిల్ బయటికి వచ్చింది. ఒక వైజాగ్ అభిమాని అరుపుని గమనించి తన వింటేజ్ స్టైల్ లో స్టేజి మీద ఆ ప్రాంతం యాసలో మాట్లాడ్డం బాగా పేలింది. సత్యదేవ్ తో అనుబంధం, గాడ్ ఫాదర్ లో విలన్ గా చేసినప్పుడు కలిగిన అనుభవంతో పాటు మత్తువదలరా 2, కమిటీ కుర్రోళ్ళు, ఆయ్, హనుమాన్ లాంటి స్టార్లు లేని సినిమాలు బ్లాక్ బస్టర్లు కావడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నో విషయాలు పంచుకున్న చిరంజీవి గురించి జీబ్రాలో నటించిన కీలక నటీనటులు , సాంకేతిక నిపుణులు ఇచ్చిన ఎలివేషన్లు ఎప్పట్లాగే అభిమానుల నుంచి క్లాప్స్ అందుకున్నాయి.



# క్రీడలు



## అజేయ సెంచరీతో విజృంభణ



భారత యువ క్రికెటర్ తిలక్‌వర్మ దుమ్మురేపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అజేయ సెంచరీతో కదంతొక్కాడు.ఫామ్‌లేమితో ఇన్ని రోజులు తడబడ్డ తిలక్..సఫారీల పనిపట్టాడు. సహచరులు విఫలమైన చోట తన విలువ చాటుకుంటూ ధనాధన్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ సెంచూరియన్‌లో తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. తిలక్‌కు తోడు అభిషేక్‌శర్మ రాణింపుతో భారత్ తొలుత 219 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనలో సఫారీలు పోరాడి ఓడారు. దక్షిణాఫ్రికాను జాన్సెన్ ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఫలితంగా నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమ్‌ఇండియా 2–1తో ఆధిక్యంలో నిలిచింది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 పోరు రసవత్తరంగా సాగుతున్నది. బుధవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన 11 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించింది. తొలుత భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. తిలక్ వర్మ(56 బంతుల్లో 107 నాటౌట్, 8ఫోర్లు, 7సిక్స్‌లు) శతకానికి తోడు అభిషేక్ శర్మ (25 బంతుల్లో 50, 3 ఫోర్లు, 5 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో మెరవడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 107 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సిమిలేన్(2/34), మహారాజ్(2/36) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 208/7 పరుగులు చేసింది. జాన్సెన్(17 బంతుల్లో 54, 4ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నా..జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. అర్ష్‌దీప్‌సింగ్(3/37), చక్రవర్తి(2/54) రాణించారు.

## ఐసీసీ ర్యాంకింగ్స్.. నంబర్.1 పాక్ బౌలర్..



ఇటీవల పాకిస్థాన్ జట్టు ఆస్ట్రేలియాను 2–1తో ఓడించి వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ విజయంలో షాహీన్ షా అఫ్రిది కీలక పాత్ర పోషించాడు. రెండో, మూడో మ్యాచ్‌లలో అతను వరుసగా 3/26, 3/32 వికెట్లు పడగొట్టాడు. ఈ అద్భుత ప్రదర్శనతో అతను ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని రేటింగ్ 696. దక్షిణాఫ్రికా బౌలర్ కేషవ్ మహరాజ్ మూడవ స్థానానికి పడిపోయాడు. జస్ప్రీత్ బుమ్రా 6వ స్థానానికి పతనమయ్యాడు. పాకిస్థాన్ జట్టు ఆటగాడు హారిస్ రౌఫ్ కూడా ఈ సిరీస్‌లో అద్భుతంగా ఆడాడు. రెండో మ్యాచ్‌లో 5/29 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో అతను 14 స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని రేటింగ్ 618. వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ 18 నెలల తర్వాత బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్–10లోకి తిరిగి వచ్చాడు. ఇంగ్లాండ్‌పై సిరీస్ గెలుపొందడంలో ఆయన కీలక పాత్ర పోషించడంతో రెండు స్థానాలు ఎగబాకి 10వ స్థానానికి చేరుకున్నాడు. ఆయన రేటింగ్ 665కి చేరుకుంది. మూడో మ్యాచ్‌లో శతకాలు చేసిన కీసీ కార్టీ, బ్రాండన్ కింగ్ కూడా తమ కెరీర్‌లో అత్యుత్తమ స్థానాలను చేరుకున్నారు. కార్టీ ప్రస్తుతం 52వ స్థానంలో ఉండగా, కింగ్ 71వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన మ్యాథ్యూ ఫోర్డ్ సిరీస్ ఫైనల్‌లో 3/35 వికెట్లు పడగొట్టి టాప్–100 బౌలర్ల జాబితాలో 94వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన సిరీస్‌లో, నజముల్ హొస్సైన్ 11 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నాడు. పాకిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ రిజ్వాన్‌తో ఆయన సమాన స్థానంలో ఉన్నాడు. మహ్మదుల్లా 10 స్థానాలు ఎగబాకి 44వ స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ మార్ష్‌తో ఆయన సమాన స్థానంలో ఉన్నాడు. మెహదీ హసన్ మీరాజ్ బౌలర్ల జాబితాలో తొమ్మిది స్థానాలు మెరుగుపరచుకుని 23వ స్థానానికి చేరుకున్నాడు. అఫ్ఘానిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ నబీ టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు.

## అరుదైన ఘనతకు చేరువలో అర్ష్ దీప్ సింగ్!




దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగు మ్యాచ్ ల టి20 సిరీస్ లో ఇప్పటికే మూడు మ్యాచ్లు పూర్తయ్యాయి. భారత్ 2–1 తేడాతో లీడ్ లో ఉంది. ముఖ్యంగా మూడో మ్యాచ్ లో తిలక్ వర్మ 107 పరుగులు చేసి సత్తా చాటగా.. అర్ష్ దీప్ సింగ్ మూడు వికెట్లు తీసి అదరగొట్టాడు. ఈ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా ఆటగాడు జాన్సన్ విధులు సృష్టించాడు. 17 బంతుల్లోనే 54 రన్స్ చేశాడు. హార్దిక్ పాండ్యా వేసిన 19 ఓవర్లో ఏకంగా 26 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సిక్స్ లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఈ దశలో టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ అర్ష్ దీప్ సింగ్ కు 20 ఓవర్ బౌలింగ్ బాధ్యతలు అప్పగించాడు. రెండో టి20లో అర్ష్ దీప్ సింగ్ ధారాళంగా పరుగులు ఇచ్చిన నేపథ్యంలో.. సూర్య కుమార్ యాదవ్ తీసుకున్న నిర్ణయం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక మూడో మ్యాచ్ లోనూ చివరి ఓవర్ అర్ష్ దీప్ సింగ్ కు ఇవ్వడం పట్ల సూర్యకుమార్ యాదవ్ నిర్ణయాన్ని కామెంట్రీ బాక్స్ లో ఉన్న వ్యాఖ్యతలు తప్పు పట్టారు. అయితే ఆ నిర్ణయం సరైనదేనని అర్ష్ దీప్ సింగ్ నిరూపించాడు. ప్రమాదకరమైన జాన్సన్ ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని ఔట్ చేశాడు. ఫలితంగా టీమిండియా విజయం సాధించింది. మూడవ టి20 మ్యాచ్లో టీమ్ ఇండియా సాధించిన విజయంలో సగం బాధ్యత బ్యాటింగ్ ద్వారా తిలక్ వర్మ నెరవేర్చితే.. మిగతా బాధ్యతను అర్ష్ దీప్ సింగ్ పూర్తి చేశాడు. తద్వారా టీమిండియా ఉత్కంఠ పరిస్థితుల్లో.. 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్లో అర్ష్ దీప్ సింగ్ ఐదు వికెట్లు సొంతం చేసుకున్నాడు.. టీమిండియా స్పిన్ బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ అతడు ఈ వికెట్లు సాధించడం ఒకరకంగా గొప్పే అనుకోవచ్చు. అయితే ఈ ఐదు వికెట్లు సాధించడం ద్వారా అర్ష్ దీప్ సింగ్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ టి20 క్రికెట్లో భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ గా యజువేంద్ర చాహల్ మొదటి స్థానంలో ఉన్నాడు. ఇతడు 80 మ్యాచ్లలో 96 వికెట్లు పడగొట్టాడు.. ఆ తర్వాత స్థానంలో అర్ష్ దీప్ సింగ్ కొనసాగుతున్నాడు. అతడు 59 మ్యాచ్లలో 92 వికెట్లు సాధించాడు. బుధవారం దక్షిణాఫ్రికా తో జరిగిన మూడవ టి20 మ్యాచ్లో మూడు వికెట్లు పడగొట్టడం ద్వారా అర్ష్ దీప్ సింగ్ భువనేశ్వర్ కుమార్ రికార్డును బద్దలు కొట్టాడు. భువనేశ్వర్ కుమార్ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇతడు 87 మ్యాచులు ఆడి 90 వికెట్లు పడగొట్టాడు. నాలుగో స్థానంలో బుమ్రా కొనసాగుతున్నాడు. ఇతడు 70 మ్యాచ్లలో 89 వికెట్లు సాధించాడు. ఇక ఐదవ స్థానంలో హార్దిక్ పాండ్యా కొనసాగుతున్నాడు.

## ఆస్ట్రేలియా మాజీలు మైండ్ గేమ్ మొదలుపెట్టారు..



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కంటే ముందు టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్ జట్టుతో మూడు టెస్టులు ఆడింది. టీమిండియా టెస్ట్ చరిత్రలో తొలిసారి వైట్ వాష్ కు గురైంది. ఈ ఓటమి నేపథ్యంలో టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ వెళ్లే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఇప్పటిదాకా ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ లో మొదటి స్థానంలో ఉన్న టీమ్ ఇండియా ఒక్కసారిగా రెండవ స్థానానికి పడిపోయింది. అంతేకాదు టీమ్ ఇండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ లోకి వెళ్లాలంటే ఆస్ట్రేలియాపై 4–0 తేడాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలవాల్సి ఉంటుంది. అయితే ఈ సిరీస్ నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా మొదలవుతుంది. తొలి టెస్ట్ మొదలుకాకముందే ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లు, సీనియర్లు టీమ్ ఇండియా ప్లేయర్లపై మైండ్ గేమ్ మొదలుపెట్టారు.. ఇప్పటికే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఫామ్ పై సంచలన వ్యాఖ్యలు చేశాడు.."విరాట్ కొంతకాలంగా సరైన క్రికెట్ ఆడటం లేదు. అతడి నుంచి సెంచరీలు తగ్గిపోయాయి. గతంలో అతడు బీభత్సంగా బ్యాటింగ్ చేసేవాడు. ఇప్పుడు మాత్రం తేలిపోతున్నాడు. ఇటీవలి న్యూజిలాండ్ సిరీస్లో అతడి గణాంకాలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయని" పాంటింగ్ వ్యాఖ్యానించాడు. పాంటింగ్ చేసిన వ్యాఖ్యలపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.."విరాట్ ఎలా ఆడతాడో మాకు తెలుసు. అతని ఫామ్ గురించి ఆందోళన అవసరం లేదు. అతడు తన లయను దొరకబుచ్చుకోవడం పెద్ద కష్టం కాదని" గంభీర్ వ్యాఖ్యానించాడు. ఇక మరోవైపు ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ కెర్రి ఓ కీఫె కూడా విరాట్ పై విమర్శలు చేశాడు.

## ఇండియన్ క్రికెట్ హిస్టరీలో సంజూ ఒక్కడే?



స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తాజాగా టీ20 క్రికెట్‌లో ఒక చెత్త రికార్డును సృష్టించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో కేవలం రెండు బంతులు ఆడి డకౌట్ అయ్యారు. అంటే, ఆయన ఏ పరుగులు చేయలేకపోయారు. అయితే, ఈ సిరీస్‌లో ముందుగా ఆయన అద్భుతంగా ఆడాడు. మొదటి మ్యాచ్‌లో కేవలం 50 బంతుల్లో 107 పరుగులు చేసి శతకం సాధించారు. ఇలా వరుసగా రెండు టీ20 మ్యాచ్‌లలో శతకం చేసిన మొదటి భారతీయ క్రికెటర్‌గా ఆయన నిలిచారు. సంజు శాంసన్ అద్భుతంగా ఆడిన తర్వాత, ఆయన ఫామ్ పూర్తిగా తగ్గిపోయింది. గిబర్హా, సెంటురియన్ మ్యాచ్‌లలో వరుసగా రెండు బంతుల్లోనే ఔట్ అయ్యారు. ఇలా వరుసగా రెండు శతకాలు చేసి, తర్వాత వరుసగా రెండు బంతుల్లో డక్ ఔట్ అయిన ఘటన టీ20 క్రికెట్ చరిత్రలో ఇంతకు ముందు జరగలేదు. ఈ రికార్డును సృష్టించిన మొదటి బ్యాట్స్‌మన్ సంజు శాంసన్ అయ్యాడు. 2024 సంవత్సరంలో సంజు శాంసన్‌కు మిశ్రమ ఫలితాలే వచ్చాయి. ఒకే సంవత్సరంలో అత్యధిక సార్లు డక్ అవుట్ అయిన భారతీయ బ్యాట్స్‌మన్‌గా ఆయన రికార్డును సృష్టించారు. ఆయన 5 సార్లు డక్ అవుట్ అయ్యారు. మొత్తంగా టీ20 క్రికెట్‌లో ఆయన 6 సార్లు డక్ అవుట్ అయ్యారు. భారతీయ ఆటగాళ్లలో రోహిత్ శర్మ (12 సార్లు), విరాట్ కోహ్లి (7 సార్లు) తర్వాత ఈ రికార్డులో మూడవ స్థానంలో ఉన్నారు. సంజు శాంసన్ తన 30వ పుట్టినరోజును నవంబర్ 11న జరుపుకున్నారు. కానీ ఈ కొత్త దశలో అతని ప్రదర్శనలు అంతంత మాత్రమే ఉన్నాయి. ఇటీవల కాలంలో అతను కొన్ని మ్యాచ్‌లలో బాగా ఆడాడు. ఈ ఏడాదిలో ఆడిన ఆరు మ్యాచ్‌లలో దాదాపు 43 సగటుతో 257 పరుగులు చేశాడు.

# జిగెలుమనే లైట్ల మధ్య బాల్ బ్యాడ్మింటన్




**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 14 నవంబర్ 2024**మణికొండ మునిసిపాలిటీ వార్డు 8 అంతర్గతంగా ఉన్న అలకాపురి నందు ప్రఖ్యాతిగాంచిన జయశంకర్ పార్క్ పరిసర ప్రాంతాలలో తిరుగడానికి, బాల్ బ్యాడ్మింటన్ ఆటలు ఆడడానికి చిమ్మ చీకట్లో ప్రజా జీవనం కొనసాగిస్తున్న విషయం గమనించిన స్థానిక కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్ గత కొంతకాలంగా ప్రత్యేక శ్రద్ధ వహించి ముందుకు సాగుతూ సరియగు స్తలాలలో విద్యుత్ శక్తి పోల్ లు పెట్టించిన దరిమిలా శ్రీనివాస్ రావు, ఆనంద్ రావు, హరనాథ్ రెడ్డి, రమేష్, దేవేందర్ రెడ్డి, రాజు, గోపాల్ రావు తది తరులతో కలసి స్థానిక ప్రజలు తమ సంతోషం వ్యక్త పరుస్తూ అధికారులకు, సిబ్బందికి, నవీన్ కుమార్ లకు హృదయ పూర్వక అభినందన తో కూడిన ధన్యవాదములు తెలియ పరచినారు

# మణికొండ రెడ్డి ఫౌండేషన్ కార్తీకమాస ఆత్మీయ సమ్మేళనం -2024



**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 14 నవంబర్ 2024**మణికొండ రెడ్డి ఫౌండేషన్ ఎం.ఆర్.ఎఫ్ ద్వారా నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన నెలసరి కార్యవర్గ సమావేశం గురువారం ఉదయం జరిగినదని ఈ కార్యక్రమంలో ప్రధాన చర్చనీయాంశంగా కార్తీకమాస సహపంక్తి వనభోజనంలో భాగంగా కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం-2024 ఈనెల 24వ తేదీన నార్సింగిలోని కే.వీ.ఎం.ఆర్ ప్రైమ్ గార్డెన్ లో చేయడానికి నిర్ణయించడం జరిగినదని కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, శ్రీపతి రెడ్డి, రామ సుబ్బారెడ్డి, శరత్ రెడ్డి, రమణా రెడ్డి, బాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, కిషన్ రెడ్డి, లవన్ కుమార్ రెడ్డి, సైదిరెడ్డి, శైలజా రెడ్డి, మరియు ప్రియా రెడ్డిలు తెలియ పరచినారు.

# సింగరేణిలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం




**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 14:**మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు-2024 ను గురువారం ఇన్చార్జి జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్ హాజరై జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బొగ్గు నాణ్యత వారోత్సవాలు ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సారథ్యంలో మన సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిలిచిందన్నారు. దేశంలోని వివిధ సంస్థలకు ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు న్యాయమైన



బొగ్గును గత 134 సంవత్సరాలుగా సరఫరా చేస్తూ మన దేశ ఆర్థిక ప్రగతి లో సుస్థిర స్థానం సంపాదించుకున్నదన్నారు. ప్రస్తుత పోటీ మార్కెట్లో ఇతర బొగ్గు సంస్థలకు దీటుగా సింగరేణి సంస్థ కూడా తన బొగ్గు నాణ్యత ప్రమాణాలను మరింతగా పెంచుకోవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. ఏ సంస్థకైనా దాని మనుగడ మరియు పురోభివృద్ధి ఆ సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతలతో పాటు ఉత్పత్తి అయిన వస్తు నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. విద్యుత్ రంగంలో సంభవించిన మార్పుల ఫలితంగా నేడు యావత్ భారతదేశం ఒకే పంపిణీ వ్యవస్థ కిందకు రావడం జరిగిందని అందువలన తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి చేసే సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ సంస్థల పురోగతి మనం సరఫరా చేసే నాణ్యమైన బొగ్గుపైన ఆధారపడి ఉన్నదని విషయాన్ని గ్రహించాలన్నారు. మన వినియోగదారుడి మనుగడ పైనే మన అభివృద్ధి ఆధారపడి ఉన్నదనే విషయం మనం గుర్తుంచుకోవాలన్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి ప్రతి సింగరేణియుడు తన వంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం మన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టీ.యూ.సీ మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరి సలేంద్ర సత్యనారాయణ, క్వాలిటీ ఇంచార్జ్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఏ.ఐ.టీ.యు.సీ జి.ఎం కార్యాలయ పిట్ సెక్రటరీ సాంబశివరెడ్డి, డి.వై.పి.ఎం ఎం.డి ఆసిఫ్, అన్ని డిపార్ట్ మెంట్ల హెచ్.ఓ.డి లు, జి.ఎం కార్యాలయ సిబ్బంది, క్వాలిటి సిబ్బంది పాల్గొన్నారు.

# కార్తీక పౌర్ణమి సందర్భంగా "కి శ్రే" కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ అధ్వర్యంలో పులిహోర మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ



**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 14** : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట వద్ద శ్రీరామా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భక్తులకు పులిహోర మజ్జిగ ప్యాకెట్ అందజేయడం జరుగుతుంది.గురువారంఈ సేవ కార్యక్రమంలో కన్నెపల్లి గ్రామం నుండి డిసిసి నెంబర్ చుంచు నాగేష్,లేశెట్టి చంద్రయ్య,ఎమ్మడి అరవింద్,ముత్య అజయ్,బొడ్డు అజయ్, సాట్ల హరీష్,బొడ్డు విష్ణు, పాల్గొనడం జరిగింది.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 14** : మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్నరకం 'గ్రేడ్ ఏ' వరి ధాన్యానికి క్వింటల్ కి 500 రూపాయలు బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ సర్పంచ్ లు ఒడ్నాల కొమురయ్య, సహకార సంఘం చైర్మన్ సల్వాజి ప్రభాకర్ రావు, డైరెక్టర్స్, మండల వ్యవసాయ అధికారులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్, రైతులు పాల్గొన్నారు.

# 71వ అఖిల భారత సహకార యూనియన్ లిమిటెడ్ వారోత్సవాలు జెండా ఎగురవేసిన డిసిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తిప్పని లింగయ్య



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 14 :** 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం జెండా వెంకటాపూర్,లక్షెట్టిపేట సంఘ కార్యాలయ ఆవరణలో డిసిఎంఎస్ చెర్మన్ తిప్పని లింగయ్య ఏడురంగుల సహకార జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. గురువారం ఈ సందర్భంగా డిసిఎంఎస్ చెర్మన్ తిప్పని లింగయ్య మాట్లాడుతూ... సహకార పతాక విశిష్ట ఫ్రెంచి సహకార వెత్త చార్లెస్ పొరిరియన్ సహకార ఉద్యమ ప్రగతి ఏడు రంగుల జెండాను సూచించారు.1923వ సంవత్సరంలో మొట్ట మొదటిసారిగా "అంతర్జాతీయ సహకార సమితి"ఈ పతాకమును అంగీకరించారు,ఈ పతాకం

లోని ప్రతి రంగునకు ఒక ప్రత్యేక అర్థం ఇవ్వబడింది. ఈ ఏడు రంగులను

(VIBGYOR) అనుపదం ద్వారా పలుక వచ్చును,ఈ ఏడు రంగులు ఇంద్రధనస్సు

రంగులు,ఇది"భిన్నత్వంలో ఏకత్వం"నునిరూపించు చున్నవి"సమాజంలో బడుగు,బలహీన వర్గాలకు సహాయపడడం మన దేశ ప్రధాన ఆశయాల్లో ముఖ్యమైనది.ఈ ఆశయ సాధనకు సహకార విధానమే



శరణ్యం "జవహర్ లాల్ నెహ్రూ ఆనాడే అన్నారు. అంతేకాకుండా"భారతదేశానికి అత్యున్నత నమ్మకమైనది సహకార విధానం.ఇది కూలిపోతే గ్రామీణ ప్రజల ఆశలు ఫలవంతం కావు"

జవహర్ లాల్ నెహ్రూ సూచించారు."కలిసి ఉంటే నిలబడుతాం విడిపోతే పడిపోతాం"రవీంద్రనాథ్ ఠాగూర్ అని అన్నారు.


"సహకారం బలహీనుల రక్షణ కవచమే తప్ప బలవంతుల ఆయుధం కాదు"గాంధీజీ అన్నారు.



అంతే కాకుండా మరో మాట"సహకారోద్యమం నైతిక ఉద్యమంగా కొనసాగినంత కాలం అది భారతదేశానికి వర ప్రసాదమే అవుతుంది"

గాంధీజీ అన్నారు. "సహకారం వరం లాంటిది.దాని ద్వారా మాత్రమే దేశాన్ని ముందుకు తీసుకుపోగలం"మహాత్మా గాందీ అన్నారు."సహకార వ్యవస్థ ప్రభుత్వ విభాగాల ప్రమేయానికిగాని,వత్తిడికిగాని లోనుగాకుండా స్వేచ్ఛగా పనిచేయాలి. "నెహ్రూ అన్నారు. "విపరీతమైన ప్రభుత్వ జోక్యంతో సహకార సంస్థలపై నియంత్రణ అధికమైతే సహకారోద్యమాభివృద్ధి కుంటుపడుతుందనడంలో సందేహం లేదు"నెహ్రూ అన్నారు.ఇంక "ప్రతి గ్రామానికి ఒక పంచాయితీ,ఒక సహకార సంఘం,ఒక పాఠశాల తప్పనిసరిగా ఉండాలి" గాంధీ ఆనాడు చూస్తారు."19 వ శతాబ్దంలో ప్రపంచానికి లభించిన ఆర్థిక అద్భుతాలలో సహకారం ఒకటి"డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ అని అన్నారు."సహకారం అనేది ప్రజలచేత,ప్రజల బాగు కొరకు నడిపించబడే ఉద్యమం"ఇందిరా గాంధీ అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్-చైర్మన్ కాసు సురేష్,డైరెక్టర్ లు వేల్తపు శ్రీకర్,అప్పని లింగన్న , దాందేని లక్ష్మయ్య, కాంద్రపు సతయ్య,బెంబడి పౌలు,సెక్రటరీ విష్ణువర్ధన్ రావు, సంఘం సిబ్బంది మరియు కో ఆపరేటివ్ డిపాజిట్ మెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్ధి ఆత్మహత్య



కుత్బుల్లాపూర్.. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనిజాంపేట్ శ్రీ చైతన్య బాయ్స్ ఎలైట్ క్యాంపస్ లో ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి జశ్వంత్ గౌడ్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుక్రనారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన జశ్వంత్ గౌడ్ ఉరివేసుకున్నాడని తల్లి తండ్రులకు కాలేజీ యాజమాన్యం ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. నిజాంపేట్ హోలిస్టిక్ హాస్పిటల్ కి వైద్యం కోసం తీసుకెళ్లా. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. .

# మహిళా మావోయిస్టు అరెస్టు

భద్రాచలం పోలీసుల తనిఖీలలో మావోయిస్టు పామేడ్ ఏరియా కమిటీ సభ్యురాలు దొరికిపోయింది. దుమ్ముగూడెం మండలం సీతానగరం వద్ద పోలీసుల తనిఖీలలో అనుమానాస్పదంగా ఉన్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజాపూర్ జిల్లా పామేడ్ ఏరియా కమిటీకి చెందిన క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం సభ్యురాలు ఓయెమ్ నందేఏ సమ్మక్క అరెస్ట్ అయింది. అదుపులోకి తీసుకున్న మహిళా వద్ద నుండి మావోయిస్టు కరపత్రాలు మరియు సాహిత్యం స్వాధీనం చేసుకొని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

## శ్రీనగర్ రెజొనెన్స్ లో జాతీయ బాలల దినోత్సవం మరియు స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 14 (ప్రజాబలం)** ఖమ్మం స్థానిక శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్లో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతిని పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవ వేడుకలు మరియు స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా చిన్నారుల ఆటపాటలతో వారి కేరింతల నడుమ ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు మరియు కొండా కృష్ణవేణి పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు బాలల దినోత్సవ మరియు స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు మాట్లాడుతూ కల్మషం లోని పిల్లలు అంటే నెహ్రూ కి అమితమైన ప్రేమ ఇష్టం అంటూ దేశ నిర్మాణం జరిగేది పాఠశాలలోనే గాని పార్లమెంట్లో కాదు అని నెహ్రూ మాటలను గుర్తు చేస్తూ నెహ్రూ మరణాంతరం 1964 నుంచి వారి పుట్టినరోజు నవంబర్ 14ను జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామంటూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లాలంటి మంచి వ్యక్తిత్వం, సృజనాత్మకత నిజాయితి ఆరోగ్యం జ్ఞానం ఆవిష్కరణ నైపుణ్యాలు అంకితభావం గౌరవం ఉత్సాహవంతమైన శక్తి వంటి లక్షణాలు ప్రతి విద్యార్థి అలవర్చుకొని జాతి నిర్మాణానికి, దేశాభివృద్ధికి తోడ్పడాలని తెలియజేసారు శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్ లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా దేశ నిర్మాతలుగా తయారుచేస్తూ నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక మరియు సహపాఠ్య కార్యక్రమాలను భోదిస్తూ వ్యక్తిగత అభివృద్ధితో దేశాభివృద్ధికి బాటలు వేస్తూ విద్యార్థులలో సర్వతో ముఖాభివృద్ధిని





పెంపొందిస్తూ నూతన ఆవిష్కరణలకు వేదికను అందిస్తున్నామని తెలియజేసి చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు స్వయం పరిపాలన దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని విద్యార్థి ఉపాధ్యాయులుగా భోదన చేసి గురువుగా ప్రత్యక్ష అనుభూతి పొందిన ప్రతి విద్యార్థిని అభినందిస్తూ విజేతలకు బహుమతులను అందించి అందరిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు అని చెప్పిన నెహ్రూ మాటలు తెలియజేస్తూ బాల్యం ఎంతో విలువైనదని సరైన మార్గాలలో మిమ్మలను నడిపిస్తూ ఉన్నత వ్యక్తిత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ సిద్ధం చేస్తుందని తెలియజేస్తూ విద్యార్థి ఉపాధ్యాయులను అభినందిస్తూ చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు

## గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుడు నెహ్రూ

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

### ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 14 (ప్రజాబలం)** ఖమ్మం బ్రిటిష్ కబంధ హస్తాల నుండి భారత దేశాన్ని రక్షిసించిన గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుడు నెహ్రూ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ కొనియాడారు. గురువారం జవహర్ లాల్ నెహ్రు జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిసిసి అధ్యక్షులు దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధ్యక్షులు రాయల నాగేశ్వర్ రావుతో కలిసి నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ అలీనోద్యమానికి ఆద్యుడు సోషలిజానికి జైకొట్టిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని అన్నారు . బ్రిటిష్ పాలనలో దోపిడీకి గురైన దేశ ఆర్థిక వ్యవస్థను పంచవర్ష ప్రణాళికలు చేపట్టి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఆయన పాటుపడ్డారని అన్నారు. ఇక, నెహ్రూకి బాలల అంటే ఎంతో ఇష్టం. అందుకే ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటామని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నవంబరు 20న చిల్డ్రన్స్ డే జరిపితే.. అంతకు 6 రోజుల ముందే భారత్‌లో ఈ వేడుక వస్తుంది అని అన్నారు. ప్రతి ఒక్కరూ నెహ్రూ ఆకాంక్షకు అనుగుణంగా, ఆయన స్ఫూర్తి తో ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటి కార్యనిర్వహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా ఐ ఎన్ టి యు సి మహిళ సేవాదళ్ అధ్యక్షులు, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య,సయ్యద్ గౌస్,కార్పొరేటర్ రాపర్తి శరత్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, షేక్ అబ్దుల్ రషీద్,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్యనారాయణ,కమతం రామక్రిష్ణ,నూకారపు వేంకటేశ్వరరావు, షేక్ అబ్బాస్ భేగ్, బాణాల లక్ష్మణ్, రజీ భాయ్,సంపటం నరసింహరావు, బెజ్జం గంగాధర్,బీరెడ్డి రమేష్,భూక్యా సురేష్,మహమూద్, పాషా, గౌస్ పాషా, ఫరీద్ ఖాద్రి, బడేమియా, సాయి కిరణ్, కందుల వెంకటనారాయణ, గోపీ నాయక్,దొడ్డ నగేష్, పర్వత శ్రీనివాస్, భవాని, కందుల శ్రీనివాస్, కొలిపొంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు






**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 14** :మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని తిరస్కరించుకొని బాలల దినోత్సవం వేడుకలను గురువారం సింగరేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శ్యాంసుందర్ హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పిల్లల కోసం ఫ్యాషన్ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు, ఈ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మరియు ఇతర ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 14:**తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహిస్తున్న గ్రూప్ -3 రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు.

గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరేట్ తన ఛాంబర్లో ఏర్పాటు చేసిన టిజిపిఎస్సి గ్రూప్ -3 రాత పరీక్ష పై సమీక్షా సమావేశానికి డిఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్వాడ్స్,రూట్ ఆఫీసర్లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక అంశము నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని అదనపు కలెక్టరు సూచించారు. ఛీఫ్ సూపరింటెడెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రుప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలను సూచించారు. భద్రత పోలీసు శాఖ వారితో, నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు, అదనపు బస్సులు సంబంధిత శాఖల అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే మీకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలోరూట్ మ్యాప్ లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్ మెంట్ వంటి వాటిని సరిగా ఉన్నాయా అని పరిశీలించాలి. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేసారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ -3 పరీక్షలకు ఫ్లైయింగ్ స్వాడ్స్,రూట్ ఆఫీసర్లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్నజిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జవహర్లాల్ నెహ్రూ ఘనంగా జయంతి వేడుకలు

### హాజరైన ప్రముఖులు



**మెదక్ తూప్రాన్ ప్రజాబలం న్యూస్:-** తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జవహర్లాల్ నెహ్రూ 135వ జయంతి ఘనంగా నిర్వహించారు.

తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (%ుూఖీ%) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు జంపాల రాజేష్ గారి ఆదేశాల మేరకు జవహర్లాల్ నెహ్రూ 135వ జయంతి ఐడియల్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భీమరి సాయి సమర్, పాఠశాల ప్రిన్సిపల్ రజిని గారు , భాస్కర్ , గణేష్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం




**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నవంబర్ 14:**మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం నాచారం లోని వెస్లి ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలైట్ నాచారం అధ్యక్షుడు రాజారెడ్డి, ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో వెస్లి పాఠశాల ఉపాధ్యాయులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారు విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బాలల దినోత్సవ సందర్భంగా ఏస్ ఏస్ ఏస్ యువ సేన, లయన్స్ క్లబ్ ఎలైట్ సంయుక్తంగా పాఠశాలకు బ్లూటూత్ లౌడ్ స్పీకర్, మైక్ ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, కోటేశ్వరరావు, యువసేన సభ్యులు లోకేందర్ రెడ్డి, రమేష్ పటేల్, సాయి ప్రసాద్ రెడ్డి, సురేందర్, స్నేహితు రెడ్డి, భరత్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

## రెండు గంజాయి కేసులను ఛేదించిన తూప్రాన్ సీఐ రంగ కృష్ణ కు రివార్డ్ అందజేసిన మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, పోలీస్ అధికారులు



**తూప్రాన్, నవంబర్, 14 ప్రజాబలం న్యూస్ :-** మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మరియు మనోహరాబాద్ మండలాల్లో 10 కిలోల గంజాయి కేసులు చేదించిన తూప్రాన్ సిఐ రంగ కృష్ణ గారికి గురువారం ఉదయం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఐ పి ఎస్ గారు రివార్డ్ అందజేశారు. అంతే కాకుండా తూప్రాన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగ కృష్ణ మానవీయ కోణంలో స్పందించి చెడు మార్గంలో పయనిస్తున్న యువతను సన్మార్గంలో నడిపించడానికి కంకణ బద్దులై డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆనతి కాలంలోనే ఏకంగా రెండు గంజాయి కేసులు ఛేదించి తన దైన శైలిలో నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. ఒకటి తూప్రాన్ లోని లక్ష్మి నరసింహ వెంచర్ లొ మరోటి జీడిపల్లి లో ఛేదించి ప్రజలనుంచి మన్ననలను అందుకోగా జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా రివార్డ్ అందుకోవడం మరో విశేషం. ఇటీవల చిత్తు బొట్టు ఆట కట్టించిన సి ఐ రంగ కృష్ణ శభాష్ పల్లి లోని ఓ ఫామ్ హౌస్ లో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని ఈ ప్రాంతంలో విచ్చల విడిగా ఆడుతున్న జూదగాళ్ళ గుండెల్లో గుబులు పుట్టించారు. ఏది ఏమైనా పోలీస్ శాఖలో నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టేలా వారి భరతం పట్టేందుకు ఇలాంటి పోలీస్ ఆఫీసర్ ఉండడంతో తూప్రాన్ పోలీస్ సర్కిల్ నెర రహిత ప్రాంతంగా ఉండనుంది. అలాగే మనోరబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, ఐడి పార్టీ స్టాఫ్ నర్సింలు పి.ప్రసాద్ గౌడ్, సత్యం, నాగరాజు, సురేష్ , ముకుందం,రాజు, శ్రీనివాసరాథోడ్, ప్రశాంత్ రాజులకు గంజాయి కేసు చేదించినందుకు గాను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు ఎస్పి మహేందర్ డీఎస్పీ వెంకట్ రెడ్డి , చేతుల మీదుగా రివార్డ్ అందుకున్నారు.

# అంతర్జాతీయ బాలల దినోత్సవం




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 14**:అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం రోజున కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఇందులో ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, బాలల దినోత్సవం తెలుపుతూ, బాలబాలికలు చదువుతూనే ఏదైనా సాధించగలుగుతామని, ఉన్నత స్థాయిలో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ గారు మాట్లాడుతూ, బాల బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత గారు మాట్లాడుతూ బాలబాలిలకు అంతర్జాతీయ బాలల దినోత్సవం తెలుపుతూ బాలల రక్షణ మరియు సంరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని తెలిపారు బాలల రక్షణ వారి సంరక్షణకు రాష్ట్రస్థాయిలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 %డ%112 , బాలల 0 నుంచి 18 సంవత్సరాల చిన్నారులపై ఎలాంటి అఘాయిత్యాలైన, వారికి ఎలాంటి ఇబ్బంది ఉందో ఈ ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 24/7 పనిచేస్తుందని తెలియజేశారు. చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ లో పిల్లలకు వారి రక్షణ సంరక్షణకు, విద్య వైద్యం తోడ్పడుతున్నందుకు చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ మేనేజ్మెంట్ వారికి ధన్యవాదాలు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ రాజారెడ్డి గారు మాట్లాడుతూ బాల బాలికల రక్షణ వారి సంరక్షణకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, పిల్లల భద్రత మనందరి బాధ్యత అన్నారు, ఇట్టి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథ్ గారు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ నెంబర్ రామ్మోహన్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ నాగమణి గారు, సిడిపిఓస్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ సభ్యులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


# కలెక్టరేట్లో నిరసన




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 14**:టి జి ఈ జేఏసీ పిలుపుమేరకు 11 నవంబర్ తేదీ రోజున వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ మరియు ఇతర అధికారుల మీద జరిగినటువంటి దాడికి నిరసనగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఐడిఓసి కలెక్టరేట్ సముదాయంలో మధ్యాహ్నం లంచ్ విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి జి ఓ ప్రెసిడెంట్ జి వినోద్ కుమార్, మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి మరియు ప్రజలకు అనుసంధానం లాంటి వాళ్లు, వారికి పర్సనల్ ఎజెండా అంటూ ఏమీ ఉండదు. గవర్నమెంట్ యొక్క సూచనలు ప్రజలకు తెలియజేయడం మాత్రమే వారి యొక్క విధి, అలాంటి వారి మీద దాడి అన్నది అమానుషము. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని వారి మీద క్రిమినల్ కేసులు పెట్టాలని మరియు భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టి జి ఓ జనరల్ సెక్రటరీ డాక్టర్ కురుమూర్తి మరియు వైస్ ప్రెసిడెంట్ ఐ విజయ కుమారి మరియు ఇతర ఉద్యోగస్తులు పాల్గొనడం జరిగింది.

# అంగరంగ వైభవంగా తూప్రాన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంఠాయపాలెం వేణుగోపాల్ కూతురు కావ్యశ్రీ - సాహిత్ కృష్ణ ల కళ్యాణం

## హాజరై దీవించి ఆశీర్వదించిన ప్రముఖులు



**తూప్రాన్, నవంబర్,14. ప్రజాబలం న్యూస్ :-** తూప్రాన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, ఆంధ్ర ప్రభ డివిజన్ రిపోర్టర్, చత్తథ శ్రీవైష్ణవ సంఘం కార్యదర్శి జర్నలిస్ట్ కంఠాయపాలెం వేణు గోపాల్ - పద్మ ల కుమార్తె చిరంజీవి లక్ష్మి సౌభాగ్యవతి కావ్యశ్రీ వివాహం తిరుక్కోవల్లూర్ పారిజాతం కుమారుడు చిరంజీవి సాహిత్ కృష్ణ ల వివాహం నవంబర్ 14 బాలల దినోత్సవం, చాచా నెహ్రూ జన్మదినం రోజు ఒక మెమోరేబుల్ గా గురువారం ఉదయం 10 గంటల 16 నిమిషాలకు వేధ బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య అత్యంత వైభవంగా, కనుల పండువగా, అంగరంగ వైభోగంగా దేవి గార్డెన్స్ లో జరిగింది. సంప్రదాయ బద్ధంగా హిందూ సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. నూతన వధూవరులను



ఆశీర్వదించడానికి ప్రముఖులు నర్సాపూర్ ఎమ్మెల్యే , మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు ఆకుల రాజయ్య, ఎం.గిరీష్ రెడ్డి ల మున్సిపాలిటీ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ , వైస్ చైర్మన్ నంద్యాల శ్రీనివాస్ కౌన్సిలర్ శ్రీశైలం గౌడ్ ల తో పాటు తూప్రాన్ ప్రెస్ క్లబ్ నాయకులు, ఉమ్మడి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ జానకిరామ్, సీనియర్ జర్నలిస్ట్ లు అర్.శివ శంకర్ గౌడ్,పెద్దిగారీ నగేష్, జీ.భాస్కర్ గౌడ్, చెంది శ్రీనివాస్, పూర్ణ రాజు, టి.నాగరాజు, వి.శివకృష్ణ గౌడ్, గడ్డం ప్రశాంత్ కుమార్, చేలిమెల రామస్వామి, జయ్ పాల్ రాథోడ్, మచ్చ యాదగిరి, సర్గాల స్వామి, నవీన్, శివ, గౌస్ భాయ్, షకీల్ భాయ్, లయన్స్ క్లబ్ నాయకులు డాక్టర్ ప్రదీప్ సీహ్మ, పల్లెర్ల రవీందర్ గుప్త, భారతీయ జనతా పార్టీ నాయకులు ఆకుల రాజయ్య, ఎం.గిరీష్ రెడ్డి, బండారు దుర్గరాజు యాదవ్, భూమన్నగారి జానకిరామ్, నర్సోజి, అర్. మహేష్ గౌడ్, కొండి సిద్ది రాములు యాదవ్, నరసింహ రెడ్డి, గట్టు అమర్, సాయిబాబా గౌడ్, గడ్డం శ్రీనివాస్ , సురేష్ గౌడ్ , బజార్ రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్.చిన్న నాగరాజు గౌడ్, బిఅర్ ఎస్ నాయకులు సతీష్ చారి, అర్.ఎస్.ఎస్. స్వయం సేవక్ లు ఏపూరి రాజు బయ్యా, గెంత్యాల నాగరాజు, అర్.అశోక్ గౌడ్, స్వర్గం వెంకట నారాయణ, భజరంగ్ దళ్ నాయకులు తాటి విఠల్, గడ్డం రవీందర్ , విశ్వ హిందు పరిషత్ నాయకులు బొడ్డు శ్రీహరి, మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కౌన్సిలర్ లు శ్రీశైలం గౌడ్, జిన్న భగవాన్ రెడ్డి, మామిడి వెంకటేష్ , రవీందర్ రెడ్డి , పల్లెల రవీందర్ గుప్తా నాయకులు బాలేష్ , కుమార్, మల్లికార్జున్ గౌడ్, వేణు గౌడ్, సురేష్ గౌడ్, ప్రకాష్ గౌడ్ , తదితరులతో పాటు వర్తక వాణిజ్య వ్యాపార సంస్థల అధిపతులు, రియల్ ఎస్టేట్ రంగం వారు, తూప్రాన్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# స్నేహంలో తోడుగా ఆపదలో అండగా మేమున్నామంటూ 'స్నేహ' హస్తం..



ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 14 : లక్షెట్టిపేట మండలంలోని దౌడేపల్లి గ్రామానికి చెందిన బుర్ర వెంకటేష్ ప్రమాదానికి గురై కాలుకి శస్త్ర చికిత్స చేసుకోవడంతో, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులలో ఉన్నడని తెలుసుకున్న పదవ తరగతి స్నేహితులు మిత్రునికి అండగా నిలిచారు.ప్రతి ఒక్క స్నేహితుని ఆనందంలోనే కాదు ఆపదలోనూ మేమున్నామని స్నేహితులంతా ఒక్కటై తోడుగా ఉన్నారు.మిత్రులంతా కలిసి ఆర్థికంగా సహాయం చేయడం ద్వారా స్నేహానికి విలువ వస్తుంది.మిత్ర బృందం తరపున రూ. 20500 ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర వస్తువులు వెంకటేష్ కి అందించారు. ఈ కార్యక్రమంలో 2002 పదవ తరగతి బ్యాచ్ మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

# పిల్లలకు వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 14** : పుట్టినప్పటి నుండి పిల్లలకు అందించవలసిన వ్యాక్సినేషన్లను పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లావైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్తో కలిసి మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల వైద్యాధికారులు, సూపర్వైజర్లకు టీకాల కార్యక్రమం మైక్రో యాక్షన్ ప్లాన్ అమలు, సరైన రీతిలో టీకాలు అందజేత అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పిల్లలకు పుట్టినప్పటి నుండి అందించవలసిన టీకాలను కోల్డ్ చైన్ సిస్టమ్తో నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా శిక్షణ పొందాలని తెలిపారు. పోలియో, మసూచి లాంటి ఎన్నో వ్యాధులను వ్యాక్సినేషన్ ద్వారా నిర్మూలించడం జరిగిందని,పిల్లలకు పుట్టినప్పటి నుండి ఓరల్ పోలియో వ్యాక్సిన్,డి.పి.టి., బి.పి.టి.,మీజిల్స్, రూబెల్లా, హెపటైటిస్-బి ఇవ్వడం జరుగుతుందని, బర్త్ ప్లానింగ్లో వ్యాక్సిన్ ఎక్కడ తీసుకోవాలనే వివరాలను తెలియజేయాలని, సక్రమంగా అందించాలని తెలిపారు.కోల్డ్ చైన్ సిస్టమ్లో ఎలాంటి పొరపాట్లు చేయరాదని, ఐ.ఎల్.ఆర్.డీ ఫ్రీజర్ను ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు సక్రమంగా నిర్వహించాలని, డి.పి.టి. డోస్ 5 సం?లకు, 10 సం?లకు, 16 సం?లకు పాఠశాల ఆవరణలో అందజేయాలని, యువిన్ పోర్టల్లో వివరాలు నమోదు చేయాలని, హెచ్.ఎం.ఐ.ఎస్.లో అందజేసిన వ్యాక్సిన్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో ప్రతి బుధవారం, గ్రామాలలో ప్రతి శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలని,పిల్లల వివరాలను ముందే తెలుసుకొని జాబితా ప్రకారం 100 శాతం వ్యాక్సిన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి వ్యాధుల నుండి దూరం చేయడానికి వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డా? అనిత, వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా? సుధాకర్ నాయక్, డబ్ల్యు.హెచ్.ఓ. కన్సల్టెంట్ డాక్టర్ అతుల్, రాష్ట్ర బృందం నుండి డా? జ్యోత్స్న, డా? మురారి దేవిడ్లు వైద్యులకు, సిబ్బందికి టీకాలు, నిల్వలు, క్యారియర్ల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాక్సిన్పై తీసుకుంటున్న జాగ్రత్తలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో డి.పి.హెచ్.ఎన్.పద్మ, డి.పి.ఓ. ప్రశాంతి, సి.హెచ్.ఓ. వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి బైపాస్ లోఆర్సీ పురం జంక్షన్ వద్ద న రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మహిళలు మృతి, మరో ఇద్దరికీ గాయాలు?

తిరుపతి గురువారం తెల్లవారుజామున ఆర్సీపురం జంక్షన్ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మి నగర్ క్షత్రియ ఎన్క్లేవ్ అపార్ట్మెంట్ వుంటున్నల బిల్డర్ గా రాజశేఖర్ రాజు గృహ ప్రవేశాని హాజరయిన బంధువులు తిరుగు ప్రయాణం లో ప్రమాదం జరిగింది.ఆర్సీ పురం క్రాస్ వద్ద హైవే పై కారులో రోడ్డు దాటుతున్నప్పుడు బాలాజీ ట్రావెల్ బస్సు డీకొంది. ఈ ప్రమాదం లో గాయాలయివారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు., సావిత్రి (80), సంగీత (38) చనిపోయారు. జ్యోతి, లక్ష్మి దేవి లు కు గాయాలయ్యాయి.

## పూర్తయిన రైల్వే ట్రాక్ పునురద్దరణ

# రైళ్ల రాకపోకలు ప్రారంభం

పెద్దపల్లి రాఘవపూర్ కన్నాల మధ్య పూర్తిస్థాయి రైల్వే ట్రాక్ పునరుద్దరణ జరిగింది. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ధ్వంసమైన మూడు లైన్ ల ట్రాక్ పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేసారు. బుధవారం రాత్రి 8 గంటల వరకు ఒక ట్రాక్ ను వినియోగంలోకి రైల్వే అధికారులు తెచ్చారు. వెయ్యిమందికి పైగా 24 గంటలు శ్రమించి ధ్వంసమైన వంద మీటర్ల వరకు మూడు లైన్ ల రైలు మార్గం పునఃరుద్ధరణ పూర్తి చేసారు. కాజీపేట బల్లార్షా మార్గంలో రైల్లు యదావిధిగా నడుస్తున్నాయి. రిపేర్ అయిన పట్టాలపై మొదటిసారి సికింద్రాబాద్ నుంచి జమ్ముతావికి వెళ్ళింది. గురువారం ఉదయం నుంచి రైళ్ళ రాకపోకలు కొనసాగుతున్నాయి.

## పట్నం నరేందర్ రెడ్డిని పరామర్శించిన హరీష్ రావు

హైదరాబాద్ వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి కుట్ర కేసులో అరెస్ట్ అయి బుధవారం నుంచి చర్లపల్లి జైలులో ఉన్న కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, చర్లపల్లి జైలుకు చేరుకుని ములాఖాత్ అయ్యారు. అయన వెంట బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్తీక్ రెడ్డి, నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## విశాఖలో సిపిఎం అందోళన

వివాఖపట్నం కూటమి ప్రభుత్వంలో వైఫల్యాలను వ్యతిరేకంగా విశాఖలో సిపిఎం నేతలు నిరసనకు దిగారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజ లపై అధిక భారాలను మోపు తోందని సిపిఎం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.రాష్టంలో మహిళపై అత్యాచారాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని,పెరిగిన ధరలు ప్రజలపై మరింత భారాన్ని మోపు తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com